


సమాజ హితం - మా అభిమతం

www.arunaprabha.com

# అరుణ ప్రభ

ARUNAPRABHA TELUGU DAILY

తెలుగు దినపత్రిక

RNI NO. TEL TEL/2023/89778




రంగారెడ్డి - హైదరాబాద్ సంపుటి : 04 సంచిక : 218 పేజీలు : 12, వెల రూ. 5/- బుధవారం, సెప్టెంబరు 30, 2026

PUBLISHED FROM RANGAREDDY, HYDERABAD. CIRCULATED BY : RANGAREDDY, NALGONDA, KHAMMAM, KARIMNAGAR, WARANGAL, MAHABOOBNAGAR, MEDAK, NIZAMABAD, ADILABAD, CHITTOOR, VISAKHAPATNAM, SRIKAKULAM, ELURU, ONGOLE, VIJAYAWADA, SPSR NELLORE, PRAKASHAM, GUNTUR, KURNOOL, KADAPA


### బొగ్గు కొనుగోలుపై ప్రభుత్వ నిర్ణయాన్ని

# తప్పుబట్టిన కేటీఆర్

- ఇది మరో తుగ్లక్ నిర్ణయమంటూ కాంగ్రెస్ ప్రభుత్వంపై విమర్శ
- చౌకగా లభించే సింగరేణి బొగ్గును కాదని విదేశీ బొగ్గు కొంటున్నారని ఆరోపణ
- టన్నుకు రూ. 3,800 బదులు రూ.9,000 చెల్లిస్తున్నారని ఆగ్రహం
- ఎవరి ప్రయోజనాల కోసం ఈ నిర్ణయమంటూ ఎక్స్‌లో కేటీఆర్ ప్రశ్న



తెలంగాణలో విద్యుత్ ఉత్పత్తి నిమిత్తం బొగ్గు కొనుగోలపై కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్రంగా తప్పుబట్టారు. దీనిని కాంగ్రెస్ ప్రభుత్వపు మరో 'తుగ్లక్ నిర్ణయం'గా ఆయన అభివర్ణించారు. ఈ మేరకు సోషల్ మీడియా వేదికగా 'ఎక్స్' ద్వారా ఆయన తన నిరసనను వ్యక్తం చేశారు. చౌకగా లభించే సింగరేణి బొగ్గును పక్కనపెట్టి, భారీ ధర వెచ్చించి విదేశీ బొగ్గును దిగుమతి చేసుకోవాలని ప్రభుత్వం నిర్ణయించడంపై కేటీఆర్ మండిపడ్డారు. సింగరేణి బొగ్గు టన్నుకు సుమారు రూ. 3,800కే అందుబాటులో ఉండగా, విదేశాల నుంచి దాదాపు రూ. 9,000 వెచ్చించి దిగుమతి చేసుకునేందుకు ప్రభుత్వం సిద్ధమవడాన్ని ఆయన ఆక్షేపించారు. ఈ నిర్ణయం వెనుక ఎవరి ప్రయోజనాలు దాగి ఉన్నాయని, ఈ అదనపు భారాన్ని రాష్ట్ర ప్రజలపై

- మిగతా 2వ పేజీలో



# ఎన్నికల 'మ్యాచ్ ఫిక్సింగ్'.. ప్రధాని మోదీ రాజీనామా చేయాలి

- ఎన్నికల ప్రక్రియలో 'మ్యాచ్ ఫిక్సింగ్' జరుగుతోందని కాంగ్రెస్ ఆరోపణ
- ప్రధాని మోదీ, హోంమంత్రి అమిత్ షా రాజీనామాకు డిమాండ్
- 13.30 కోట్ల ఓట్లను తొలగించారని, వాటిని పునరుద్ధరించాలని తీర్మానం
- ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్‌ను వెంటనే తొలగించాలని పట్టు
- పార్లమెంటు, కోర్టులు, వీధుల్లో పోరాడతామని కాంగ్రెస్ ప్రకటన

ఎన్నికల ప్రక్రియలో భారీగా అక్రమాలు చోటుచేసుకుంటున్నాయని ఆరోపిస్తూ కాంగ్రెస్ పార్టీ, కేంద్ర ప్రభుత్వంపై, ఎన్నికల సంఘంపై తీవ్ర స్థాయిలో విరుచుకుపడింది. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షా నైతిక బాధ్యత వహిస్తూ తక్షణమే తమ పదవులకు రాజీనామా చేయాలని కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ (సీడబ్ల్యూసీ) డిమాండ్ చేసింది. మంగళవారం ఢిల్లీలో పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే అధ్యక్షతన జరిగిన సీడబ్ల్యూసీ సమావేశంలో ఈ మేరకు కీలక తీర్మానాన్ని ఆమోదించారు.

## దేవుడి పేరుతో రాజకీయాలు వద్దు

- దేవుడి పేరుతో రాజకీయాలు చేయడం సరికాదన్న పొన్నం
- ప్రతి ఒక్కరి విశ్వాసాలను గౌరవించడం మన సంస్కృతి అని వ్యాఖ్య



## మేం ట్యాంపరింగ్ చేస్తే 400 సీట్లు వచ్చేవి



- ఓట్ల ట్యాంపరింగ్ ఆరోపణలపై కాంగ్రెస్‌కు బీజేపీ కౌంటర్
- రాహుల్ గాంధీని ప్రతిపక్ష నేత పదవి నుంచి తొలగించాలని డిమాండ్
- సోనియా గాంధీ ఓటుపై రాహుల్ సమాధానం చెప్పాలన్న అరవింద్

# నాతో పెట్టుకుంటే ఆధారాలు బయటపెడతా

- కేటీఆర్ వ్యాఖ్యలపై టీఆర్ఎస్ చీఫ్ కవిత ఆగ్రహం
- కేసీఆర్‌పై పార్టీ వైఫల్యాలు నెడుతున్నారంటూ విమర్శలు
- కేటీఆర్ తీరు పార్టీ వ్యతిరేకం కాదా అంటూ నిలదీత
- ఫామ్‌హౌస్‌లు, క్విడ్ ప్రో కోపై ఆరోపణలు
- రైతు, మహిళ పట్ల వ్యాఖ్యలపై కేటీఆర్‌పై విమర్శలు



# క్యాంపులో కలకలం..

- హెడ్ కానిస్టేబుల్ కాల్పుల్లో నలుగురు జవాన్లు మృతి
- సేవా పవర్ ప్రాజెక్ట్ వద్ద ఘటన
- సహచరులపై కాల్పులు జరిపిన హెడ్ కానిస్టేబుల్
- ఈ ఘటనలో నలుగురు మృతి



జమ్మూ కాశ్మీర్ కథువా జిల్లాలోని బసోలిలోని జ×ూఖీ క్యాంపులో సైనికుడు తన తోటి సైనికులపై కాల్పులు జరపడంతో నలుగురు సైనికులు మరణించారు. మంగళవారం జరిగిన - మిగతా 2వ పేజీలో

# పల్లె పండుగ 3.0 ప్రారంభం.. గ్రామాలకు రూ.11,085 కోట్లు



### రామాపురంలో లాంఛనంగా ప్రారంభించిన చంద్రబాబు, పవన్

- ఉదయగిరిలో 'పల్లె పండుగ-3' కార్యక్రమాన్ని ప్రారంభించిన సీఎం చంద్రబాబు
- రాష్ట్రవ్యాప్తంగా గ్రామీణ రోడ్ల అభివృద్ధికి రూ.1,185 కోట్లు కేటాయించినట్లు ప్రకటన
- గత ప్రభుత్వ ఐదేళ్ల పాలనతో తమ రెండేళ్ల పాలనను పోల్చిన ముఖ్యమంత్రి
- వెలిగొండ ఫేజ్-2 పూర్తితో పాటు ఉదయగిరి ప్రాంతానికి పలు ప్రాజెక్టులు మంజూరు
- సంక్షేమం, అభివృద్ధి, సుపరిపాలనే ఎన్డీయే ప్రభుత్వ మంత్రమని స్పష్టీకరణ
- రూ.11,085 కోట్ల భారీ బడ్జెట్‌తో 'పల్లె పండుగ 3.0' ప్రారంభం
- నెల్లూరు జిల్లాలో సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ చేతుల మీదుగా శ్రీకారం
- 15,500 కిలోమీటర్ల గ్రామీణ రోడ్ల నిర్మాణానికి రూ.10,250 కోట్లు కేటాయింపు
- పాడి రైతుల కోసం మినీ గోకులాలు, మ్యాజిక్ డ్రైన్లు, ఉద్యానవనాల ఏర్పాటు




అరుణ ప్రభ
ARUNAPRABHA TELUGU DAILY
బుధవారం, సెప్టెంబరు 30, 2026

# కేతన్ హత్య 5 వేల పేజీల ఛార్జిషీట్..

పూణేలో కేతన్ అగర్వాల్ హత్య కేసు దేశవ్యాప్తంగా సంచలనంగా మారిన సంగతి తెలిసిందే. కేతన్‌కు కాబోయే భార్య సియా గోయల్, ఆమె లవర్ చేతన్ చౌదరిలు కలిసి కేతన్ లోహగఢ్ కోటపై నుంచి తోసి హత్య చేశారు. ఈ కేసులో పోలీసులు 5053 పేజీల ఛార్జిషీట్ దాఖలు చేశారు. ఇందులో దారుణమైన విషయాలు వెలుగులోకి వచ్చాయి. చేతన్‌ను హత్య చేసేందుకు సియా, చేతన్ వీరిద్దరి స్నేహితుడు రితేష్ హాంగేలు కలిసి పనిచేసినట్లు ఛార్జిషీట్ పేర్కొంది. ఈ హత్యను ప్రమాదంగా చూపించేందుకు ఇంటర్నెట్, సోషల్ మీడియా, ఫోన్ డేటాను వాడుకున్నట్లు దర్యాప్తులో తేలింది. ఛార్జిషీట్లో మొబైల్ డేటా, వాట్సాప్ కాల్, కాల్ డీటెయిల్ రికార్డులు, ఫోటోలు, సాక్షుల వాంగ్మూలాలు , సాంకేతిక విశ్లేషణ వివరాలు ఉన్నట్లు పోలీసులు తెలిపారు. దాదాపుగా 80-85 మంది సాక్షులు వాంగ్మూలాలు ఉన్నట్లు తెలుస్తోంది.

**హత్య కోసం గూగుల్‌లో సెర్చ్..**

సియా, చేతన్‌లు హత్య తర్వాత సాక్షాలను, ఆధారాలను తొలగించడం, విష ప్రయోగం, డిజిటల్ ఆధారాలను తొలగించడంపై గూగుల్‌లో సెర్చ్ చేసినట్లు తేలింది. విషపూరిత పుట్టగొడుగుతో ఎలా చంపడం వంటి వాటిని వెతికారు. ఇదే కాకుండా మేఘాలయ సోనమ్ రఘువంశీ చేసిన హత్య గురించి సెర్చ్ చేశారు. హత్యకు ఎంచుకున్న లోహగఢ్ కోట గురించి ఇంటర్నెట్లో వెతికి తెలుసుకున్నారు. ఇదే కాకుండా మనుషుల్ని ఎలా తప్పుదారి పట్టించాలనే విషయాలను తెలుసుకున్నారు. లోహగఢ్ పోర్టులో హత్యకు ముందు అక్కడ రెక్కీ నిర్వహించారు. మే 28న, 29న ఆ ప్రదేశాన్ని పరిశీలించినట్లు ఛార్జిషీట్ వెల్లడించింది. హత్యకు ముందే మే 31న సియా కేతన్‌ను లోహగఢ్ తీసుకెళ్లినట్లు కూడా పోలీసులు తెలిపారు. జూన్ 14న కేతన్‌ను అక్కడికి తీసుకెళ్లి హత్యకు ప్రయత్నించి విఫలమైనట్లు, ఆ తర్వాత జూన్ 18న మరోసారి టెక్కింగ్ పేరులో కేతన్‌ను లోహగఢ్ పోర్టుకు తీసుకెళ్లినట్లు దర్యాప్తులో తేలింది.

**సియా, చేతన్ కలిసి తోశారు..**

ఛార్జిషీట్ ప్రకారం, జూన్ 18న లోహగఢ్ పోర్టుకు తీసుకెళ్లిన తర్వాత కొండ ప్రాంతంలో కేతన్‌ను చేతన్, సియాలు కలిసి వెనక నుంచి తోసేసి చంపినట్లు తేలింది. ఈ ఘటనను ప్రమాదంగా చిత్రీకరించేందుకు ముందుగానే ఒక కథ సిద్ధం చేసకున్నారని పోలీసులు ఆరోపించారు. కేతన్ జారిపడిపోయినట్లు కుటుంబ సభ్యుల్ని నమ్మించే ప్రయత్నం చేశారు.
ఈ కేసులో డిజిటల్ ఆధారాలు దొరక్కుండా ఇద్దరు జాగ్రత్తలు తీసుకున్నారని తేలింది. గూగుల్, యూట్యూబ్ సెర్చ్ హిస్టరీ, ఐక్లౌడ్ డేటా, వాట్సాప్ చాట్స్, కాల్ లాగ్స్, ఫోటోలు తొలగించినట్లు తేలింది. ఇదే కాకుండా మరో వ్యక్తి ప్రమేయం ఉన్నట్లు అనుమానం కలిగించేందుకు ఫేక్ ఇన్‌స్టాగ్రామ్ అకౌంట్ ఉపయోగించినట్లు దర్యాప్తులో తేలింది. చేతన్ తన ఫోన్ లోకేషన్ దాచేందుకు వేరే వ్యక్తి మొబైల్ తీసుకుని హత్య ప్రదేశానికి వెళ్లినట్లు ఆరోపణలు ఉన్నాయి.

# పల్లె పండుగ 3.0 ప్రారంభం..
# గ్రామాలకు రూ.11,085 కోట్లు



ఆంధ్రప్రదేశ్‌లో గ్రామీణ ప్రాంతాల స్వరూపాన్ని మార్చే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం 'పల్లె పండుగ 3.0' కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. నెల్లూరు జిల్లా రామాపురం గ్రామంలో జరిగిన కార్యక్రమంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఈ బృహత్ కార్యక్రమాన్ని లాంఛనంగా ప్రారంభించారు. మొత్తం రూ.11,085 కోట్ల భారీ అంచనాలతో ఈ పథకం ద్వారా గ్రామాల్లో మౌలిక వసతులను సమగ్రంగా మెరుగుపరచనున్నారు. ఈ కార్యక్రమంలో సింహభాగం నిధులను గ్రామీణ రహదారుల నిర్మాణానికి కేటాయించారు. మొత్తం రూ.10,250 కోట్లతో రాష్ట్రవ్యాప్తంగా సుమారు 15,500 కిలోమీటర్ల మేర రోడ్లను నిర్మించనున్నారు. ఇందులో రూ.7,550 కోట్ల వ్యయంతో 9,500 కిలోమీటర్ల బీటీ రోడ్లు, రూ.2,700 కోట్లతో 6,000 కిలోమీటర్ల సీసీ రోడ్లు ఉన్నాయి.రహదారులతో పాటు, గ్రామీణ ప్రజల జీవనోపాధిని, జీవన ప్రమాణాలను మెరుగుపరిచే పలు ఇతర పనులకు కూడా ప్రభుత్వం నిధులు కేటాయించింది. పాడి రైతులను ప్రోత్సహించేందుకు రూ.300 కోట్లతో 22,000 మినీ గోకులాలు (పశువుల షెడ్లు), పారిశుద్ధ్యాన్ని మెరుగుపరిచేందుకు రూ.110 కోట్లతో 1,000 కిలోమీటర్ల మ్యాజిక్ డ్రైన్లు, పచ్చదనం పెంపు కోసం రూ.225 కోట్లతో 50,000 ఎకరాల్లో ఉద్యానవనాల ఏర్పాటుకు ప్రణాళికలు సిద్ధం చేశారు. ఇవే కాకుండా, గ్రామ పంచాయతీ భవనాలు, బస్ షెల్టర్లు, రచ్చబండల నిర్మాణం, భూగర్భ డ్రైనేజీ వంటి ఇతర మౌలిక సదుపాయాల కల్పన కోసం రూ.200 కోట్లు కేటాయించారు. ఈ ప్రారంభోత్సవ కార్యక్రమంలో మంత్రి నిమ్మల రామానాయుడు, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్, ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, పలువురు ఎమ్మెల్యేలు, ఇతర ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు. గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు కొత్త ఊతమివ్వడంతో పాటు, ప్రజల భాగస్వామ్యంతో ఈ అభివృద్ధి పనులను పూర్తి చేయాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. 'పల్లె పండుగ-3'లో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా 15,500 కిలోమీటర్ల బీటీ, సీసీ రోడ్ల నిర్మాణం చేపడుతున్నామని సీఎం వివరించారు. మరో రూ.2,700 కోట్లతో 6,000 కిలోమీటర్ల మేర సీసీ రోడ్లు నిర్మిస్తామని, ప్రతి ఇంటి ముందూ బురద లేని రోడ్లు ఉండేలా చూస్తామని హామీ ఇచ్చారు. గత వైసీపీ ప్రభుత్వం ఐదేళ్లలో కేవలం 880 కిలోమీటర్ల రోడ్లు వేస్తే, తమ ఎన్డీయే ప్రభుత్వం కేవలం రెండేళ్లలోనే 6,500 కిలోమీటర్ల రోడ్లు వేసి చరిత్ర సృష్టించిందని పోల్చి చెప్పారు. "అప్పుడు ఖర్చుపెట్టిన డబ్బులు దొంగల జేబుల్లోకి పోయాయి, ఇప్పుడు మేము ఖర్చుపెట్టే ప్రతి పైసా మీ ఊరిలో అభివృద్ధి రూపంలో కనిపిస్తోంది," అని చంద్రబాబు వ్యాఖ్యానించారు.

## దేవుడి పేరుతో రాజకీయాలు వద్దు

రాజకీయ ప్రయోజనాల కోసం దేవుడి పేరును వాడుకోవడం సరికాదని, అది ఎవరికీ మేలు చేయదని తెలంగాణ రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. ప్రతి వ్యక్తికి తమ తమ దేవతలపై విశ్వాసం ఉంటుందని, ఇతరుల నమ్మకాలను గౌరవించడం భారతీయ సంస్కృతిలో భాగమని ఆయన పేర్కొన్నారు. రాజన్న సిరిసిల్ల జిల్లాలో పలు కార్యక్రమాల్లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ ఈ వ్యాఖ్యలు చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కూడా ఇదే అభిప్రాయాన్ని వ్యక్తం చేశారని పొన్నం ప్రభాకర్ తెలిపారు. రాష్ట్రంలోని దేవాలయాలను అభివృద్ధి చేయాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని ఆయన స్పష్టం చేశారు. వేములవాడ రాజన్న, భద్రాద్రి రాముడు, కొండగట్టు ఆంజనేయ స్వామి సహా అన్ని ఆలయాల పట్ల తనకు గౌరవం, విశ్వాసం ఉన్నాయని చెప్పారు. వ్యక్తిగతంగా తనకు శివుడు ఆరాధ్య దైవమని ఆయన పేర్కొన్నారు. ప్రజల విశ్వాసాలను ప్రభుత్వం గౌరవిస్తుందని, రాష్ట్రవ్యాప్తంగా ఆలయాల అభివృద్ధికి కట్టుబడి ఉందని అన్నారు.

## క్యాంపులో కలకలం..

ఈ ఘటనకు గల కారణాలు తెలియరాలేదు. దీనిపై ఉన్నతాధికారులు దర్యాప్తు చేస్తున్నారు. ఈ ఘటనపై సీఐఎస్ఎఫ్ ప్రధాన కార్యాలయం విచారణకు ఆదేశించింది. సీఐఎస్ఎఫ్ డైరెక్టర్ జనరల్ ఘటనను పర్యవేక్షిస్తున్నారు. మంగళవారం సాయంత్రం 7.10 గంటలకు ఈ ఘటన జరిగింది. వెంటనే కథువా జిల్లా పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. సేవా పవర్ ప్రాజెక్ట్ వద్ద ఉన్న క్యాంపులో ఈ ఘటన జరిగింది. ఈ ప్రాంతం హిమాచల్ ప్రదేశ్ సరిహద్దుకు సమీపంలో, హిమాచల్‌లోని చంబా జిల్లాకు ఆనుకుని ఉంది. హెడ్ కానిస్టేబుల్ అవధేష్ కుమార్ సింగ్ తన వద్ద ఉన్న ఏకే-47 రైఫిల్‌తో కాల్పులు జరిపినట్లు తెలుస్తోంది. ఈ ఘటనలో మృతి చెందిన వారిని అసిస్టెంట్ కమాండెంట్ అంకిత్ కుమార్ పాండే, సబ్-ఇన్‌స్పెక్టర్ లక్ష్మణ్ సింగ్, కానిస్టేబుళ్లు రఫీక్ అహ్మద్, సందీప్ కుమార్గా గుర్తించారు. నలుగురినీ చికిత్స కోసం హిమాచల్ ప్రదేశ్‌లోని చీనూజ ఆసుపత్రికి తరలించగా.. అక్కడ చికిత్స పొందుతూ మరణించినట్లు తెలుస్తోంది.



## ఎన్నికల 'మ్యాచ్ ఫిక్సింగ్'..
## ప్రధాని మోదీ రాజీనామా చేయాలి

దేశంలో ప్రస్తుతం కొనసాగుతున్న ఎన్నికల ప్రక్రియను ప్రధాని, ఎన్నికల సంఘం మధ్య జరుగుతున్న 'మ్యాచ్ ఫిక్సింగ్'గా కాంగ్రెస్ అభివర్ణించింది. ప్రధాని, హోంమంత్రి తరఫున ప్రధాన ఎన్నికల కమిషనర్ (సీఈసీ) జ్ఞానేశ్ కుమార్ 'ఓట్ల దొంగతనానికి' పాల్పడుతున్నారని తీవ్ర ఆరోపణలు గుప్పించింది. సీఈసీని తక్షణమే పదవి నుంచి తొలగించాలని, ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ ప్రక్రియను నిలిపివేయాలని తీర్మానంలో పేర్కొంది. జాబితా నుంచి అన్యాయంగా తొలగించిన 13.30 కోట్ల ఓట్లను వెంటనే పునరుద్ధరించాలని కాంగ్రెస్ డిమాండ్ చేసింది. ఈ సమావేశంలో దాదాపు 25 నిమిషాల పాటు ప్రసంగించిన రాహుల్ గాంధీ, కాంగ్రెస్ కేవలం ప్రతిపక్షం మాత్రమే కాదని, అది ఒక 'ప్రతిఘటన' పార్టీ అని స్పష్టం చేశారు. ఓటు హక్కు పునరుద్ధరణ కోసం తాము చేసే పోరాటం స్వాతంత్ర్య సంగ్రామంతో సమానమని తీర్మానంలో ఉద్ఘాటించారు. ఎన్నికల సంఘం తన స్వతంత్ర ప్రతిపత్తిని తిరిగి పొందే వరకు పార్లమెంటు, న్యాయస్థానాలు, వీధుల్లో తమ పోరాటాన్ని కొనసాగిస్తామని కాంగ్రెస్ నేతలు ఈ సందర్భంగా స్పష్టం చేశారు.

## వివేకా హత్య కేసులో లబ్ధిదారుడు జగనే

వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసులో అసలైన, అంతిమ లబ్ధిదారుడు మాజీ ముఖ్యమంత్రి జగనేనని రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో ఆయన మీడియా ప్రతినిధులతో మాట్లాడుతూ, ఈడీ, సీబీఐ దర్యాప్తు ముమ్మరం కావడంతో తాడేపల్లి ప్యాలెస్ పునాదులు కదులుతున్నాయని, అందుకే ప్రజల దృష్టిని మళ్లించేందుకు జగన్ ధర్నాల పేరిట డ్రామాలు ఆడుతున్నారని విమర్శించారు. "సొంత బాబాయ్ గొడ్డలిపోటుకు గురైతే గుండెపోటుగా నమ్మించి, సాక్ష్యాలను తుడిచిపెట్టిన చరిత్ర జగన్‌ది. ఇప్పుడు కూడా అదే తరహాలో డైవర్షన్ రాజకీయాలకు పాల్పడుతున్నారు. అప్రూవర్‌గా మారిన దస్తగిరి, సునీల్ యాదవ్ వెల్లడించిన వాస్తవాలు, రూ.40 కోట్ల సుపారీ లావాదేవీలన్నీ తాడేపల్లి నివాసం వైపే వేలెత్తి చూపిస్తున్నాయి" అని అనగాని పేర్కొన్నారు. హత్య కేసు దర్యాప్తు కీలక దశకు చేరుకోవడంతోనే డీఎస్సీ వంటి అంశాలపై వైసీపీ అనవసర రాద్ధాంతం చేస్తోందని ఆరోపించారు. అనారోగ్యంతో ఉన్న ఉపాధ్యాయుడు కాకుమాను రాజశేఖర్‌ను ధర్నాకు బలవంతంగా పిలిపించి, ఆయన మృతికి కారకులయ్యారని, ఇప్పుడు ఆ మరణంపై కూడా శవ రాజకీయం చేస్తున్నారని మంత్రి ఆగ్రహం వ్యక్తం చేశారు. గత వైసీపీ ప్రభుత్వమే రాష్ట్రంలో గంజాయి, బ్లేడ్ బ్యాచ్ సంస్కృతిని పెంచి పోషించిందని మండిపడ్డారు. తప్పులు చేస్తూ ఇతరులపై ఎదురుదాడికి దిగడం వైసీపీకి అలవాటుగా మారిందని, ఆ పార్టీ తన పేరును 'గొడ్డలి డైవర్షన్ పార్టీ'గా మార్చుకుంటే బాగుంటుందని ఎద్దేవా చేశారు. ఇప్పటికైనా జగన్ మీడియా ముందుకు వచ్చి వివేకా హత్యపై వాస్తవాలను వెల్లడించాలని అనగాని సత్యప్రసాద్ డిమాండ్ చేశారు. సచివాలయ ఉద్యోగుల సమస్యలను కూడా తమ ప్రభుత్వం పరిష్కరించి, వారికి ఉజ్వల భవిష్యత్తును అందిస్తుందని ఈ సందర్భంగా ఆయన హామీ ఇచ్చారు.

## బొగ్గు కొనుగోలుపై ప్రభుత్వ నిర్ణయాన్ని తప్పుబట్టిన కేటీఆర్

ఎందుకు మోపుతున్నారని ఆయన ప్రశ్నించారు. దక్షిణ భారతదేశంలోనే అతిపెద్ద బొగ్గు నిల్వలు తెలంగాణలో ఉన్నాయనే విషయాన్ని కేటీఆర్ ఈ సందర్భంగా గుర్తుచేశారు. గతంలో సింగరేణి సంస్థ ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, మహారాష్ట్ర వంటి రాష్ట్రాలకు సైతం బొగ్గును సరఫరా చేసిందని ఆయన పేర్కొన్నారు. కేసీఆర్ ప్రభుత్వ హయాంలో సింగరేణి బొగ్గుతోనే టీఎస్ జెన్‌కో నిరంతరాయంగా 24 గంటల విద్యుత్ సరఫరాను అందించిందని వివరించారు. రాష్ట్రంలోనే పుష్కలమైన వనరులు ఉండగా, వాటిని కాదని అధిక ధర చెల్లించి దిగుమతి చేసుకోవడం వెనుక ఉన్న ఆంతర్యమేమిటని ఆయన ప్రభుత్వాన్ని నిలదీశారు.

## నాతో పెట్టుకుంటే ఆధారాలు బయటపెడతా

బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ వ్యాఖ్యలపై తెలంగాణ రక్షణ సేన (టీఆర్ఎస్) చీఫ్ కవిత తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. పార్టీ వైఫల్యాలను, చేతగానితనాన్ని కేసీఆర్‌పై నెట్టడం ఏంటని ప్రశ్నించారు. గుంటనక్క మైండ్‌గేమ్‌లో పడి పార్టీ అధినేతనే తప్పుబడుతున్నారని మండిపడ్డారు. తనతో పెట్టుకోవద్దని, నిర్దిష్టమైన ఆధారాలతో అన్ని విషయాలు బయటపెడతానని హెచ్చరించారు. నియోజకవర్గానికి ఎమ్మెల్యేనే సీఎం అని కేసీఆర్ చెప్పడం వల్లే సమస్యలు తమ వరకు రాలేదని కేటీఆర్ చేసిన వ్యాఖ్యలపై కవిత 'ఎక్స్' వేదికగా స్పందించారు. కూర్చున్న కొమ్మనే నరుక్కున్నట్లు పార్టీ వైఫల్యాలను కేసీఆర్‌పై మోపుతున్నారని విమర్శించారు. ఇలా చేస్తూ బీఆర్ఎస్‌కు గోతులు తీస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. తాను బీఆర్ఎస్‌లో ఉన్నప్పుడు ఓ అవినీతి వ్యక్తిని విమర్శిస్తే కొన్ని గంటల్లోనే సస్పెండ్ చేశారని కవిత పేర్కొన్నారు. అలాంటిది ఇప్పుడు అదే వ్యక్తితో కలిసి ఉంటూ, కేసీఆర్ తీరుతోనే పార్టీకి నష్టం జరిగిందని బహిరంగంగా వ్యాఖ్యానించడం పార్టీ వ్యతిరేక చర్య కాదా అని ప్రశ్నించారు. పార్టీ అధినేతను, ఆయన తీసుకున్న విధానపరమైన నిర్ణయాలను బహిరంగంగా తప్పుబట్టడం ఏంటని నిలదీశారు. ఫామ్‌హౌస్‌లు, అక్రమంగా ఇచ్చిన అనుమతులు, ఆంధ్రా స్నేహితులకు ఇచ్చిన ప్రయోజనాలు, క్విడ్ ప్రో కో వ్యవహారాలతో బీఆర్ఎస్‌ను పాతాళంలోకి నెట్టింది మీరే అంటూ కేటీఆర్‌పై కవిత ఆరోపణలు చేశారు. ఇటీవల బీఆర్ఎస్ సమావేశంలో ఓ రైతు ఫోన్‌లో మాట్లాడుతుంటే ఆయన భార్యను అవమానించేలా వ్యాఖ్యలు చేశారని విమర్శించారు. సాయం కోరుతూ వచ్చిన మహిళతోనూ అనుచితంగా మాట్లాడారని మండిపడ్డారు. గణేశ్ నిమజ్జనోత్సవంలో సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్లను ఎంతమందిని బతిమాలుకున్నారో గణేశుడికి, వారి అంతరాత్మకు తెలుసని కవిత వ్యాఖ్యానించారు. తాను విషనాగుల మాటలు విని మాట్లాడనని, నిర్దిష్టమైన ఆధారాలతోనే మాట్లాడతానని స్పష్టం చేశారు. తనతో పెట్టుకోవద్దని హెచ్చరిక జారీ చేశారు.

## మేం ట్యాంపరింగ్ చేస్తే 400 సీట్లు వచ్చేవి

ఓట్ల ట్యాంపరింగ్ విషయంలో కాంగ్రెస్ పార్టీ చేస్తున్న ఆరోపణలపై బీజేపీ ఎంపీలు ఈటల రాజేందర్, ధర్మపురి అర్వింద్ తీవ్రస్థాయిలో మండిపడ్డారు. తాము ఓట్లను ట్యాంపరింగ్ చేసి ఉంటే లోక్‌సభలో 400 సీట్లు గెలిచేవాళ్లమని, కేవలం 240 సీట్లతో ఎందుకు సరిపెట్టుకుంటామని ఈటల రాజేందర్ ప్రశ్నించారు. కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీని చూసి ప్రజలు ఛీ కొడుతున్నారని, భారత ప్రజాస్వామ్యాన్ని ఆయన నవ్వులపాలు చేస్తున్నారని మంగళవారం ఢిల్లీలో మీడియాతో మాట్లాడుతూ విమర్శించారు. ఈవీఎంలను రాజీవ్ గాంధీ హయాంలోనే ప్రవేశపెట్టారని, వీవీప్యాట్‌లను మోదీ ప్రభుత్వం తీసుకొచ్చిందని ఈటల గుర్తుచేశారు. ఇదే అంశంపై ధర్మపురి అర్వింద్ మాట్లాడుతూ, రాహుల్ గాంధీ ఉన్నంతవరకు 'కాంగ్రెస్ ముక్త భారత్' సాధ్యమేనని ఎద్దేవా చేశారు. "పౌరసత్వానికి ముందే సోనియా గాంధీకి ఓటు ఎలా వచ్చిందో రాహుల్ చెప్పాలని" ఆయన డిమాండ్ చేశారు. ఎన్నికల్లో గెలవలేకే కాంగ్రెస్ పార్టీ లేనిపోని సమస్యలను సృష్టిస్తోందని అర్వింద్ ఆరోపించారు.

## చంద్రబాబు విజన్, మోదీ సహకారంతో గ్రామీణ ప్రగతి పరుగులు పెడుతోంది

రాష్ట్రంలోని గ్రామీణ ప్రాంతాల స్వరూపాన్ని మార్చే లక్ష్యంతో చేపట్టిన 'పల్లె పండుగ 3.0' కార్యక్రమం నెల్లూరు జిల్లా ఉదయగిరి నియోజకవర్గంలో మంగళవారం లాంఛనంగా ప్రారంభమైంది. రామాపురంలో జరిగిన ఈ భారీ బహిరంగ సభకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి, పంచాయతీరాజ్ శాఖ మంత్రి పవన్ కల్యాణ్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా పవన్ కల్యాణ్ మాట్లాడుతూ.. గ్రామీణాభివృద్ధికి కూటమి ప్రభుత్వం ఇస్తున్న ప్రాధాన్యతను, భవిష్యత్ ప్రణాళికలను ఆవిష్కరించారు. రాబోయే సంవత్సరాల్లో పంచాయతీరాజ్, గ్రామీణ నీటి సరఫరా విభాగాల ద్వారా రాష్ట్రంలో ఎన్నడూ లేని విధంగా రూ.1.30 లక్షల కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టబోతున్నామని ప్రకటించారు. ఈ సందర్భంగా గత వైసీపీ ప్రభుత్వ పాలనతో ప్రస్తుత కూటమి ప్రభుత్వ పనితీరును పవన్ కల్యాణ్ పోల్చిచూపారు. "వైసీపీ ప్రభుత్వం ఐదేళ్లలో 880 కిలోమీటర్ల సీసీ రోడ్లు నిర్మిస్తే, మేము కేవలం రెండేళ్లలోనే దానికి పది రెట్లు ఎక్కువగా దాదాపు 9,000 కిలోమీటర్లకు పైగా పూర్తి చేశాం. వారు 304 మినీ గోకులాలు నిర్మిస్తే, మేము 30,000కు పైగా నిర్మించాం. 304 ఎక్కడ, 30,000 ఎక్కడో ప్రజలు ఆలోచించాలి" అని అన్నారు. సీఎం చంద్రబాబు దార్శనికత, ప్రధాని నరేంద్ర మోదీ సహకారంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సమన్వయంతో గ్రామీణ ప్రగతిని పరుగులు పెట్టిస్తున్నామని తెలిపారు. 'పల్లె పండుగ 3.0' కార్యక్రమాన్ని రూ.11,085 కోట్ల బడ్జెట్‌తో ప్రారంభిస్తున్నట్లు పవన్ కల్యాణ్ ప్రకటించారు. ఇందులో కేంద్రం వాటా రూ.5,400 కోట్లు కాగా, రాష్ట్ర ప్రభుత్వం రూ.5,700 కోట్లు భరిస్తోందని వివరించారు. ఈ నిధులతో 6,000 కిలోమీటర్ల సీసీ రోడ్లు, 9,500 కిలోమీటర్ల బీటీ రోడ్లు, 22,500 మినీ గోకులాలు, 50 వేల ఎకరాల్లో పండ్ల తోటలు, వెయ్యి కిలోమీటర్ల డ్రైన్లు, గ్రామ పంచాయతీ భవనాలు, బస్ షెల్టర్లు, రచ్చబండలు వంటి అనేక పనులు చేపట్టనున్నట్లు తెలిపారు. చారిత్రక ప్రాధాన్యత, వలసల సమస్య కారణంగానే ఉదయగిరిని ఈ కార్యక్రమానికి వేదికగా ఎంచుకున్నామని స్పష్టం చేశారు. ఉదయగిరి నియోజకవర్గానికి మహర్దశ పట్టబోతోందని పవన్ కల్యాణ్ అన్నారు. ఫ్లోరైడ్ సమస్య పరిష్కారానికి గతంలో నిలిచిపోయిన సుజలా స్రవంతి పథకాన్ని రూ.52 కోట్లతో పునరుద్ధరించి 381 పనులు చేపట్టనున్నట్లు హామీ ఇచ్చారు. ఉదయగిరి కోటకు వెళ్లేందుకు రూ.2.5 కోట్లతో రహదారి మంజూరు చేస్తున్నామని, అటవీ అనుమతులు త్వరగా పొందేలా అధికారులను ఆదేశిస్తున్నామని తెలిపారు. ఉదయగిరి కోటను హెరిటేజ్, ఎకో టూరిజం కేంద్రంగా అభివృద్ధి చేసేందుకు డీపీఆర్ సిద్ధం చేసి, కేంద్ర ప్రభుత్వ పథకాల ద్వారా నిధులు సమీకరిస్తామని వెల్లడించారు.

## వైసీపీ నేత కాకుమాను కుటుంబానికి జగన్ పరామర్శ

వైసీపీ అధినేత జగన్ ఈరోజు ఒంగోలులో పర్యటించారు. ఇటీవల మరణించిన పార్టీ ప్రచార విభాగం రాష్ట్ర అధ్యక్షుడు కాకుమాను రాజశేఖర్ కుటుంబాన్ని ఆయన పరామర్శించారు. ఒంగోలులోని రాజశేఖర్ నివాసానికి వెళ్లిన జగన్, ఆయన కుటుంబ సభ్యులను కలిసి సానుభూతిని తెలియజేశారు. పార్టీ అన్ని విధాలా అండగా ఉంటుందని వారికి భరోసా ఇచ్చారు. కాగా, విజయవాడలో సెప్టెంబర్ 21న డీఎస్సీ నియామకాల్లో అక్రమాలు జరిగాయంటూ వైసీపీ చేపట్టిన నిరసనలో జరిగిన తోపులాట అనంతరం రాజశేఖర్ అస్వస్థతకు గురై చికిత్స పొందుతూ మరణించిన విషయం తెలిసిందే. రాజశేఖర్ గతంలో లిడ్?క్యాప్ ఛైర్మన్‌గా కూడా పనిచేశారు.

# ధర్మవరంలో దొంగల కలకలం

## మూడు ఇళ్లలో చోరీకి యత్నం.. సీసీ కెమెరాల్లో ఏడుగురు



ధర్మవరం, సెప్టెంబరు 29; (అరుణ ప్రభ న్యూస్) : ధర్మవరం పట్టణంలో మంగళవారం తెల్లవారుజామున దొంగలు హల్‌చల్ చేశారు. గీతానగర్, మారుతీ రాఘవేంద్రస్వామి ఆలయ వీధి తదితర ప్రాంతాల్లో మూడు ఇళ్లలో చోరీకి యత్నించారు. ఇళ్ల కిటికీల గ్రిల్స్‌ను రంపంతో కోసి లోపలికి ప్రవేశించేందుకు ప్రయత్నించగా, శబ్దం రావడంతో కుటుంబ సభ్యులు అప్రమత్తమై లైట్లు వేయడంతో అక్కడి నుంచి పరారైనట్లు పోలీసులు తెలిపారు. సీసీ కెమెరాలను పరిశీలించగా ఏడుగురు వ్యక్తులు సంచరించినట్లు గుర్తించినట్లు వన్‌టౌన్ పోలీసులు తెలిపారు. సంఘటన స్థలాలను పోలీసులు పరిశీలించి దర్యాప్తు చేపట్టారు. ఈ ఘటనకు సంబంధించి ఉత్తరాది ప్రాంతాలకు చెందిన దొంగల ముఠా ప్రమేయం ఉండొచ్చని పోలీసులు అనుమానిస్తున్నారు.

### రాత్రివేళ అప్రమత్తంగా ఉండాలి

ఈ ఘటనపై డీఎస్పీ జగన్నాథరాజు, వన్‌టౌన్ సీఐ జయనాయక్ విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ మధ్యప్రదేశ్, మహారాష్ట్ర ప్రాంతాలకు చెందిన కొన్ని దొంగల ముఠాలు అక్టోబర్, ఫిబ్రవరి నెలల్లో కర్ణాటక, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో చోరీలకు పాల్పడుతున్నట్లు తెలిపారు. సాధారణంగా రాత్రి 10 నుంచి 12 గంటల మధ్య ప్రాంతాల్లో సంచరిస్తూ తాళం వేసిన ఇళ్లను గుర్తించి, అర్ధరాత్రి తర్వాత చోరీలకు పాల్పడుతున్నట్లు పేర్కొన్నారు. ఇలాంటి ముఠాలు సాధారణంగా నడుచుకుంటూ సంచరిస్తాయని, ద్విచక్ర వాహనాలు ఉపయోగించరని తెలిపారు. పట్టణంలోని వన్‌టౌన్, టూటౌన్, రూరల్ పోలీస్ స్టేషన్ల పరిధిలో రాత్రి గస్తీని మరింత ముమ్మరం చేస్తామని చెప్పారు. ప్రజలు ఇళ్లు వదిలి ఇతర ప్రాంతాలకు వెళ్లే సమయంలో పోలీసులకు సమాచారం అందించాలని, లాక్డ్ హౌస్ మానిటరింగ్ సిస్టమ్‌ను వినియోగించుకోవాలని సూచించారు. రాత్రివేళల్లో అనుమానాస్పద వ్యక్తులు కనిపిస్తే వెంటనే 100 లేదా 112కు సమాచారం అందించాలని పోలీసులు కోరారు.



## చెకుముకి పోటీల్లో యశోద పాఠశాలకు ద్వితీయ స్థానం

ధర్మవరం, సెప్టెంబరు 29; (అరుణ ప్రభ న్యూస్) : చెకుముకి జిల్లా స్థాయి పోటీల్లో ధర్మవరం యశోద ఇంగ్లీష్ మీడియం హైస్కూల్ విద్యార్థులు ప్రతిభ కనబరిచి ద్వితీయ స్థానం సాధించినట్లు పాఠశాల డైరెక్టర్ పృథ్వీరాజ్, ప్రిన్సిపాల్ అనూప్‌కుమార్ తెలిపారు. పోటీల్లో పదో తరగతి విద్యార్థి పి. ప్రశాంత్, తొమ్మిదో తరగతి విద్యార్థి పి. నందవర్ధన్, ఎనిమిదో తరగతి విద్యార్థి బి. తాహిర్ పాల్గొన్నట్లు పేర్కొన్నారు. విద్యతోపాటు విజ్ఞాన, పోటీ కార్యక్రమాల్లో విద్యార్థులు ప్రతిభ కనబరచడం అభినందనీయమని తెలిపారు.

## గుండె ఆరోగ్యంపై శ్రద్ధ అవసరం

### జీవనశైలిలో మార్పులు చేసుకోవాలి : డా. నరసింహులు



ధర్మవరం, సెప్టెంబరు 29; (అరుణ ప్రభ న్యూస్) : ఎస్‌బీఐ కాలనీలోని మధు కంటి వైద్యశాలలో ప్రపంచ గుండె దినోత్సవాన్ని నిర్వహించారు. డాక్టర్ సంకారపు నరసింహులు మాట్లాడుతూ గుండె ఆరోగ్యానికి సమతుల ఆహారం, రోజువారీ నడక అవసరమన్నారు. ఉప్పు, చక్కెర, నూనె తగ్గించి పండ్లు, కూరగాయలు తీసుకోవాలని సూచించారు. పొగతాగడం, మద్యానికి దూరంగా ఉండాలని, మధుమేహం, రక్తపోటు ఉన్నవారు వైద్యుల సూచనలు పాటించాలని తెలిపారు.



## కిడ్నీ రోగులకు ఉచిత డయాలసిస్

### పేద కుటుంబాలకు ఆర్థిక భారం తగ్గింపు: హరీష్‌బాబు

ధర్మవరం, సెప్టెంబరు 29; (అరుణ ప్రభ న్యూస్) : పోతుకుంట ఏరియా హాస్పిటల్‌లో కిడ్నీ రోగులకు రెండేళ్లకు పైగా ఉచిత డయాలసిస్ సేవలు అందుతున్నాయని మంత్రి సత్యకుమార్ యాదవ్ నియోజకవర్గ ఇంచార్జి హరీష్ బాబు తెలిపారు. మంగళవారం డయాలసిస్ కేంద్రాన్ని సందర్శించి రోగులకు అందుతున్న సేవలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రైవేటుగా డయాలసిస్‌కు భారీగా ఖర్చవుతుందని, ఉచిత సేవలు పేద కుటుంబాలకు ఎంతో ఉపశమనం కలిగిస్తున్నాయన్నారు. ధర్మవరంతో పాటు ఇతర ప్రాంతాల అర్హులైన రోగులు కూడా ఈ సేవలను వినియోగించుకుంటున్నారని తెలిపారు. కేంద్రంలో రోగులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా సేవలు అందించాలని సిబ్బందికి సూచించారు.



## ఆర్యవైశ్య వాసవి సేవాదళ్ రాష్ట్ర కార్యదర్శిగా బుద్ధ చిన్న సత్యం

సిద్దిపేట: తెలంగాణ రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ వాసవి సేవాదళ్ రాష్ట్ర కార్యదర్శిగా బుద్ధ చిన్న సత్యంను నియమించారు. సోమవారం తెలంగాణ రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ రాష్ట్ర అధ్యక్షులు అమరవాది లక్ష్మీనారాయణ, సిద్దిపేట జిల్లా ఆర్యవైశ్య మహాసభ ప్రధాన కార్యదర్శి సముద్రాల హరినాథ్ చేతుల మీదుగా బుద్ధ చిన్న సత్యం నియామక పత్రాన్ని అందుకున్నారు. ఈ సందర్భంగా బుద్ధ చిన్న సత్యం మాట్లాడుతూ, రాష్ట్ర, జిల్లా నాయకులు తనపై నమ్మకంతో బాధ్యతలు అప్పగించి పదవిని కల్పించడం సంతోషంగా ఉందన్నారు. తనకు అప్పగించిన బాధ్యతకు గౌరవం తీసుకొచ్చే విధంగా పనిచేస్తూ, వాసవి సేవాదళ్ ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలను మరింత విస్తృతంగా నిర్వహిస్తానని తెలిపారు.




## ఉద్యమ స్ఫూర్తితో హామీల సాధన కోసం పోరుబాట

### ::: 13వ రోజుకు చేరిన దీక్షలు

ఆల్వాల్: తెలంగాణ ఉద్యమకారులకు ప్రభుత్వం ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ఆల్వాల్ సర్కిల్ తెలంగాణ ఉద్యమకారుల జేఏసీ ఆధ్వర్యంలో చేపట్టిన రిలే నిరాహార దీక్షలు 13వ రోజుకు చేరుకున్నాయి. కాంగ్రెస్ ప్రభుత్వం మేనిఫెస్టోలో తెలంగాణ ఉద్యమకారులకు ఇచ్చిన హామీలను కాలయాపన చేయకుండా తక్షణమే నెరవేర్చాలని ఉద్యమకారులు డిమాండ్ చేశారు. 13వ రోజు దీక్షలో ఉద్యమకారులు ఆంజనేయులు, శ్యామ్‌కుమార్, సాయిరెడ్డి, గిరి, నారాయణరెడ్డి, మల్లేష్ పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి పటోళ్ల సురేందర్‌రెడ్డి, పుట్నాల కృష్ణ, దయాకర్, ముత్యాలు, అనంతుల సంతోష్, శేరుపల్లి మల్లేష్, సంగమేశ్వర్, రమేష్, మురళి, నగేష్ తదితరులు హాజరై దీక్షకు సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా ఉద్యమకారులు మాట్లాడుతూ.. ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ఆల్వాల్ ప్రాంత ఉద్యమకారులు 1136 రోజుల పాటు దీక్షలు నిర్వహించిన చరిత్ర తమకు ఉందని గుర్తుచేశారు. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం సర్వస్వం త్యాగం చేసి ఉద్యమించిన ఉద్యమకారులను ప్రభుత్వం వెంటనే ఆదుకోవాలని కోరారు. ఉద్యమకారులకు ఇచ్చిన హామీల అమలులో ఇకపై జాప్యం చేయకుండా ప్రభుత్వం తక్షణ చర్యలు చేపట్టాలని, తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించే వరకు ఉద్యమాన్ని కొనసాగిస్తామని స్పష్టం చేశారు.

# సంకష్టహర చతుర్థి సందర్భంగా లక్ష్మీ గణపతికి విశేష పూజలు



సికింద్రాబాద్, కానాజిగూడ: మరకత శ్రీ లక్ష్మీ గణపతి దేవస్థానంలో మంగళవారం సంకష్టహర చతుర్థి సందర్భంగా స్వామివారికి ప్రత్యేక పూజా కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. ఆలయ వ్యవస్థాపకులు, కార్యనిర్వాహకులు డాక్టర్ మోత్కూరు సత్యనారాయణ శాస్త్రి ఆధ్వర్యంలో స్వామివారికి అభిషేకాలు, హోమాలు నిర్వహించారు. 32 రకాల ఔషధీకృత ద్రవ్యాలతో స్వామివారికి విశేష అభిషేకం, తామర, మల్లె పుష్పాలతో లక్ష్మీ గణపతి మూలమంత్ర హవనం, మహాలక్ష్మి హోమాలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఈ పూజా కార్యక్రమాల్లో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఈ సందర్భంగా డాక్టర్ మోత్కూరు సత్యనారాయణ శాస్త్రి మాట్లాడుతూ ఆలయ అభివృద్ధికి భక్తుల సహాయ సహకారాలు ఎంతో అవసరమని అన్నారు. భక్తులు వస్తు రూపంలో లేదా ధన రూపంలో తమకు తోచిన విధంగా విరాళాలు అందించి ఆలయ అభివృద్ధికి సహకరించాలని కోరారు.

## సంపాదకీయం

## గల్ఫ్ వలస కార్మికుల కన్నీటి గాథ.. తెలంగాణకు తీరని సామాజిక సమస్య

తెలంగాణ సమాజంలో గల్ఫ్ వలసలు దశాబ్దాలుగా కొనసాగుతున్నాయి. ఉపాధి కోసం సొంత ఊరును, కన్నవారిని, భార్యాపిల్లలను వదిలి వేల కిలోమీటర్ల దూరంలోని ఎడారి దేశాలకు వెళ్లిన లక్షలాది మంది కార్మికుల జీవితాల్లో ఎన్నో ఆశలు, మరెన్నో ఆశయాలు ఉన్నాయి. స్వగ్రామంలో సరైన ఉపాధి లేక, అప్పులు తీర్చలేక, కుటుంబ అవసరాలు తీర్చే మార్గం కనిపించక గల్ఫ్ దేశాలకు పయనమైన వారు అక్కడ కష్టాల కడలిలో చిక్కుకుంటున్నారు. కొందరు కుటుంబాల ఆర్థిక స్థితిగతులను మార్చి స్వగ్రామాల్లో గౌరవప్రదమైన జీవితాన్ని గడుపుతుండగా, మరికొందరు మాత్రం అనారోగ్యం, ప్రమాదాలు, వేతన బకాయిలు, యజమానుల వేధింపులు, న్యాయపరమైన చిక్కులు, స్వదేశానికి తిరిగి రావడానికి అవసరమైన ఖర్చులు భరించలేక నానా ఇబ్బందులు పడుతున్నారు. గల్ఫ్ వలసలు ఒకవైపు తెలంగాణ గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు అండగా నిలుస్తున్నా, మరోవైపు వలస కార్మికుల కుటుంబాల్లో సామాజిక, ఆర్థిక, మానసిక సమస్యలకు కారణమవుతున్నాయి. ఈ సమస్యను కేవలం విదేశాల్లో పనిచేస్తున్న కార్మికుల వ్యక్తిగత ఇబ్బందిగా చూడకుండా, రాష్ట్ర అభివృద్ధి, ఉపాధి కల్పన, కార్మిక సంక్షేమం, కుటుంబ భద్రతతో ముడిపడిన సమగ్ర సామాజిక సమస్యగా గుర్తించాల్సిన అవసరం ఉంది.

తెలంగాణలోని ఉమ్మడి నిజామాబాద్, కరీంనగర్, ఆదిలాబాద్, మెదక్ జిల్లాలతో పాటు జగిత్యాల, రాజన్న సిరిసిల్ల, కామారెడ్డి, నిర్మల్, మంచిర్యాల, పెద్దపల్లి వంటి ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో ప్రజలు గల్ఫ్ దేశాలకు వలస వెళ్లారు. వ్యవసాయంపై ఆధారపడిన కుటుంబాలకు సాగునీటి కొరత, పంటల పెట్టుబడి భారం, గిట్టుబాటు ధరలు లేకపోవడం, గ్రామీణ ప్రాంతాల్లో పరిశ్రమలు, ఉపాధి అవకాశాలు పరిమితంగా ఉండటం వలసలకు ప్రధాన కారణాలుగా మారాయి. ఒకప్పుడు వ్యవసాయ కూలీలుగా, చిన్న రైతులుగా జీవించిన అనేక కుటుంబాలు అప్పుల ఊబిలో చిక్కుకున్నాయి. పిల్లల చదువులు, వివాహాలు, వైద్య ఖర్చులు, ఇంటి నిర్మాణం వంటి అవసరాలు పెరుగుతున్న కొద్దీ కుటుంబ ఆదాయం సరిపోకపోవడంతో విదేశీ ఉపాధి వైపు దృష్టి సారించాయి. గల్ఫ్ దేశాల్లో నెలకు కొంత మొత్తం సంపాదించవచ్చన్న ఆశతో ప్రయాణమైన కార్మికులు, అక్కడి వాస్తవ పరిస్థితులు తెలిసేలోపే అనేక సమస్యలను ఎదుర్కొంటున్నారు.

వలస వెళ్లే ముందు కార్మికులకు సరైన సమాచారం అందకపోవడం సమస్యను మరింత తీవ్రతరం చేస్తోంది. ఏ దేశానికి వెళ్తున్నారు, అక్కడ ఏ పని చేయాలి, ఎంత వేతనం లభిస్తుంది, పని గంటలు ఎన్ని, వసతి, భోజనం ఎవరు కల్పిస్తారు, వైద్య సదుపాయాలు ఎలా ఉంటాయి, ఒప్పందంలోని నిబంధనలు ఏమిటి అనే అంశాలపై చాలామందికి స్పష్టత ఉండటం లేదు. కొందరు మధ్యవర్తుల మాటలు నమ్మి అధిక మొత్తంలో డబ్బులు చెల్లించి విదేశాలకు వెళ్తున్నారు. కొంతమంది అప్పులు చేసి, ఆస్తులు తాకట్టు పెట్టి, వడ్డీకి డబ్బులు తెచ్చి ప్రయాణ ఖర్చులు సమకూర్చుకుంటున్నారు. అక్కడికి వెళ్లిన తర్వాత చెప్పిన పని కాకుండా వేరే పనులు అప్పగించడం, హామీ ఇచ్చిన వేతనం చెల్లించకపోవడం, పాస్‌పోర్టులను యజమానులు తమ వద్దే ఉంచుకోవడం వంటి సమస్యలు ఎదురవుతున్నాయి. ఫలితంగా విదేశాలకు వెళ్లేందుకు చేసిన అప్పులు తీర్చలేక, స్వదేశానికి తిరిగి రాలేక కార్మికులు తీవ్ర ఇబ్బందుల్లో పడుతున్నారు.

వలస కార్మికుల సమస్యల్లో వేతన బకాయిలు, పని ప్రదేశాల్లో భద్రత లేకపోవడం ప్రధానమైనవి. నిర్మాణ రంగం, పారిశ్రామిక సంస్థలు, గృహ సేవలు, రవాణా, వ్యవసాయ రంగాల్లో పనిచేస్తున్న కార్మికులు కఠినమైన వాతావరణ పరిస్థితులను ఎదుర్కొంటున్నారు. ఎండ తీవ్రత అధికంగా ఉండే ప్రాంతాల్లో తగిన విశ్రాంతి, తాగునీరు, భద్రతా పరికరాలు లేకుండా పనిచేయాల్సి వస్తున్న సందర్భాలు ఉన్నాయి. పని ప్రదేశాల్లో ప్రమాదాలు జరిగినప్పుడు సరైన వైద్యం అందకపోవడం, గాయపడిన కార్మికులకు పరిహారం చెల్లించకపోవడం వంటి ఫిర్యాదులు వినిపిస్తున్నాయి. కొందరికి నెలల తరబడి వేతనాలు అందకపోవడంతో కుటుంబాలకు డబ్బులు పంపలేని పరిస్థితి ఏర్పడుతోంది. స్వగ్రామాల్లో అప్పులు చేసిన కుటుంబాలు వడ్డీలు చెల్లించలేక మరింత ఆర్థిక సంక్షోభంలో కూరుకుపోతున్నాయి. విదేశాల్లో సంపాదించి కుటుంబాన్ని నిలబెట్టాలన్న లక్ష్యంతో వెళ్లిన వ్యక్తే కుటుంబానికి అదనపు భారంగా మారే పరిస్థితి రావడం విషాదకరం.

గల్ఫ్ వలసల ప్రభావం కేవలం కార్మికులకే పరిమితం కావడం లేదు. వారి కుటుంబాలు కూడా అనేక సమస్యలను ఎదుర్కొంటున్నాయి. కుటుంబ పెద్ద విదేశాల్లో ఉండటంతో భార్య, పిల్లలు, వృద్ధ తల్లిదండ్రుల బాధ్యత మొత్తం ఇంట్లో ఉన్నవారిపై పడుతోంది. పిల్లల చదువులు, ఆరోగ్యం, కుటుంబ అవసరాలను ఒంటరిగా నిర్వహించాల్సిన పరిస్థితి మహిళలకు ఎదురవుతోంది. భర్త నుంచి క్రమం తప్పకుండా డబ్బులు రాకపోవడం, విదేశాల్లో ఆయన ఎదుర్కొంటున్న సమస్యలపై సరైన సమాచారం లేకపోవడం కుటుంబాల్లో ఆందోళనకు దారితీస్తోంది. కొన్నిసార్లు విదేశాల్లో పనిచేస్తున్న వ్యక్తి నుంచి నెలల తరబడి సమాచారం అందకపోవడంతో కుటుంబ సభ్యులు తీవ్ర మానసిక ఒత్తిడికి గురవుతున్నారు. ప్రమాదాలు, అనారోగ్యం, మరణాల వార్తలు అందినప్పుడు కుటుంబాలు ఒక్కసారిగా దిక్కుతోచని స్థితిలో పడుతున్నాయి. విదేశాల్లో మరణించిన వారి మృతదేహాలను స్వగ్రామాలకు తీసుకురావడానికి అవసరమైన ప్రక్రియలు, ఖర్చులు, అధికారిక అనుమతులు కుటుంబాలకు మరింత భారంగా మారుతున్నాయి.

ముఖ్యంగా గల్ఫ్ దేశాల్లో పనిచేస్తున్న మహిళా కార్మికుల సమస్యలు ప్రత్యేక శ్రద్ధ కోరుతున్నాయి. గృహ సేవలు, సంరక్షణ వంటి రంగాల్లో పనిచేస్తున్న కొందరు మహిళలు పని గంటల నియంత్రణ లేకపోవడం, విశ్రాంతి సమయం దొరకకపోవడం, వేతనాలు ఆలస్యంగా అందడం, యజమానుల నుంచి వేధింపులు ఎదురవుతున్నాయని ఫిర్యాదు చేస్తున్నారు. భాష తెలియకపోవడం, స్థానిక చట్టాలపై అవగాహన లేకపోవడం, తమ సమస్యలను వెల్లడించడానికి తగిన సహాయం అందకపోవడం వల్ల వారు మరింత ఇబ్బందుల్లో పడుతున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో బాధితులకు సత్వర న్యాయ సహాయం, భద్రత కల్పించడం అత్యంత అవసరం. విదేశాల్లో పనిచేసే మహిళలకు ప్రయాణానికి ముందే హక్కులు, ఒప్పంద నిబంధనలు, అత్యవసర సంప్రదింపు మార్గాలు, అందుబాటులో ఉన్న సహాయ వ్యవస్థలపై అవగాహన కల్పించాలి.

వలస కార్మికుల సమస్యల్లో మరో ముఖ్యమైన అంశం అక్రమ నియామకాలు, మోసపూరిత ఏజెంట్ల వ్యవహారం. విదేశాల్లో అధిక వేతనంతో ఉద్యోగాలు ఇప్పిస్తామని నమ్మించి కొందరు మధ్యవర్తులు నిరుద్యోగుల నుంచి పెద్ద మొత్తంలో డబ్బులు వసూలు చేస్తున్నారు. సరైన ఉద్యోగ ఒప్పందం లేకుండా, అవసరమైన అనుమతులు పొందకుండా పంపించడం వల్ల కార్మికులు అక్కడ చట్టపరమైన ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పర్యాటక వీసాలపై వెళ్లి ఉద్యోగాలు వెతుక్కునే వారు కూడా కొన్నిసార్లు మోసాలకు గురవుతున్నారు. విదేశాల్లో చిక్కుకున్న తర్వాత తిరిగి రావడానికి అవసరమైన డబ్బులు లేక, అధికారిక సహాయం పొందే విధానం తెలియక ఇబ్బందులు పడుతున్నారు. ఇలాంటి మోసాలను అరికట్టేందుకు నియామక సంస్థలపై కఠిన పర్యవేక్షణ ఉండాలి. విదేశీ ఉద్యోగాల పేరుతో డబ్బులు వసూలు చేసే ఏజెంట్ల వివరాలను పరిశీలించి, అనుమతి లేని సంస్థలపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలి. వలస వెళ్లాలనుకునే వారికి ప్రభుత్వ గుర్తింపు పొందిన సంస్థల ద్వారా ఉద్యోగ సమాచారం అందుబాటులో ఉంచాలి.

తెలంగాణ నుంచి గల్ఫ్ దేశాలకు వలస వెళ్లిన వారి సంఖ్య, వారి వృత్తులు, ఎదుర్కొంటున్న సమస్యలు, తిరిగి వచ్చిన వారి పరిస్థితులపై సమగ్ర సమాచారం అందుబాటులో ఉండటం కూడా కీలకం. వలస కార్మికుల కోసం ప్రత్యేక సమాచార వ్యవస్థను ఏర్పాటు చేస్తే విదేశాల్లో ఇబ్బందుల్లో ఉన్నవారిని గుర్తించడం, వారికి సహాయం అందించడం సులభమవుతుంది. విదేశాలకు వెళ్లే ముందు నమోదు చేసుకునే విధానాన్ని సులభతరం చేయడంతో పాటు, స్వచ్ఛందంగా వివరాలు నమోదు చేసుకున్న కార్మికులకు అత్యవసర సమయాల్లో సహాయం అందించే వ్యవస్థను బలోపేతం చేయాలి. విదేశాల్లోని భారత రాయబార కార్యాలయాలు, కేంద్ర ప్రభుత్వ విభాగాలు, రాష్ట్ర ప్రభుత్వ శాఖల మధ్య సమన్వయం మెరుగుపడాలి. బాధిత కార్మికుల ఫిర్యాదులను స్వీకరించేందుకు ప్రత్యేక సహాయ కేంద్రాలు, బహుభాషా సమాచార సేవలు అందుబాటులో ఉండాలి.



-గుర్రం పాపిరెడ్డి
ఎడిటర్

అరుణ ప్రభ
ARUNAPRABHA TELUGU DAILY
బుధవారం, సెప్టెంబరు 30, 2026

# అరుణప్రభ కథనానికి చలించిన కేటీఆర్

## జాతీయ స్థాయి క్రికెట్‌కు ఎంపికైన అక్షరకు అండగా నిలిచిన సిరిసిల్ల ఎమ్మెల్యే



ఎల్లారెడ్డిపేట అరుణప్రభ : రాజన్న సిరిసిల్ల జిల్లా గంభీరావుపేట మండలం మల్లారెడ్డిపేటకు చెందిన యువ క్రికెటర్ అక్షరకు సిరిసిల్ల ఎమ్మెల్యే, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అండగా నిలిచారు. జమ్మూకాశ్మీర్‌లో జరిగే జాతీయస్థాయి మహిళల అండర్--19 క్రికెట్ టోర్నమెంట్‌కు అక్షర ఎంపికైన విషయం తెలిసిందే. అక్షర ప్రతిభకు సంబంధించిన వివరాలతో ఎల్లారెడ్డిపేట అరుణప్రభలో ప్రచురితమైన కథనం కేటీఆర్ దృష్టికి వెళ్లడంతో స్పందించినట్లు తెలిసింది. అక్షరను ప్రోత్సహించాలనే ఉద్దేశంతో ఆమెను మర్యాదపూర్వకంగా కలిసే అవకాశం కల్పించారు. ఈ సందర్భంగా అక్షర కేటీఆర్‌ను కలిసి తన ఎంపిక, క్రికెట్ శిక్షణకు సంబంధించిన వివరాలను తెలియజేసింది. జాతీయస్థాయి పోటీల్లో పాల్గొనేందుకు అవసరమైన ఖర్చులు, శిక్షణకు సంబంధించిన సహాయాన్ని అందిస్తానని కేటీఆర్ భరోసా ఇచ్చినట్లు అక్షర కుటుంబ సభ్యులు తెలిపారు. గ్రామీణ ప్రాంతం నుంచి జాతీయస్థాయి క్రికెట్‌కు ఎంపికైన అక్షరకు ప్రోత్సాహం అందించడం పట్ల క్రీడాభిమానులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ప్రతిభ ఉన్న క్రీడాకారులకు ప్రోత్సాహం లభిస్తే మరింత ఉన్నత స్థాయికి ఎదిగే అవకాశం ఉంటుందని వారు పేర్కొన్నారు. అరుణప్రభ కథనానికి స్పందించి అక్షరకు అండగా నిలిచిన కేటీఆర్‌పై స్థానికంగా అభినందనలు వ్యక్తమవుతున్నాయి.

# రూ.345.78 కోట్ల అభివృద్ధి పనులకు నేడు సీఎం శ్రీకారం

## సిరిసిల్లలో భారీ బహిరంగ సభ.

## విద్య, ఆలయ అభివృద్ధి, ప్రభుత్వ కార్యాలయాలకు ప్రాధాన్యం.



ఎల్లారెడ్డిపేట అరుణప్రభ ప్రతినిధి । సెప్టెంబర్ 29 : రాజన్న సిరిసిల్ల జిల్లాలో అభివృద్ధి పనులకు మరో ముందడుగు పడనుంది. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఈ నెల 30న నేడురాజన్న సిరిసిల్ల జిల్లాలో పర్యటించనున్నారు. ముఖ్యమంత్రి హోదాలో తొలిసారిగా సిరిసిల్లకు రానున్న సీఎం. జిల్లా కేంద్రంలోని రగుడు బైపాస్ సమీపంలో నిర్వహించే భారీ బహిరంగ సభలో పాల్గొని ప్రజలను ఉద్దేశించి ప్రసంగించనున్నారు. ఈ సందర్భంగా జిల్లాలో మొత్తం రూ.345.78 కోట్ల విలువైన అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేపట్టనున్నారు. దీంతో సీఎం పర్యటనపై జిల్లా ప్రజల్లో ఆసక్తి నెలకొంది.

**విద్యారంగానికి రూ.200 కోట్ల ప్రాధాన్యం**

విద్యారంగ అభివృద్ధికి ప్రాధాన్యమిస్తూ సిరిసిల్ల, వేములవాడ నియోజకవర్గాల్లో రూ.200 కోట్ల వ్యయంతో నిర్మించనున్న యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూళ్లకు ముఖ్యమంత్రి శంకుస్థాపన చేయనున్నారు. ఈ పాఠశాలలు అందుబాటులోకి వస్తే విద్యార్థులకు మెరుగైన విద్యతో పాటు ఆధునిక వసతులు కల్పించే అవకాశం ఉంటుంది.

**రాజరాజేశ్వర స్వామి ఆలయానికి రూ.99.40 కోట్లు**

వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి ఆలయ అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తోంది. ఇందులో భాగంగా రూ.99.40 కోట్లతో చేపట్టనున్న 26 అభివృద్ధి పనులకు సీఎం రేవంత్‌రెడ్డి శ్రీకారం చుట్టనున్నారు. ఆలయానికి వచ్చే భక్తులకు మరింత మెరుగైన సౌకర్యాలు కల్పించే దిశగా ఈ పనులు చేపట్టనున్నారు.

**ప్రభుత్వ కార్యాలయాలకు కొత్త భవనాలు**

జిల్లాలో పరిపాలనా సౌకర్యాలను మరింత మెరుగుపరిచేలా పలు ప్రభుత్వ కార్యాలయాల నిర్మాణాలకు కూడా సీఎం శంకుస్థాపన చేయనున్నారు. సిరిసిల్ల, వేములవాడ ఆర్డీఓ కార్యాలయాలు, నాలుగు తహసీల్దార్ కార్యాలయాలు, వేములవాడ సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయ భవనాల నిర్మాణాలకు శంకుస్థాపన కార్యక్రమం జరగనుంది. ఒకే వేదికపై విద్య, దేవాలయ అభివృద్ధి, పరిపాలనా మౌలిక వసతులకు సంబంధించిన భారీ ప్రాజెక్టులకు శ్రీకారం చుట్టనుండటంతో సీఎం పర్యటనకు ప్రాధాన్యం ఏర్పడింది. రగుడు బైపాస్ సమీపంలో నిర్వహించే భారీ బహిరంగ సభకు అధికారులు విస్తృత ఏర్పాట్లు చేస్తున్నారు.

# భీమేశ్వర స్వామివారి సేవలో మంత్రి, ప్రభుత్వ విప్‌లు

## సంకష్టహర చతుర్థి సందర్భంగా ప్రత్యేక పూజలు

ఎల్లారెడ్డిపేట అరుణప్రభ: సంకష్టహర చతుర్థి సందర్భంగా వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవస్థానం అనుబంధ ఆలయమైన శ్రీ భీమేశ్వర స్వామివారిని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, ప్రభుత్వ విప్‌లు ఆది శ్రీనివాస్, చింతకుంట విజయరమణారావు, వేముల వీరేశం దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయానికి చేరుకున్న ప్రజాప్రతినిధులకు ఆలయ అర్చకులు, వేద పండితులు పూర్ణకుంభంతో ఘన స్వాగతం పలికారు. సంకష్టహర చతుర్థిని పురస్కరించుకుని సంకష్టి శ్రీ వినాయకునితో పాటు శ్రీ భీమేశ్వర స్వామివారికి ప్రత్యేక అభిషేకాలు, పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ మండపంలో వేద పండితులు ప్రజాప్రతినిధులకు వేదాశీర్వచనం అందజేశారు. ఈ సందర్భంగా వేములవాడ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ మంత్రి పొన్నం ప్రభాకర్‌తో పాటు ఇతర ప్రజాప్రతినిధులకు స్వామివారి శేషవస్త్రాలను కప్పి సత్కరించారు. ఆలయ ఈవో రమాదేవి స్వామివారి లడ్డూ ప్రసాదాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ డీఈఓ ప్రతాప్ నవీన్ కుమార్, ఏఈవోలు జయకుమారి, నాగుల మహేష్, ఆలయ ఉద్యోగులు, అర్చకులు, వేద పండితులు తదితరులు పాల్గొన్నారు.



# సీఎం సభకు కాంగ్రెస్ శ్రేణులు భారీగా తరలిరావాలి

## కాంగ్రెస్ శ్రేణులకు మంత్రి పొన్నం ప్రభాకర్ పిలుపు.

ఎల్లారెడ్డిపేట అరుణప్రభ, సెప్టెంబర్ 29: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి బుధవారం సిరిసిల్లలో నిర్వహించనున్న బహిరంగ సభకు కాంగ్రెస్ పార్టీ శ్రేణులు భారీ సంఖ్యలో తరలిరావాలని రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్ పిలుపునిచ్చారు. సభను విజయవంతం చేసేందుకు పార్టీ నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేయాలని కోరారు. సిరిసిల్లలో మంగళవారం నిర్వహించిన మీడియా సమావేశంలో మంత్రి పొన్నం ప్రభాకర్‌తో పాటు మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌రావు, ప్రభుత్వ విప్‌లు ఆది శ్రీనివాస్, వేముల వీరేశం, విజయరామారావు, ఎమ్మెల్యేలు మేడిపల్లి సత్యం, కవ్వంపల్లి సత్యనారాయణరావు, డీసీసీ అధ్యక్షుడు సంగీతం శ్రీనివాస్, నియోజకవర్గ ఇన్‌చార్జి కేకే మహేందర్‌రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అన్ని వర్గాల సంక్షేమం, అభివృద్ధికి కట్టుబడి పనిచేస్తోందన్నారు. ప్రజలకు ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను చూసి ప్రతిపక్షాలు రాజకీయ విమర్శలకు దిగుతున్నాయని ఆయన ఆరోపించారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సారథ్యంలో ప్రజా ప్రభుత్వం రాష్ట్రంలోని అన్ని వర్గాల అభ్యున్నతికి కృషి చేస్తోందని మంత్రి పేర్కొన్నారు. ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని పార్టీ శ్రేణులకు సూచించారు. బుధవారం సిరిసిల్లలో నిర్వహించనున్న ముఖ్యమంత్రి బహిరంగ సభకు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో తరలిరావాలని కోరారు. అలాగే ప్రజలను సభకు తీసుకువచ్చేలా స్థానిక నాయకులు సమన్వయంతో కృషి చేయాలని మంత్రి పొన్నం ప్రభాకర్ పిలుపునిచ్చారు.



# ఎల్లారెడ్డిపేట జర్నలిస్టులకు ఇండ్ల స్థలాలు మంజూరు చేయండి



## మంత్రికి జర్నలిస్టుల వినతి

ఎల్లారెడ్డిపేట, సెప్టెంబర్ 29 (అరుణప్రభ): ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలో నాలుగు దశాబ్దాలుగా జర్నలిస్టులుగా సేవలందిస్తున్న తమకు ఇండ్ల స్థలాలు మంజూరు చేయాలని రాష్ట్ర మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్‌ను జర్నలిస్టులు కోరారు. ఈ మేరకు సోమవారం మంత్రిని కలిసి వినతిపత్రం అందజేశారు. మండల కేంద్రంతో పాటు పరిసర గ్రామాల్లో వివిధ పత్రికలు, న్యూస్ ఛానళ్లలో పనిచేస్తున్న జర్నలిస్టులు ప్రజా సమస్యలను వెలుగులోకి తీసుకువస్తూ తమ వృత్తిని కొనసాగిస్తున్నప్పటికీ, ఇప్పటివరకు సొంత నివాస స్థలాలు లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని వారు మంత్రికి వివరించారు. నాలుగు దశాబ్దాలుగా జర్నలిజాన్ని నమ్ముకుని ప్రజలకు సేవ చేస్తున్న జర్నలిస్టులకు సొంత ఇంటి స్థలం లేకపోవడం బాధాకరమని, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం స్పందించి అర్హులైన జర్నలిస్టులకు ఇండ్ల స్థలాలు మంజూరు చేసి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని కోరారు. జర్నలిస్టుల వినతిపై మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ సానుకూలంగా స్పందించి, జర్నలిస్టులకు ఇండ్ల స్థలాల మంజూరుకు కృషి చేస్తామని హామీ ఇచ్చినట్లు జర్నలిస్టులు తెలిపారు. కార్యక్రమంలో ఎల్లారెడ్డిపేట మండలానికి చెందిన వివిధ పత్రికలజర్నలిస్టులు పాల్గొన్నారు.

## క్రీడల్లో అదరగొట్టిన అశ్వాపురం గిరిజన బిడ్డ జాతీయస్థాయికి కే. నవ్య



అరుణ ప్రభ:- అశ్వాపురం గ్రామానికి చెందిన గిరిజన క్రీడాకారిణి కే. నవ్య క్రీడారంగంలో సత్తా చాటింది. అండర్-16 గర్ల్స్ జావెలిన్ త్రో విభాగంలో సిల్వర్ మెడల్ సాధించి ప్రతిభను చాటడంతో పాటు, త్రోబాల్ క్రీడలో రాష్ట్రస్థాయిలో రాణించి జాతీయస్థాయి పోటీలకు ఎంపికైంది. రాష్ట్రస్థాయిలో అద్భుత ప్రతిభ కనబరిచి జాతీయస్థాయికి ఎంపిక కావడం పట్ల అశ్వాపురం గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ సందర్భంగా కే. నవ్యను కన్నెదారి వరప్రసాద్ అభినందించారు. జాతీయస్థాయి పోటీల్లోనూ అత్యుత్తమ ప్రతిభ కనబరిచి విజయం సాధించాలని ఆకాంక్షించారు. నవ్యకు సారపాకకు చెందిన కోచ్ గిరి ప్రసాద్ శిక్షణ అందిస్తున్నారు. కోచ్ మార్గదర్శకత్వంలో జాతీయస్థాయిలోనూ నవ్య మరిన్ని విజయాలు సాధించి అశ్వాపురం గ్రామానికి, జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని పలువురు ఆకాంక్షించారు.

## శంషాబాద్లో 19.27 ఎకరాల భూములపై జీహెచ్ఎంసీ నోటీసులు

### అనుమతులు లేని నిర్మాణాలపై హైకోర్టు ఆదేశాలతో విచారణ

### ఆధారాలతో హాజరుకావాలని ఇరుపక్షాలకు ఆదేశం

అరుణ ప్రభ శంషాబాద్ జోన్ సెప్టెంబర్ : శంషాబాద్ పరిధిలోని సుమారు 19.27 ఎకరాల విస్తీర్ణంలో చేపట్టిన నిర్మాణాలపై వివాదం నెలకొంది. ఈ వ్యవహారంలో జీహెచ్ఎంసీ శంషాబాద్ సర్కిల్-18 టౌన్ ప్లానింగ్ విభాగం సంబంధిత వర్గాలకు నోటీసులు జారీ చేసింది. ఎం/ఎస్ ఆశ్రిత ఇన్ఫ్రా ప్రాజెక్ట్స్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ తగిన లేకుండా నిర్మాణాలు చేపడుతోందని ఆరోపిస్తూ జి. భాస్కర్ రెడ్డి హైకోర్టును ఆశ్రయించారు. ఈ పిటిషన్పై (W.P. No.25805/2026) 2 అనుమతులు ఉన్నత న్యాయస్థానం... చట్టప్రకారం ఇరువర్గాల వాదనలు విని, తగిన ఆదేశాలు జారీ చేయాలని జీహెచ్ఎంసీ అధికారులను ఆదేశించింది. కోర్టు ఉత్తర్వుల నేపథ్యంలో సర్వే నంబర్లు 48, 49, 60, 61, 63, 84, 85, 86, 87, 88, 89లలోని మొత్తం 19.27 ఎకరాల భూములు, నిర్మాణ అనుమతులపై అధికారులు విచారణ ప్రారంభించారు. ఈ క్రమంలో పిటిషనర్ జి. భాస్కర్ రెడ్డితో పాటు ఎదురుపక్షమైన ఆశ్రిత ఇన్ఫ్రా ప్రతినిధి మెల్లంపూటి మధు తమ వద్దనున్న లిఖితపూర్వక ఆధారాలు, రికార్డులతో ట్యాంక్ బండ్ రోడ్డులోని జీహెచ్ఎంసీ కమిషనర్ ఛాంబర్ లో విచారణకు హాజరుకావాలని నోటీసుల్లో స్పష్టం చేశారు. ఇరుపక్షాలు సమర్పించే పత్రాలు, నిర్మాణ అనుమతులు, ఇతర రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించిన తర్వాతే అధికారులు చట్టప్రకారం తుది నిర్ణయం తీసుకోనున్నారు. కాగా, ఈ నోటీసు కేవలం విచారణ ప్రక్రియలో భాగమేనని, రికార్డుల పరిశీలన తర్వాతే నిర్మాణాల చట్టబద్ధతపై తుది స్పష్టత వస్తుందని అధికారులు పేర్కొన్నారు. శంషాబాద్లోని అత్యంత విలువైన భూములకు సంబంధించిన వ్యవహారం కావడంతో అధికారుల తదుపరి నిర్ణయంపై స్థానికంగా సర్వత్రా ఆసక్తి నెలకొంది



## శంషాబాద్ మున్సిపాలిటీలో స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ

అరుణ ప్రభ శంషాబాద్ జోన్ 29 : శంషాబాద్ మున్సిపాలిటీ పరిధిలో స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధికారి రామకృష్ణ, వాణి మేడం, నాయబ్ తహసీల్దార్‌తో పాటు రేషన్ డీలర్లు పాల్గొన్నారు. లబ్ధిదారులకు స్మార్ట్ రేషన్ కార్డులను అందజేసి, వాటి వినియోగం మరియు ప్రభుత్వ రేషన్ సేవలపై అధికారులు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సంబంధిత అధికారులు, రేషన్ డీలర్లు పాల్గొన్నారు.



## వికలాంగురాలికి అండగా బీజేపీ ఎస్టీ మోర్చా జిల్లా అధ్యక్షుడు

### 71 శాతం వైకల్యం నుంచి 31 శాతానికి ఎలా తగ్గింది?

### పెన్షన్ పునరుద్ధరించాలని అధికారులకు బీజేపీ డిమాండ్.

ఎల్లారెడ్డిపేట, అరుణప్రభ : పుట్టుకతోనే అంగవైకల్యంతో బాధపడుతున్న వికలాంగురాలు శివరాత్రి ఎల్లవ్వకు న్యాయం జరిగేలా చూడాలని భారతీయ జనతా పార్టీ ఎస్టీ మోర్చా జిల్లా అధ్యక్షుడు కిరణ్ నాయక్ డిమాండ్ చేశారు. ఎల్లారెడ్డిపేట మండల కేంద్రానికి చెందిన శివరాత్రి ఎల్లవ్వకు 2014లో సదరం ధ్రువీకరణ పత్రం ద్వారా 71 శాతం వైకల్యం ఉన్నట్లు నిర్ధారణ కావడంతో వికలాంగుల పింఛన్ అందుతుండేదని తెలిపారు. అయితే సుమారు పది నెలల క్రితం సదరం సర్టిఫికెట్ రెన్యువల్ సందర్భంగా ఆమె వైకల్యాన్ని 71 శాతం నుంచి 31 శాతానికి తగ్గించడంతో పింఛన్ నిలిచిపోయిందని పేర్కొన్నారు. దీంతో జీవనాధారం కోల్పోయిన ఎల్లవ్వ పరిస్థితిని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ దృష్టికి తీసుకెళ్లి, సమస్యను పరిశీలించి న్యాయం చేయాలని కిరణ్ నాయక్ కోరారు. పుట్టుకతోనే అంగవైకల్యంతో ఉన్న మహిళకు గతంలో 71 శాతం వైకల్యం ఉన్నట్లు ధ్రువీకరించిన నేపథ్యంలో, ప్రస్తుతం 31 శాతంగా ఎలా నిర్ధారించారనే విషయంపై సమగ్రంగా విచారణ జరపాలని డిమాండ్ చేశారు. అధికారుల నిర్లక్ష్యం వల్లే పింఛన్ నిలిచిపోయిందా? లేక సర్టిఫికెట్ ప్రక్రియలో ఏదైనా పొరపాటు జరిగిందా? అనే అంశాలను పరిశీలించి, తప్పిదం ఉంటే వెంటనే సరిదిద్దాలని కోరారు. ఎల్లవ్వకు తిరిగి వికలాంగుల పింఛన్ అందేలా చర్యలు తీసుకోవాలని బీజేపీ మండల శాఖ తరఫున డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా కౌన్సిల్ సభ్యుడు చందుపట్ల లక్ష్మారెడ్డి, వార్డు సభ్యుడు లింగాపురం ఆంజనేయులు, వార్డు సభ్యుడు కొత్త చెన్నయ్య తదితరులు పాల్గొన్నారు.

అరుణ ప్రభ
ARUNAPRABHA TELUGU DAILY
తెలుగు దినపత్రిక
బుధవారం, సెప్టెంబరు 30, 2026

# హైదరాబాద్-తాష్కెంట్ మధ్య నేరుగా విమాన సర్వీసు ప్రారంభం




## దక్షిణ భారతదేశం-మధ్య ఆసియా మధ్య తొలిసారి డైరెక్ట్ ఎయిర్ కనెక్టివిటీ

అరుణప్రభ – శంషాబాద్ జోన్ : శంషాబాద్: జీఎంఆర్ హైదరాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయం లిమిటెడ్ (జీహెచ్ఐఏఎల్) అంతర్జాతీయ విమాన కనెక్టివిటీ విస్తరణలో మరో కీలక మైలురాయిని సాధించింది. ఉజ్బెకిస్తాన్ రాజధాని తాష్కెంట్--హైదరాబాద్ మధ్య సెంట్రమ్ ఎయిర్ నూతన విమాన సర్వీసును ప్రారంభించింది. ఈ కొత్త విమాన మార్గంతో దక్షిణ భారతదేశం మరియు మధ్య ఆసియా మధ్య తొలిసారిగా నేరుగా విమాన కనెక్టివిటీ ఏర్పడింది. దీంతో హైదరాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయం మధ్య ఆసియా ప్రాంతానికి కీలకమైన గేట్‌వేగా తన స్థానాన్ని మరింత బలోపేతం చేసుకుంది. హైదరాబాద్ విమానాశ్రయం నుంచి తాష్కెంట్‌కు బయలుదేరిన తొలి విమాన సర్వీసుకు జీహెచ్ఐఏఎల్, సెంట్రమ్ ఎయిర్‌తో పాటు భాగస్వామ్య సంస్థలకు చెందిన ఉన్నతాధికారులు హాజరయ్యారు. ఈ సందర్భంగా విమానాశ్రయంలో ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించి కొత్త సర్వీసును ప్రారంభించారు. కొత్త విమాన మార్గం ద్వారా హైదరాబాద్‌తో పాటు దక్షిణ భారతదేశంలోని ప్రయాణికులకు మధ్య ఆసియా దేశాలకు నేరుగా ప్రయాణించే అవకాశం లభించనుంది. అదే విధంగా తాష్కెంట్ నుంచి వచ్చే ప్రయాణికులకు హైదరాబాద్, దక్షిణ భారతదేశంలోని వివిధ ప్రాంతాలకు మెరుగైన కనెక్టివిటీ అందుబాటులోకి రానుంది. ఈ కొత్త అంతర్జాతీయ సర్వీసు వాణిజ్యం, పర్యాటకం, విద్య, వైద్యం, వ్యాపార రంగాల్లో భారత్–ఉజ్బెకిస్తాన్ మధ్య సంబంధాలకు మరింత ఊతం ఇవ్వగలదని విమానాశ్రయ వర్గాలు పేర్కొన్నాయి.

# అంగన్వాడీ సేవలను సద్వినియోగం చేసుకోవాలి

**తల్లులు ఆరోగ్యంపై శ్రద్ధ పెట్టాలి.. పిల్లలకు పోషకాహారం అందించాలి.**

**బాలల మొదటి వెయ్యి రోజుల దశ ఎంతో కీలకం.**

**ప్రతి నెల పిల్లల ఎత్తు, బరువు నమోదు చేయించాలి. కలెక్టర్ గరిమ అగ్రవాల్.**

ఎల్లారెడ్డిపేట అరుణప్రభ : అంగన్వాడీ కేంద్రాల ద్వారా ప్రభుత్వం అందిస్తున్న సేవలను గర్భిణులు, బాలింతలు, చిన్నారుల తల్లిదండ్రులు సద్వినియోగం చేసుకోవాలని రాజన్న సిరిసిల్ల జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ సూచించారు. పిల్లల ఆరోగ్యకరమైన ఎదుగుదలకు చిన్న వయస్సు నుంచే సరైన పోషకాహారం అందించడం తల్లిదండ్రుల బాధ్యత అని ఆమె పేర్కొన్నారు. 9వ పోషణ మాసంలో భాగంగా 'మన అంగన్వాడీ--మన బాధ్యత' కార్యక్రమం కింద మంగళవారం ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలోని అంగన్వాడీ కేంద్రంలో నిర్వహించిన 'ప్రతి మంగళవారం 10 నిమిషాలు' కార్యక్రమానికి కలెక్టర్ గరిమ అగ్రవాల్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా గర్భిణులు, బాలింతలు, చిన్నారుల తల్లిదండ్రులకు పోషణ మాసం ప్రాముఖ్యతను వివరించారు. అంగన్వాడీ కేంద్రాల్లో అందుతున్న సేవలు, పోషకాహారం, పిల్లల ఎదుగుదల, ఆరోగ్య పరిరక్షణ తదితర అంశాలపై అవగాహన కల్పించారు.

**పోషకాహార ప్రదర్శన ఆకట్టుకుంది.**

పోషణ మాసం సందర్భంగా అంగన్వాడీ కేంద్రంలో ఏర్పాటు చేసిన పోషకాహార ప్రదర్శన ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. వివిధ రకాల కూరగాయలు, ఆకుకూరలు, బెల్లం, నువ్వులు, బాలామృతంతో తయారు చేసిన పోషకాహార పదార్థాలను ప్రదర్శించారు. చిన్నారులకు అందించాల్సిన సమతుల ఆహారం, గర్భిణులు, బాలింతలు తీసుకోవాల్సిన పోషక పదార్థాలపై అవగాహన కల్పించారు. కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి మంగళవారం 10 నిమిషాల కార్యక్రమాన్ని అన్ని అంగన్వాడీ కేంద్రాల్లో నిర్వహిస్తున్నామని తెలిపారు. అంగన్వాడీ కేంద్రాల్లో వసతుల మెరుగుదల, పోషకాహార పంపిణీ, బాలల హక్కుల పరిరక్షణ, మౌలిక వసతుల పెంపు వంటి అంశాలపై ప్రజాప్రతినిధులు, అధికారులు, ప్రజలు భాగస్వాములు కావాలని కోరారు. జిల్లాలో మొత్తం 586 అంగన్వాడీ కేంద్రాలు ఉన్నాయని, వాటి ద్వారా పిల్లలు, గర్భిణులు, బాలింతలు కలిపి సుమారు 40 వేల మంది సేవలు పొందుతున్నారని తెలిపారు. అంగన్వాడీ కేంద్రాలతో పాటు ఇళ్లు, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు.

**పిల్లల ఎత్తు, బరువుపై ప్రత్యేక దృష్టి.**

ఆరేళ్ల లోపు పిల్లలను తల్లిదండ్రులు ప్రతి నెల క్రమం తప్పకుండా అంగన్వాడీ కేంద్రాలకు తీసుకెళ్లాలని కలెక్టర్ సూచించారు. పిల్లల ఎత్తు, బరువును నమోదు చేయించి, వారి ఎదుగుదలకు అనుగుణంగా అవసరమైన పోషకాహారం అందేలా చూడాలన్నారు. చిన్నారులను ప్రతిరోజూ అంగన్వాడీ కేంద్రాలకు పంపించడం వల్ల పోషకాహారంతో పాటు ఆటలు, పాటలు, బొమ్మల ద్వారా ప్రాథమిక విద్య, మంచి అలవాట్లు అలవడతాయని వివరించారు. పిల్లల ఆరోగ్యం, భవిష్యత్తు విషయంలో తల్లిదండ్రులు ఇద్దరూ సమాన బాధ్యత తీసుకోవాలని అన్నారు. బాలల జీవితంలోని మొదటి వెయ్యి రోజుల దశ అత్యంత కీలకమని, ఈ సమయంలో పిల్లలకు ఇంటి వద్ద కూడా సరైన పోషకాహారం అందించాలని సూచించారు. అధికంగా చక్కెర పదార్థాలు ఇవ్వకుండా ఆరోగ్యకరమైన ఆహారాన్ని అలవాటు చేయాలని తెలిపారు.

**తల్లులు ఆరోగ్యంపై శ్రద్ధ పెట్టాలి.**

తల్లులు తమ ఆరోగ్యాన్ని నిర్లక్ష్యం చేయకూడదని కలెక్టర్ గరిమ అగ్రవాల్ సూచించారు. దేశంలో సుమారు 54 శాతం మంది మహిళలు రక్తహీనతతో బాధపడుతున్నారని పేర్కొంటూ,



రక్తహీనత ఉన్న మహిళలు ప్రతి ఆరు నెలలకు ఒకసారి రక్త పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. ప్రతి సోమవారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు ఏఎన్‌సీ పరీక్షల కోసం వచ్చే గర్భిణులకు భోజనం అందించేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. గర్భిణులు, బాలింతలు, మహిళలు ఆకుకూరలు, కూరగాయలు, నువ్వులు, బెల్లం, మునగ ఆకులు తదితర పోషక పదార్థాలను ఆహారంలో భాగం చేసుకోవాలని సూచించారు.

**ఎదుగుదల లోపాలను గుర్తిస్తే వెంటనే సమాచారం.**

ఐదేళ్లలోపు పిల్లల్లో ఎదుగుదల లోపాలు కనిపిస్తే సమీప అంగన్వాడీ కేంద్ర సిబ్బందికి వెంటనే సమాచారం అందించాలని కలెక్టర్ సూచించారు. ఎదుగుదల లోపాలు, వినికిడి లేదా మాట సమస్యలు, మానసిక అభివృద్ధి లోపాలు, నడవడంలో ఇబ్బందులు, పుట్టుకతో వచ్చే లోపాలు, మెదడుకు సంబంధించిన సమస్యలు, రక్తహీనత, పోషకాహార లోపం వంటి సమస్యలు ఉన్న పిల్లలను అంగన్వాడీ సిబ్బంది గుర్తించి వైద్యులకు సమాచారం అందించాలని తెలిపారు. వైద్య పరీక్షల అనంతరం అవసరమైన పిల్లలను ఆర్‌బీఎస్‌కే వాహనం ద్వారా వేములవాడ ఏరియా ఆసుపత్రిలోని డీఈఐసీ కేంద్రానికి తరలించి వైద్య సేవలు అందిస్తారని చెప్పారు. అక్కడ ప్రత్యేక వైద్య నిపుణులు అందుబాటులో ఉంటారని తెలిపారు. అవసరమైన వారికి కరీంనగర్‌లోని ఎన్ఆర్‌సీ కేంద్రంలో, ఉన్నత స్థాయి వైద్య సేవలు అవసరమైతే హైదరాబాద్‌లో చికిత్స అందించే అవకాశం ఉందని వివరించారు. ఈ సేవలను తల్లిదండ్రులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

**అంగన్వాడీలపై నిరంతర పర్యవేక్షణ.**

సూపర్‌వైజర్లు, సీడీపీఓలు తమ పరిధిలోని అన్ని అంగన్వాడీ కేంద్రాలను క్రమం తప్పకుండా తనిఖీ చేయాలని కలెక్టర్ సూచించారు. పిల్లలకు అందుతున్న పోషకాహారం, కేంద్రాల్లోని వసతులు, పిల్లల హాజరు, ఆరోగ్య పరిస్థితి తదితర అంశాలను పర్యవేక్షించాలని ఆదేశించారు. పిల్లల ఆరోగ్యకరమైన ఎదుగుదలకు అంగన్వాడీ కేంద్రాలు, వైద్య సిబ్బంది, తల్లిదండ్రులు, స్థానిక ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేయాల్సిన అవసరం ఉందని కలెక్టర్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి అఫ్జల్ బేగం, జిల్లా సంక్షేమ శాఖ అధికారి లక్ష్మీరాజం, జిల్లా వైద్యాధికారి డాక్టర్ ఏంజెలా ఆల్ఫ్రెడ్, తహసీల్దార్ రజనీ, ఎంపీడీఓ సత్తయ్య, సర్పంచ్ నరసింహులు, అంగన్వాడీ సిబ్బంది, గర్భిణులు, బాలింతలు, చిన్నారుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజల భాగస్వామ్యంతోనే ప్రజాపాలన సాధ్యం

**అధికారులు బాధ్యతాయుతంగా పనిచేయాలి..**
**అనవసర విద్యుత్ కోతలు విధిస్తే చర్యలు**

**ప్రభుత్వ వైద్యసేవలపై ప్రజల్లో అవగాహన కల్పించాలి**

**ఇబ్రహీంపట్నం మండల స్థాయి సమీక్షలో ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి**

ఇబ్రహీంపట్నం: ప్రజలు, ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పనిచేసినప్పుడే ప్రజాపాలన లక్ష్యం నెరవేరుతుందని ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి అన్నారు. ప్రజల సమస్యలను ఎప్పటికప్పుడు గుర్తించి, వాటి పరిష్కారానికి అధికారులు చొరవ చూపాలని సూచించారు. ప్రజలు చెబితేనే పనులు చేస్తామనే ధోరణిని విడనాడి, క్షేత్రస్థాయిలో ప్రజల అవసరాలను గుర్తించి బాధ్యతాయుతంగా వ్యవహరించాలని స్పష్టం చేశారు. మంగళవారం ఇబ్రహీంపట్నం మండల పరిషత్ కార్యాలయంలో వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులతో ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. మండలంలో జరుగుతున్న అభివృద్ధి పనుల పురోగతి, సంక్షేమ పథకాల అమలు, ప్రభుత్వ సేవల తీరుపై శాఖల వారీగా వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా పలు కీలక సూచనలు చేస్తూ, అధికార యంత్రాంగం పనితీరులో మార్పు రావాలని నిర్దేశించారు. ప్రభుత్వం నిర్దేశించిన మేరకు ప్రజలకు నిరంతరాయంగా విద్యుత్ సరఫరా జరిగేలా అధికారులు చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే ఆదేశించారు. చిన్నచిన్న మరమ్మతుల పేరుతో తరచూ విద్యుత్ సరఫరా నిలిపివేయడం, పైస్థాయి నుంచి విద్యుత్ సరఫరా అందుబాటులో ఉన్నప్పటికీ సబ్‌స్టేషన్ల వద్ద వివిధ కారణాలతో కోతలు విధించడం సరికాదన్నారు. ఇకపై విద్యుత్ నిర్వహణ పనులను వారంలో ఒకరోజుకే పరిమితం చేయాలని, ఆ రోజు కూడా కేవలం రెండు గంటలు మాత్రమే కేటాయించాలని సూచించారు. నిర్ణీత సమయం మినహా ఇతర రోజుల్లో అనవసరంగా విద్యుత్ సరఫరా నిలిపివేస్తే సంబంధిత అధికారులపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రజలకు, ముఖ్యంగా రైతులు, వ్యాపారులు, గృహ వినియోగదారులకు ఇబ్బందులు కలగకుండా విద్యుత్ శాఖ అధికారులు సమన్వయంతో పనిచేయాలని పేర్కొన్నారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో అనుభవజ్ఞులైన వైద్యులు, నాణ్యమైన మందులు, మెరుగైన వైద్యసేవలు అందుబాటులో ఉన్నప్పటికీ ప్రజలు ప్రైవేటు ఆస్పత్రులను ఆశ్రయించి అధిక ఖర్చులతో ఇబ్బందులు పడుతున్నారని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ప్రభుత్వ వైద్యసేవలపై ప్రజల్లో మరింత అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. గ్రామస్థాయిలో సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు చొరవ తీసుకుని ప్రజలకు ప్రభుత్వ ఆస్పత్రుల్లో అందుతున్న వైద్యసేవల గురించి వివరించాలని సూచించారు. అవసరమైతే గ్రామాల్లో దండోరా వేయించి ప్రజలకు సమాచారం అందించాలని చెప్పారు. ప్రస్తుతం నాలుగు ఆరోగ్య ఉపకేంద్రాల ద్వారా వైద్యసేవలు అందుబాటులో ఉన్నాయని, ఇబ్రహీంపట్నంలో ప్రభుత్వ ఆస్పత్రిని అత్యున్నత ప్రమాణాలతో అభివృద్ధి చేస్తున్నామని



తెలిపారు. ప్రజలకు నాణ్యమైన వైద్యం అందించడమే లక్ష్యంగా వైద్యశాఖ అధికారులు పనిచేయాలని సూచించారు. గ్రామాల అభివృద్ధి, ప్రభుత్వ పథకాల అమలులో పంచాయతీ కార్యదర్శుల పాత్ర కీలకమని మల్‌రెడ్డి రంగారెడ్డి అన్నారు. పంచాయతీ కార్యదర్శులు గ్రామాల్లో అన్ని శాఖల పనితీరును క్షేత్రస్థాయిలో పర్యవేక్షిస్తూ, సమస్యలను గుర్తించి సమగ్ర నివేదికలు రూపొందించాలని ఆదేశించారు. విధుల్లో భాగంగా ఉదయాన్నే వీలైనంత త్వరగా గ్రామాలకు చేరుకుని ప్రజలకు అందుబాటులో ఉండాలని సూచించారు. గ్రామాల్లో పారిశుద్ధ్యం, మౌలిక సదుపాయాలు, తాగునీరు, విద్యుత్ తదితర సమస్యల పరిష్కారానికి సంబంధిత శాఖల అధికారులతో సమన్వయం చేసుకోవాలని చెప్పారు. ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులను నిర్లక్ష్యం చేయకుండా సత్వరమే పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలన్నారు. మండల పరిధిలో అక్రమ మట్టి వ్యాపారం, అక్రమ వసూళ్లు, ఇతర చట్టవిరుద్ధ కార్యకలాపాలను అరికట్టేందుకు అధికార యంత్రాంగం కఠినంగా వ్యవహరించాలని ఎమ్మెల్యే సూచించారు. ఇలాంటి కార్యకలాపాలకు పాల్పడే వారిపై చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని, అక్రమాలకు అడ్డుకట్ట వేసేందుకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని కోరారు. ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించే వారిని ఉపేక్షించరాదని స్పష్టం చేశారు. క్షేత్రస్థాయిలో పనిచేస్తున్న కింది స్థాయి అధికారులకు విధి నిర్వహణలో ఎదురయ్యే సమస్యలను తన దృష్టికి తీసుకురావాలని సూచించారు. అవసరమైతే ఉన్నతాధికారులతో మాట్లాడి వాటి పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. అధికారులు ఎలాంటి ఒత్తిళ్లకు తలొగ్గకుండా ప్రజలకు మెరుగైన సేవలు అందించడమే లక్ష్యంగా పనిచేయాలని అన్నారు. ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ చేరేలా క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ పెంచాలని సూచించారు. ప్రజల అవసరాలకు అనుగుణంగా అధికారులు, ప్రజాప్రతినిధులు కలిసి పనిచేసినప్పుడే అభివృద్ధి ఫలాలు అందరికీ చేరుతాయని పేర్కొన్నారు. వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.



# వికసిత్ భారత్ గ్రామపంచాయతీ ప్రణాళికకు గ్రామసభల ద్వారా శ్రీకారం

**వనరుల మ్యాప్‌తో అభివృద్ధి పనుల గుర్తింపు..**

**ప్రతి ఇంటా ఇంకుడు గుంతలు నిర్మించుకోవాలి**

**గ్రామాభివృద్ధిలో ప్రజల భాగస్వామ్యమే కీలకం**

ఎల్లారెడ్డిపేట అరుణప్రభ : ఎల్లారెడ్డిపేట మండలంలోని ఎల్లారెడ్డిపేట, రాచర్ల బొప్పాపూర్, రాచర్ల గొల్లపల్లి, సింగారం గ్రామాల్లో వికసిత్ భారత్ గ్రామపంచాయతీ ప్రణాళిక (ఎదీస్రా)లో భాగంగా గ్రామసభలను నిర్వహించారు. ఆయా గ్రామాల సర్పంచుల అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమాల్లో గ్రామపంచాయతీ వనరులు, మౌలిక సదుపాయాలు, ఇప్పటికే పూర్తయిన పనులు, భవిష్యత్‌లో చేపట్టాల్సిన అభివృద్ధి పనులను గుర్తించి ప్రణాళిక రూపొందించారు. గ్రామసభల్లో భాగంగా విలేజ్ రిసోర్స్ మ్యాప్ (గ్రామ వనరుల చిత్రపటం) రూపొందించి గ్రామంలోని వనరులు, మౌలిక వసతులు, అభివృద్ధి అవసరాలను గుర్తించారు. ఇప్పటికే చేపట్టిన పనులను, భవిష్యత్‌లో చేపట్టాల్సిన పనులను చిత్రపటంలో గుర్తించి గ్రామ ప్రజలకు వివరించారు. ప్రజల అవసరాలను తెలుసుకుని, వారి భాగస్వామ్యంతో అభివృద్ధి పనులను ప్రణాళికలో పొందుపరిచారు. రాచర్ల బొప్పాపూర్‌లో సర్పంచ్ ఇల్లందుల గీతాంజలి శ్రీనివాస్ రెడ్డి అధ్యక్షతన రైతు వేదిక వద్ద గ్రామసభ నిర్వహించారు. ప్రతి ఇంటిలో ఇంకుడు గుంతలు నిర్మించుకోవాలని ఆమె గ్రామ ప్రజలకు సూచించారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ కొండాపురం వెంకట్ రెడ్డి, వార్డు సభ్యులు, వీవోలు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు. రాచర్ల గొల్లపల్లిలో సర్పంచ్ కొండ రమేష్ గౌడ్ అధ్యక్షతన రైతు వేదిక వద్ద గ్రామసభ జరిగింది. గ్రామంలో ప్రతి ఇంటికి ఇంకుడు గుంతలు నిర్మించుకోవాలని ఆయన కోరారు. ఉప సర్పంచ్ పొన్నాల మనెమ్మ, వార్డు సభ్యులు, పంచాయతీ కార్యదర్శి రామకృష్ణ, ఫీల్డ్ అసిస్టెంట్ చంద్రయ్య, ఏఎన్ఎం రిబికా, ఆశ కార్యకర్తలు, అంగన్వాడీ టీచర్లు, పీవీజీ రామ్‌జీ కార్మికులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు. సింగారం గ్రామంలో సర్పంచ్ ప్రమీల బాలరాజు ఆధ్వర్యంలో గ్రామసభ నిర్వహించారు. రిసోర్స్ మ్యాప్ ద్వారా గ్రామంలోని వనరులు, మౌలిక సదుపాయాలు, అభివృద్ధి అవసరాలను గుర్తించారు. గ్రామ ప్రజల సూచనలను తీసుకుని అవసరమైన పనులను గుర్తించి భవిష్యత్ ప్రణాళికలో పొందుపరిచారు. పంచాయతీ కార్యదర్శి, వార్డు సభ్యులు, ఫీల్డ్ అసిస్టెంట్, అంగన్వాడీ టీచర్, ప్రధానోపాధ్యాయుడు, ఏఎన్ఎం, గ్రామ ప్రజలు పాల్గొన్నారు. ఎల్లారెడ్డిపేట మేజర్ గ్రామపంచాయతీలో సర్పంచ్ ఎలగందుల నరసింహులు అధ్యక్షతన గ్రామపంచాయతీ కార్యాలయం వద్ద గ్రామసభ నిర్వహించారు. విలేజ్ రిసోర్స్ మ్యాప్ ద్వారా గ్రామంలోని వనరులు, ఇప్పటికే జరిగిన అభివృద్ధి పనులు, చేపట్టాల్సిన పనులను గుర్తించారు. ప్రతి ఇంటిలో ఇంకుడు గుంతలు, ఫార్మ్ పాండ్స్, రెయిన్ వాటర్ పిట్స్ నిర్మించుకోవాలని సర్పంచ్ సూచించారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ బంధారపు బాల్ రెడ్డి, వార్డు సభ్యులు, ఎంపీడీఓ జి. సత్తయ్య, అడిషనల్ ప్రోగ్రామ్ ఆఫీసర్ మెట్టు కొమరయ్య, పంచాయతీ కార్యదర్శి బొల్లారపు కృష్ణ, ఫీల్డ్ అసిస్టెంట్ కోనేటి నరేష్, టెక్నికల్ అసిస్టెంట్ ఆరెపల్లి ప్రభాకర్, వీవీ గ్రామీణ ఉపాధి కార్మికులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు. ప్రజల భాగస్వామ్యంతో గ్రామ అవసరాలను గుర్తించి, వాటిని ప్రణాళికాబద్ధంగా అమలు చేయడం ద్వారా గ్రామాలను మరింత అభివృద్ధి పథంలో నడిపించడమే వికసిత్ భారత్ గ్రామపంచాయతీ ప్రణాళిక లక్ష్యమని ఈ సందర్భంగా వివరించారు.



# ఐఐటీ విద్యార్థి చదువుకు అండగా కేటీఆర్

**అభ్యర్థించిన రెండు మూడు రోజుల్లోనే ల్యాప్‌టాప్ అందజేత**

ఎల్లారెడ్డిపేట అరుణప్రభ. : చదువుపై ఆసక్తి ఉండి, ఆర్థిక పరిస్థితులు అడ్డంకిగా మారిన విద్యార్థికి మాజీ మంత్రి, సిరిసిల్ల ఎమ్మెల్యే కల్వకుంట్ల తారక రామారావు (కేటీఆర్) అండగా నిలిచారు. ఎల్లారెడ్డిపేట మండలంలోని బాబాయ్ చెరువు తండాకు చెందిన అజ్మీర శరత్ నాయక్ ఐఐటీలో విద్యను అభ్యసిస్తున్నారు. తన చదువుకు ల్యాప్‌టాప్ అవ సరమని కేటీఆర్‌ను కోరారు. విద్యార్థి అభ్యర్థనకు స్పందించిన కేటీఆర్ రెండు మూడు రో జుల్లోనే ల్యాప్‌టాప్‌ను సమకూర్చి శరత్ నాయక్‌కు అందించారు. ఐఐటీ విద్యను కొనసాగించేందుకు అవసరమైన ల్యాప్‌టాప్‌ను అందుకోవడంతో విద్యార్థి ఆనందం వ్య క్తం చేశారు. విద్యార్థుల చదువుకు ప్రోత్సాహం అందిస్తూ, అవసరమైన సమయంలో అం డగా నిలిచిన కేటీఆర్‌కు శరత్ నాయక్ కుటుంబ సభ్యులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలి పా రు. ఈ సహాయానికి సహకరించిన మాజీ జెడ్పీటీసీ కళావతి--సురేష్ నాయక్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు రాజిరెడ్డి, గ్రామ సర్పంచ్ మాలోత్ సుధాకర్‌లకు కూడా విద్యార్థి ధన్యవాదాలు తెలిపారు. చదువుకు సాంకేతిక పరికరం అవసరమైన వేళ.. స్పందించి ల్యాప్‌టాప్ అందించడం విద్యార్థి భవిష్యత్‌కు తోడ్పాటుగా నిలిచిందని స్థానికులు పేర్కొన్నారు.



# బిజెపి ఓబీసీ ఆధ్వర్యంలో వృద్ధాశ్రమం సందర్శన.

**వృద్ధులకు మధ్యాహ్న భోజనం.. పండ్లు పంపిణీ..**

**సంగారెడ్డి జిల్లా బిజెపి ఓబీసీ అధ్యక్షులు కోణం విట్టల్.**

అరుణ ప్రభ న్యూస్ నారాయణఖేడ్.ప్రధానమంత్రి నరేంద్ర మోడీ జన్మదినోత్సవం సందర్భంగా సెప్టెంబర్ 17 నుండి అక్టోబర్ 17వ తేదీ వరకు నెల రోజులపాటు నిర్వహిస్తున్న సేవా సంకల్ప అభియాన్ కార్యక్రమంలో భాగంగా మంగళవారం సంగారెడ్డి జిల్లా బిజెపి ఓబీసీ అధ్యక్షులు కోణం విట్టల్ ఆధ్వర్యంలో వృద్ధాశ్రమంలో పలు కార్యక్రమాలు నిర్వహించారు. గుమ్మడిదల మండలం అన్నారం గ్రామంలో ఉన్న సేవా ఆశ్రమంలో వృద్ధులకు మధ్యాహ్న భోజనం అందించడంతోపాటు.. పండ్లను పంపిణీ చేశారు. అనంతరం వృద్ధులను అందరిని ఓబిసి బిజెపి ఆధ్వర్యంలో నాయకులు శాలువాలతో సన్మానించారు. ప్రధానమంత్రి నరేంద్ర మోడీ గారిని ఆశీర్వదించాలని వృద్ధులను కోరారు. మోడీ నాయకత్వంలో భారత దేశంలో అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సంగారెడ్డి జిల్లా బిజెపి అధ్యక్షురాలు గోదావరి అంజిరెడ్డి.. బిజెపి జిల్లా ఇన్చార్జి రమన్ సింగ్. బిజెపి ఓబీసీ జిల్లా అధ్యక్షులు కోణం విట్టల్ .. జిల్లా ప్రధాన కార్యదర్శి రాజశేఖర్ రెడ్డి. బిజెపి నాయకులు యన్ అశోక్ కుమార్ సగనాకర్ శ్రీనివాస్ మల్లేశం . తదితరులు పాల్గొన్నారు.

# రాజన్న ఆలయ అభివృద్ధికి ప్రభుత్వం ప్రాధాన్యం

## వందల కోట్లతో అభివృద్ధి పనులు చేపడుతున్నాం. మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్

ఎల్లారెడ్డిపేట, సెప్టెంబర్ 29: : వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి ఆలయ అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తోందని రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ, దివ్యాంగుల సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ అన్నారు. గతంలో వేములవాడ రాజన్న ఆలయ అభివృద్ధికి ఏటా రూ.100 కోట్లు కేటాయిస్తామని హామీ ఇచ్చినా, ఆ మేరకు అభివృద్ధి జరగలేదని ఆయన పేర్కొన్నారు. మంగళవారం ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలోని మాజీ సర్పంచ్ నెహ్రూ వెంకట్‌రెడ్డి నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మంత్రి మాట్లాడారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆధ్వర్యంలో వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి ఆలయాన్ని వందల కోట్ల రూపాయలతో అభివృద్ధి చేస్తున్నామని తెలిపారు. జగద్గురు ఆదిశంకరాచార్యుల మఠం సూచనలు, హిందూ ధర్మ సంప్రదాయాలకు అనుగుణంగా ఆలయ అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు చెప్పారు. అదేవిధంగా బాసరలో సరస్వతి అమ్మవారి ఆలయం, ధర్మపురిలో శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయం, కాళేశ్వరంలో ముక్తేశ్వరస్వామి ఆలయం, భద్రాద్రిలో శ్రీ సీతారామచంద్రస్వామి ఆలయాల అభివృద్ధికి ప్రభుత్వం చర్యలు చేపడుతోందన్నారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితులు ఉన్నప్పటికీ గోదావరి పుష్కరాల నేపథ్యంలో రూ.1,000 కోట్ల నిధులను ప్రభుత్వం విడుదల చేసిందని మంత్రి తెలిపారు. సిరిసిల్ల నియోజకవర్గంలో ప్రభుత్వ భూములు, అసైన్డ్ భూములకు సంబంధించి వచ్చిన ఫిర్యాదులను పరిశీలించి, నిబంధనలకు విరుద్ధంగా ఉన్న భూములపై చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని చెప్పారు. అర్హులైన నిరుపేదలకు ప్రభుత్వ సంక్షేమ పథకాల ద్వారా ప్రయోజనం కల్పించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. పేద విద్యార్థులకు మెరుగైన విద్యా సదుపాయాలు కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని మంత్రి తెలిపారు. ప్రభుత్వ హాస్టళ్లు, గిరిజన సంక్షేమ పాఠశాలల్లో మౌలిక వసతులను మెరుగుపరచడంతో పాటు



కాస్మోటిక్, డైట్ చార్జీలను పెంచినట్లు చెప్పారు. తాను జిల్లా పరిషత్ చైర్మన్‌గా ఉన్న సమయంలో సిరిసిల్ల ఎమ్మెల్యేగా ఉన్న కేటీఆర్ తన దృష్టికి తీసుకొచ్చిన పలు సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకున్నామని మంత్రి గుర్తుచేశారు. సిరిసిల్ల నియోజకవర్గంలో పలు సమస్యలు తమ దృష్టికి వస్తున్నాయని, వాటి పరిష్కారానికి ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్నారు. సిరిసిల్ల అభివృద్ధి కోసం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఈ నెల 30న సిరిసిల్లలో నిర్వహించే బహిరంగ సభకు హాజరవుతున్నారని తెలిపారు. సభకు కాంగ్రెస్ పార్టీ శ్రేణులు, ప్రజలు పెద్ద సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని మంత్రి పిలుపునిచ్చారు. సమావేశంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు సూది రాజేందర్, మాజీ అధ్యక్షుడు సద్ది లక్ష్మారెడ్డి, మాజీ సర్పంచ్ నెహ్రూ వెంకట్‌రెడ్డి, సర్పంచుల పూర్వ అధ్యక్షుడు దొమ్మాటి నరసయ్య, కాంగ్రెస్ నాయకులు చేపూరి రాజేశం, గుప్తాం బండారి బాల్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, గుర్రాల రాజిరెడ్డి, వంగ శ్రీకాంత్‌రెడ్డి, మారి శ్రీనివాస్‌రెడ్డి, సాహెబ్ తదితరులు పాల్గొన్నారు.

# సీఎం పర్యటనకు పటిష్ట భద్రత

## 1,600 మంది పోలీసులతో భారీ బందోబస్తు.

## భద్రతా విధుల్లో అప్రమత్తంగా ఉండాలి: ఎస్పీ మహేష్ బి. గితే

ఎల్లారెడ్డిపేట అరుణప్రభ, సెప్టెంబర్ 29: రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి బుధవారం రాజన్న సిరిసిల్ల జిల్లాలో పర్యటించనున్న నేపథ్యంలో జిల్లా పోలీస్ యంత్రాంగం పటిష్ట భద్రతా ఏర్పాట్లు పూర్తి చేసింది. ముఖ్యమంత్రి పర్యటన సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా సుమారు 1,600 మంది పోలీసు అధికారులు, సిబ్బందితో భారీ బందోబస్తు ఏర్పాటు చేసినట్లు జిల్లా ఎస్పీ మహేష్ బి. గితే తెలిపారు. పర్యటన బందోబస్తు విధుల్లో పాల్గొనే పోలీసు అధికారులు, సిబ్బందితో మంగళవారం కళ్యాణలక్ష్మి ఫంక్షన్ హాల్‌లో సమావేశం నిర్వహించిన ఎస్పీ.. భద్రతా ఏర్పాట్లు, విధుల నిర్వహణపై సమగ్రంగా దిశానిర్దేశం చేశారు. వీఐపీ భద్రత, ట్రాఫిక్ నియంత్రణ, పార్కింగ్, డ్యూటీ పాయింట్ల వద్ద అప్రమత్తత తదితర అంశాలపై సిబ్బందికి పలు సూచనలు చేశారు.

**12 సెక్టార్లుగా బందోబస్తు.**

ముఖ్యమంత్రి పర్యటన సందర్భంగా బందోబస్తును 12 సెక్టార్లుగా విభజించి పోలీసు అధికారులు, సిబ్బందిని విధుల్లో నియమించినట్లు ఎస్పీ తెలిపారు. కేటాయించిన డ్యూటీ పాయింట్లలో ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని, భద్రతా విధుల్లో ఎలాంటి నిర్లక్ష్యానికి తావులేకుండా విధులు నిర్వర్తించాలని ఆదేశించారు. ప్రత్యేకంగా పార్కింగ్ ప్రాంతాలు, ట్రాఫిక్ విధుల్లో ఉన్న సిబ్బంది మరింత అప్రమత్తంగా వ్యవహరించాలని సూచించారు. వాహనాల రాకపోకలకు అంతరాయం కలగకుండా, ట్రాఫిక్ జామ్ ఏర్పడకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని తెలిపారు. ముఖ్యమంత్రి పర్యటన ప్రశాంతంగా, సురక్షితంగా జరిగేలా



సమన్వయంతో పనిచేయాలని అధికారులకు సూచించారు.

**బందోబస్తులో పోలీసు బలగాలు.**

బందోబస్తులో 2 అదనపు ఎస్పీలు, 15 మంది డీఎస్పీలు, 50 మంది సీఐ/ఆర్ఐలు, 148 మంది ఎస్ఐ/ఆర్ఎస్ఐలు, 328 మంది ఏఎస్ఐ/హెడ్ కానిస్టేబుళ్లు, 482 మంది కానిస్టేబుళ్లు, 121 మంది మహిళా సిబ్బంది, 196 మంది హోంగార్డులు, 60 మంది బెటాలియన్ సిబ్బంది, 190 మంది డిస్ట్రిక్ట్ గార్డ్స్ సహా మొత్తం సుమారు 1,600 మంది పోలీసు అధికారులు, సిబ్బంది బందోబస్తు విధుల్లో పాల్గొంటున్నట్లు ఎస్పీ వివరించారు. సమావేశం అనంతరం అధికారులు, సిబ్బందికి కేటాయించిన ప్రాంతాలను పరిశీలించి, భద్రతా చర్యలను సమీక్షించారు. ఈ సందర్భంగా డీఎస్పీలు నాగేంద్రచారి, వెంకటేశ్వర్లు, వివిధ జిల్లాల నుంచి వచ్చిన డీఎస్పీలు, సీఐలు, ఆర్ఐలు, ఎస్ఐలు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

# కాంగ్రెస్ హయాంలో గురుకుల విద్యాసంస్థలలో మహిళా ఉపాధ్యాయులకు, విద్యార్థులకు భద్రత కరువు!

**: సబితా ఇంద్రారెడ్డి, మంచిరెడ్డి కిషన్ రెడ్డి**

**ఇబ్రహీంపట్నం నియోజకవర్గం చర్లపటేల్‌గూడ బీసీ, మైనారిటీ గురుకుల క్యాంపస్‌లో మహిళా సిబ్బంది, విద్యార్థులపై డాటా ఎంట్రీ ఆపరేటర్ లైంగిక వేధింపులు!?**

**ఫిర్యాదులపై స్పందించని విద్యాశాఖ అధికారులు,**

**స్థానిక ప్రజాప్రతినిధి తీరుపై సబితా ఇంద్రారెడ్డి, మంచిరెడ్డి కిషన్‌రెడ్డి ఆగ్రహం**

అరుణప్రభ ప్రతినిధి ఇబ్రహీంపట్నం : ఇబ్రహీంపట్నం నియోజకవర్గం: చర్లపటేల్‌గూడలోని బీసీ, మైనారిటీ గురుకుల క్యాంపస్‌లో విద్యార్థుల భద్రతకు సంబంధించిన తీవ్ర ఆరోపణలు, లైంగిక వేధింపులపై వచ్చిన ఫిర్యాదుల నేపథ్యంలో మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి, రంగారెడ్డి జిల్లా బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు శ్రీ మంచిరెడ్డి కిషన్ రెడ్డి క్యాంపస్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా విద్యార్థులు, ఉపాధ్యాయులు, ప్రిన్సిపల్ శ్రీలత తో మాట్లాడి క్యాంపస్‌లో నెలకొన్న పరిస్థితులు, విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలు, ఇటీవల వచ్చిన ఫిర్యాదులపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులు, సిబ్బంది నుంచి సమస్యలపై పలుమార్లు ఫిర్యాదులు వచ్చినప్పటికీ సంబంధిత విద్యాశాఖ ఉన్నతాధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు తగిన స్థాయిలో స్పందించకపోవడం తీవ్ర ఆందోళన కలిగించే అంశమని సబితా ఇంద్రారెడ్డి, మంచిరెడ్డి కిషన్‌రెడ్డి పేర్కొన్నారు. గురుకుల విద్యాసంస్థల్లో చదువుతున్న విద్యార్థులకు సురక్షితమైన వాతావరణం కల్పించడం ప్రభుత్వ బాధ్యత అని, విద్యార్థుల భద్రత విషయంలో ఎలాంటి నిర్లక్ష్యానికి తావు ఉండకూడదని వారు స్పష్టం చేశారు. విద్యార్థులపై లైంగిక వేధింపులకు సంబంధించిన ఫిర్యాదులు నిజమైతే, వాటిపై నిష్పక్షపాతంగా



సమగ్ర విచారణ జరిపి, ఆరోపణలు ఎదుర్కొంటున్న వ్యక్తిపై చట్టప్రకారం తక్షణ చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. లైంగిక వేధింపుల ఆరోపణలు ఎదుర్కుంటున్న డాటా ఎంట్రీ ఆపరేటర్ గా పనిచేస్తున్న వ్యక్తి ఈ రోజు బీఆర్ఎస్ బృందం వస్తుందని తెలిసి క్యాంపస్ కు రాకుండా తప్పించుకోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు, అలాగే మహిళల క్యాంపస్ లో పురుష సిబ్బందిని ఎలా నియమించారని ప్రశ్నించారు. విద్యాశాఖను పర్యవేక్షిస్తున్న ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డి ఈ ఘటనపై తక్షణమే స్పందించి, సంబంధిత అధికారుల నుంచి నివేదిక తెప్పించుకుని, విద్యార్థుల భద్రతకు భరోసా కల్పించాలని సబితా ఇంద్రారెడ్డి, మంచిరెడ్డి కిషన్‌రెడ్డి కాంగ్రెస్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

# మైనార్టీల సంక్షేమానికి మరో 500 కుట్టు మిషన్లు మంజూరు చేయండి

## మంత్రి అజారుద్దీన్‌కు ఎమ్మెల్యే డాక్టర్ సంజీవరెడ్డి విజ్ఞప్తి

## షాదీఖానా నిర్మాణానికి రూ.50 లక్షలు.. 200 కుట్టు మిషన్లు మంజూరు

హైదరాబాద్: నారాయణఖేడ్ నియోజకవర్గంలోని మైనార్టీల సంక్షేమం, అభివృద్ధికి అవసరమైన నిధులు, ఇతర సదుపాయాలు కల్పించాలని ఎమ్మెల్యే డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి రాష్ట్ర మైనార్టీ సంక్షేమ, పబ్లిక్ ఎంటర్‌ప్రైజెస్ శాఖల మంత్రి అజారుద్దీన్‌ను కోరారు. ఈ మేరకు మంత్రిని మర్యాదపూర్వకంగా కలిసిన ఎమ్మెల్యే నియోజకవర్గంలో చేపట్టాల్సిన అభివృద్ధి పనులు, మైనార్టీల సంక్షేమ కార్యక్రమాలపై విస్తృతంగా చర్చించారు. గతంలో తాను చేసిన విజ్ఞప్తి మేరకు నారాయణఖేడ్ మున్సిపాలిటీలో నూతన షాదీఖానా భవన నిర్మాణానికి రూ.50 లక్షలు, మున్సిపాలిటీ పరిధిలోని మైనార్టీ మహిళల స్వయం ఉపాధి కోసం 200 కుట్టు మిషన్లు మంజూరు చేసినందుకు మంత్రికి ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. నారాయణఖేడ్ నియోజకవర్గంలోని గ్రామీణ ప్రాంతాలకు చెందిన పేద మైనార్టీ మహిళలు, యువతులకు స్వయం ఉపాధి అవకాశాలు కల్పించి ఆర్థికంగా బలోపేతం చేసేందుకు అదనంగా మరో 500 కుట్టు మిషన్లు మంజూరు చేయాలని ఎమ్మెల్యే విజ్ఞప్తి చేశారు. కుట్టు మిషన్ల ద్వారా మహిళలు స్వయం ఉపాధి పొందడంతోపాటు కుటుంబ ఆర్థిక పరిస్థితులను మెరుగుపరుచుకునే అవకాశం ఉంటుందని వివరించారు. ఎమ్మెల్యే విజ్ఞప్తిపై మంత్రి అజారుద్దీన్ సానుకూలంగా స్పందిస్తూ, త్వరలోనే అదనపు కుట్టు మిషన్ల మంజూరుకు



అవసరమైన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. మైనార్టీల సంక్షేమం, అభ్యున్నతికి ప్రభుత్వం కృషి చేస్తోందని, నారాయణఖేడ్ నియోజకవర్గ సమగ్ర అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తామని ఎమ్మెల్యే డాక్టర్ సంజీవరెడ్డి ఈ సందర్భంగా పేర్కొన్నారు.



## గర్భిణులు ఆరోగ్యం పట్ల శ్రద్ధవహించాలి

గూడూరు – (అరుణ ప్రభ న్యూస్ ): గూడూరు మండల పరిధిలోని పారి చర్ల వారి పాలెంలో అంగన్వాడి ఉత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ గర్భిణీలు , బాలింతలు ఆరోగ్యం పట్ల శ్రద్ధవహించాలి అన్నారు. అదేవిధంగా పౌష్టికాహారం ను తీసుకోవాలని తెలిపారు. ప్రభుత్వ పథకాలు,పోషణ పై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడి సిబ్బంది అనిత, బాలాజీ నాయుడు , హరిబాబు , కుమారి , తదితరులు పాల్గొన్నారు.




## ఎన్నికల కమిషనర్ వెంటనే రాజీనామా చేయాలి. కాంగ్రెస్ పార్టీ డిమాండ్

గూడూరు – (అరుణ ప్రభ న్యూస్ ): ఇండియన్ నేషనల్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో భారత ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ వెంటనే రాజీనామా చేయాలని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పంటా శ్రీనివాసులు రెడ్డి డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారతదేశ ప్రజాస్వామ్య వ్యవస్థలో ఎన్నికల సంఘం అత్యంత కీలకమైన రాజ్యాంగ సంస్థ. దేశంలో ఎన్నికలు స్వేచ్ఛగా, నిష్పక్షపాతంగా, పారదర్శకంగా జరుగుతున్నాయనే విశ్వాసం ప్రతి ఓటరులో ఉండటం ప్రజాస్వామ్యానికి అత్యంత అవసరమన్నారు. ఎన్నికల సంఘం వ్యవహారశైలికి సంబంధించి రాజకీయ పార్టీలు, ప్రజలు వ్యక్తం చేస్తున్న వివిధ అభ్యంతరాలు ఆందోళనలను పరిగణనలోకి తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు.. ఎన్నికల ప్రక్రియపై ప్రజల్లో పూర్తి విశ్వాసం ఉండేలా ఎన్నికల సంఘం స్వతంత్రత, పారదర్శకత మరియు నిష్పక్షపాతిత్వాన్ని కాపాడాల్సిన బాధ్యత ఉందన్నారు. ఈ నేపథ్యంలో భారత ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ వెంటనే తన పదవికి రాజీనామా చేయాలని ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ తరపున డిమాండ్ చేశారు. భారత ఎన్నికల సంఘం దృష్టికి తీసుకెళ్లాలని కోరుతున్నామన్నారు. ప్రజాస్వామ్య విలువలు, ఓటర్ల హక్కులు , ఎన్నికల ప్రక్రియపై ప్రజల విశ్వాసాన్ని పరిరక్షించేందుకు తగిన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఐయన్ టి యు సి అధ్యక్షులు పూల చంద్ర శేఖర్,గూడూరు నియోజకవర్గం ఇంచార్జ్ డాక్టర్ రామకృష్ణయ్య, మాజీ జిల్లా ప్రదాన కార్యదర్శి చిలుకూరి వేమయ్య,రాష్ట్ర బిసి విభాగం కార్యదర్శి రావూరి బ్రహ్మయ్య, జిల్లా బిసి విభాగం నాయకులు గంటమడుగు సుబ్బరాజు, సైదాపురం మండల అధ్యక్షులు మురారి కృష్ణయ్య,యువజన కాంగ్రెస్ నాయకులు అనిల్ కుమార్,ముత్తుకూరు మండలం కాంగ్రెస్ అధ్యక్షులు అంకయ తదితరులు పాల్గొన్నారు.



## హైదరాబాద్‌లో 'బికమింగ్ ద డివైన్ యు' పుస్తకావిష్కరణ

### బల్విందర్‌నాథ్ చాగన్ల రచన ఆవిష్కరణ..

### స్వీయ అవగాహన, ఆధ్యాత్మికత, ఆనందంపై పుస్తకం

హైదరాబాద్, సెప్టెంబర్ 29: స్వీయ అవగాహన, ఆధ్యాత్మికత, భావోద్వేగాలు, నిజమైన ఆనందం కోసం అన్వేషణ ప్రధానాంశాలుగా బల్విందర్‌నాథ్ చాగన్ల రచించిన 'బికమింగ్ ద డివైన్ యు -- అవేకెన్ ద పవర్ విథిన్ టు ఫైండ్ ట్రూ హ్యాపీనెస్' పుస్తకాన్ని హైదరాబాద్‌లో ఆవిష్కరించారు. మాదాపూర్‌లోని హోటల్ నరేన్‌లో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో నరేన్ గ్రూప్ ఛైర్మన్ నరేంద్రనాథ్ చాగన్ల ముఖ్య అతిథిగా, నటుడు, ప్రేరణాత్మక వక్త కె.వి. ప్రదీప్ గౌరవ అతిథిగా పాల్గొని పుస్తకాన్ని ఆవిష్కరించారు. అతిథులు, స్నేహితులు, కుటుంబ సభ్యుల సమక్షంలో జరిగిన ఈ వేడుక సాహిత్యం, ఆధ్యాత్మికతతోపాటు తెలంగాణ సాంస్కృతిక వైభవాన్ని చాటిచెప్పింది. మానవ జీవిత ప్రయాణం, ఆత్మపరిశీలన, ఆలోచనలు, భావోద్వేగాలు, భయాలు, సంబంధాలు, ఆధ్యాత్మికత, ఆనందం వంటి అంశాలను ఈ పుస్తకంలో రచయిత వివరించారు. తన వ్యక్తిగత అనుభవాలు, అంతర్మథనం, యోగా, ధ్యానం, ఆధ్యాత్మికతపై ఆసక్తి నుంచి ఈ రచనకు శ్రీకారం చుట్టినట్లు తెలిపారు. మనిషి తనలోని శక్తిని గుర్తించి, నిజమైన ఆనందాన్ని అన్వేషించేందుకు ఈ పుస్తకం మార్గదర్శకంగా నిలుస్తుందని పేర్కొన్నారు. పాఠకులు ఆత్మపరిశీలన చేసుకుంటూ, తమలోనే ఉన్న ప్రశ్నలకు సమాధానాలను అన్వేషించాలని రచయిత ఈ పుస్తకం ద్వారా ఆహ్వానించారు. కార్యక్రమంలో తెలంగాణ సంప్రదాయ యోధుల నృత్యమైన పేరిణి శివతాండవం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. పద్మశ్రీ డాక్టర్ నటరాజ రామకృష్ణ శిష్యుడు పేరిణి పవన్‌కుమార్ తన బృందంతో కలిసి ఈ నృత్య ప్రదర్శన ఇచ్చారు. పేరిణి నృత్యంలోని శక్తి, వేగం, యోధుల స్ఫూర్తిని ప్రతిబింబించేలా సాగిన ప్రదర్శన ప్రేక్షకులను ఆకట్టుకుంది. ఈ సందర్భంగా ముఖ్య అతిథి, గౌరవ అతిథుల ప్రసంగాలు, రచయితతో ముఖాముఖి నిర్వహించి పుస్తక రచన వెనుక ఉన్న ఆలోచనలు, ఆయన ఆధ్యాత్మిక ప్రయాణం గురించి చర్చించారు. అనంతరం పేరిణి పవన్‌కుమార్, సంధ్యా పవన్‌లను ముఖ్య అతిథులు, గౌరవ అతిథులతో కలిసి సత్కరించారు. సాహిత్య, ఆధ్యాత్మిక అంశాలతోపాటు తెలంగాణ కళా సంప్రదాయానికి ప్రాధాన్యమిస్తూ నిర్వహించిన ఈ పుస్తకావిష్కరణ వేడుక ప్రత్యేకతను సంతరించుకుంది.

# రాజన్న దర్శనం ఎప్పుడు కల్పిస్తారు?

**సీఎం సభ వేదికగా ప్రజలకు సమాధానం చెప్పాలి.**
**నూలు డిపోను సిరిసిల్లకు మార్చాలి.**
**9వ ప్యాకేజీ పనులు వెంటనే పూర్తి చేయాలి.**
**బీజేపీ జిల్లా అధ్యక్షుడు రెడ్డబోయిన గోపి డిమాండ్.**



ఎల్లారెడ్డిపేట అరుణప్రభ : ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రాజన్న సిరిసిల్ల జిల్లాలో పర్యటించనున్న నేపథ్యంలో జిల్లాలో ప్రజలు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలపై ముఖ్యమంత్రి బహిరంగ సభ వేదికగా స్పష్టమైన సమాధానం ఇవ్వాలని బీజేపీ రాజన్న సిరిసిల్ల జిల్లా అధ్యక్షుడు రెడ్డబోయిన గోపి డిమాండ్ చేశారు. మంగళవారం సిరిసిల్లలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో ఇచ్చిన ఆరు గ్యారంటీలు, 420 హామీలను ప్రభుత్వం పూర్తిస్థాయిలో అమలు చేయలేదని గోపి విమర్శించారు. ముఖ్యమంత్రి జిల్లా పర్యటన సందర్భంగా ప్రజలకు ఇచ్చిన హామీల అమలుపై స్పష్టమైన ప్రకటన చేయాలని కోరారు. వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి ఆలయంలో గత పది నెలలుగా మూలవిరాట్ దర్శనం లేక భక్తులు తీవ్ర ఇబ్బందులు, మనోవేదనకు గురవుతున్నారని గోపి పేర్కొన్నారు. రాజన్న మూలవిరాట్ దర్శనాన్ని భక్తులకు తిరిగి ఎప్పటి నుంచి అందుబాటులోకి తీసుకువస్తారో ముఖ్యమంత్రి స్పష్టమైన తేదీని ప్రకటించాలని డిమాండ్ చేశారు. సిరిసిల్ల వస్త్ర పరిశ్రమకు నూలు డిపో ఎంతో కీలకమని, నూలు అవసరాల్లో అధిక భాగం సిరిసిల్లలోనే ఉన్నప్పటికీ డిపోను వేములవాడకు తరలించడంపై ప్రభుత్వం సమాధానం చెప్పాలని గోపి అన్నారు. నూలు డిపోను తిరిగి సిరిసిల్లకు ఎప్పుడు తీసుకువస్తారో సీఎం స్పష్టం చేయాలని డిమాండ్ చేశారు. గతంలో పీసీసీ అధ్యక్షుడిగా ఉన్న సమయంలో ఎల్లారెడ్డిపేట మండలం తిమ్మాపూర్‌లో ఇచ్చిన హామీ మేరకు కాళేశ్వరం 9వ ప్యాకేజీ పనులను వెంటనే చేపట్టి పూర్తి చేయాలని కోరారు. పనులు పూర్తికాకపోవడంతో సాగునీరు అందక రైతులు రెండో పంట సాగు చేయలేక నష్టపోతున్నారని తెలిపారు. రైతుల సమస్యల పరిష్కారం కోసం బీజేపీ ఆధ్వర్యంలో ఇప్పటికే పాదయాత్ర నిర్వహించి సంబంధిత అధికారులకు వినతిపత్రం అందజేశామని గోపి తెలిపారు. రాజన్న దర్శనం, నూలు డిపో, 9వ ప్యాకేజీ పనులు---ఈ మూడు ప్రధాన సమస్యలపై ముఖ్యమంత్రి రేపటి బహిరంగ సభ వేదికగా స్పష్టమైన ప్రకటన చేయాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు రెడ్డబోయిన గోపి డిమాండ్ చేశారు. సీఎం స్పందించకపోతే ప్రజల పక్షాన ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ సమావేశంలో బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# నగర శివారులో అక్రమ కార్యకలాపాలను అరికట్టాలి

**శాంతిభద్రతల పరిరక్షణలో నిర్లక్ష్యం వద్దు**
**పోలీసులకు, అధికారులకు ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి ఆదేశం**
**రైతులకు విద్యుత్ ఇబ్బందులు లేకుండా చర్యలు చేపట్టాలి**




హయత్‌నగర్: నగర శివారు ప్రాంతాల్లో అక్రమ కార్యకలాపాలను అరికట్టి శాంతిభద్రతలను పటిష్ఠంగా పరిరక్షించాలని ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి పోలీసు, అధికార యంత్రాంగాన్ని ఆదేశించారు. చట్టవిరుద్ధ కార్యకలాపాల నియంత్రణలో నిర్లక్ష్యం వహించవద్దని, ప్రజలకు భద్రత కల్పించడంలో బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు. హయత్‌నగర్‌లోని మండల పరిషత్ కార్యాలయంలో అబ్దుల్లాపూర్‌మెట్ మండల సర్వసభ్య సమావేశంలో ఆయన పాల్గొని వివిధ శాఖల పనితీరు, అభివృద్ధి కార్యక్రమాలు, ప్రజాసమస్యల పరిష్కారంపై సమీక్ష నిర్వహించారు. నగర శివారు ప్రాంతాల్లో చట్టవిరుద్ధ కార్యకలాపాలు పెరుగుతున్న నేపథ్యంలో పోలీసులు, సంబంధిత శాఖల అధికారులు అప్రమత్తంగా ఉండాలని మల్‌రెడ్డి రంగారెడ్డి సూచించారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగించే చర్యలను అడ్డుకోవాలని, అక్రమాలకు పాల్పడే వారిపై చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. పోలీసు, రెవెన్యూ, ఇతర శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని అన్నారు. అవసరాలకు అనుగుణంగా పోలీసు సిబ్బందిని అందుబాటులో ఉంచాలని, అదనపు సిబ్బంది అవసరమైతే ఉన్నతాధికారులతో మాట్లాడి కేటాయింపునకు కృషి చేస్తానని తెలిపారు. రైతులకు విద్యుత్ సరఫరా విషయంలో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించకూడదని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. వ్యవసాయ అవసరాలకు అనుగుణంగా విద్యుత్ సరఫరా జరిగేలా చర్యలు చేపట్టాలని విద్యుత్ శాఖ అధికారులను ఆదేశించారు. అదనపు ట్రాన్స్‌ఫార్మర్లు, విద్యుత్ స్తంభాలు, ఇతర సామగ్రి అవసరమైతే తన దృష్టికి తీసుకురావాలని సూచించారు. రైతులకు విద్యుత్ సమస్యలు తలెత్తకుండా అధికారులు క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ చేపట్టాలని, సమస్యలను సత్వరమే పరిష్కరించాలని నిర్దేశించారు. ప్రజాసమస్యల పరిష్కారంలో అధికారులు ఎలాంటి నిర్లక్ష్యం ప్రదర్శించవద్దని మల్‌రెడ్డి రంగారెడ్డి సూచించారు. ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించడంతోపాటు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులైన వారందరికీ అందేలా చూడాలన్నారు. అభివృద్ధి పనులను నిరంతరం పర్యవేక్షిస్తూ నిర్ణీత సమయంలో పూర్తి చేయాలని, ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు అధికారులు బాధ్యతాయుతంగా పనిచేయాలని పేర్కొన్నారు. సమావేశంలో వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# సిరిసిల్ల నియోజకవర్గాన్ని సీఎం దత్తత తీసుకోవాలి

**అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించాలని**
**టీజేఏస్ జిల్లా అధ్యక్షుడు అబ్దుల్ మజహార్ విజ్ఞప్తి.**



ఎల్లారెడ్డిపేట అరుణప్రభ. రాజన్న సిరిసిల్ల నియోజకవర్గ అభివృద్ధిపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రత్యేక దృష్టి సారించి, నియోజకవర్గాన్ని దత్తత తీసుకోవాలని తెలంగాణ జాయింట్ యాక్షన్ కమిటీ (టీజేఏసీ) రాజన్న సిరిసిల్ల జిల్లా అధ్యక్షుడు అబ్దుల్ మజహార్ విజ్ఞప్తి చేశారు. మంగళవారం గంభీరావుపేటలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాజన్న సిరిసిల్ల జిల్లా ఏర్పాటు ఉద్యమ సమయంలో అప్పటి కాంగ్రెస్ పార్టీ నాయకత్వం నుంచి మద్దతు లభించిందని, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సైతం జిల్లా ఏర్పాటు ఉద్యమానికి సంఘీభావం తెలిపారని అబ్దుల్ మజహార్ గుర్తుచేశారు. అనంతరం రాజన్న సిరిసిల్ల జిల్లా ఏర్పాటు కావడం జరిగిందన్నారు. 2023 ఎన్నికల సమయంలో సిరిసిల్ల నియోజకవర్గ అభివృద్ధిపై ప్రత్యేకంగా దృష్టి సారిస్తామని, నియోజకవర్గాన్ని దత్తత తీసుకునే అంశాన్ని ప్రస్తావించారని తెలిపారు. ప్రస్తుతం రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో ఉన్నందున సిరిసిల్ల నియోజకవర్గ అభివృద్ధికి ముఖ్యమంత్రి ప్రత్యేక ప్రాధాన్యం ఇవ్వాలని కోరారు. సాగునీరు, తాగునీరు, రహదారులు, పట్టణ మౌలిక వసతులు, చేనేత రంగం, పరిశ్రమలు తదితర రంగాల్లో మరింత అభివృద్ధి అవసరముందని పేర్కొన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టులోని 9వ ప్యాకేజీ పనులను త్వరితగతిన పూర్తి చేసి రైతులకు సాగునీరు అందేలా చర్యలు తీసుకోవాలని అబ్దుల్ మజహార్ కోరారు. అప్పర్ మానేరు ప్రాజెక్టు అభివృద్ధిపైనా ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించాలని విజ్ఞప్తి చేశారు. సాగునీరు, తాగునీటి సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపాల్సిన అవసరం ఉందన్నారు. సిరిసిల్ల పట్టణంలో వర్షాలు కురిసిన సమయంలో నీటి నిల్వలు ఏర్పడుతున్నాయని, డ్రైనేజీ సమస్యను పరిష్కరించేందుకు సమగ్ర ప్రణాళిక రూపొందించాలని కోరారు. నియోజకవర్గంలోని మౌలిక వసతులను మరింత బలోపేతం చేయాలని అన్నారు. సిరిసిల్ల చేనేత రంగానికి ప్రత్యేక గుర్తింపు ఉందని, ఈ రంగంపై ప్రభుత్వం మరింత దృష్టి సారించాలని అబ్దుల్ మజహార్ కోరారు. పద్మశాలీల కోసం యారన్ డిపోకు నిధులు కేటాయించడం, చేనేత కార్మికుల రుణమాఫీ వంటి చర్యలను ఆయన ప్రస్తావించారు. చేనేత కార్మికులకు మరిన్ని ఉపాధి, సంక్షేమ అవకాశాలు కల్పించాలని కోరారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సిరిసిల్ల నియోజకవర్గాన్ని ప్రత్యేకంగా దత్తత తీసుకుని అభివృద్ధి కార్యక్రమాలకు ప్రాధాన్యం ఇస్తే నియోజకవర్గం అన్ని రంగాల్లో మరింత పురోగతి సాధించే అవకాశం ఉంటుందని అబ్దుల్ మజహార్ పేర్కొన్నారు.

# వక్ఫ్ భూమిలో నిర్మాణంపై ఫిర్యాదు

**సర్వే నంబర్ 499లో అనుమతులు లేకుండా నిర్మాణాలు జరిగాయంటూ ఆరోపణలు**
**వక్ఫ్ భూమిలో అక్రమ నిర్మాణం నేలమట్టం!**
**ఫిర్యాదుతో రంగంలోకి దిగిన మున్సిపల్ అధికారులు : గజ్వేల్ కమిషనర్ పి. గణేష్ రెడ్డి**



గజ్వేల్ అరుణ ప్రభ: (సిద్దిపేట జిల్లా ప్రతినిధి) : గజ్వేల్--ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీ లోని గజ్వేల్‌లో వక్ఫ్ భూమిలో అనుమతులు లేకుండా చేపట్టిన నిర్మాణంపై మున్సిపల్ అధికారులు కొరడా ఝుళిపించారు. గజ్వేల్--జాలిగామ బైపాస్ రహదారి లోపల సర్వే నంబర్ 499లో సుమారు 150 గజాల స్థలంలో ఏర్పాటు చేసిన పిల్లర్లను టౌన్ ప్లానింగ్ సిబ్బంది తొలగించారు. వక్ఫ్ భూమిలో రాత్రికి రాత్రే నిర్మాణ పనులు చేపట్టారంటూ వక్ఫ్ ముతవల్లీ





అధికారులకు ఫిర్యాదు చేయడంతో అధికారులు స్పందించారు. దర్గా హజరత్ సయ్యద్ షా మహ్మద్ ఖాద్రీ వక్ఫ్ ఆస్తికి ఈ భూమి చెందుతుందని ఫిర్యాదుదారు పేర్కొన్నారు. ఈ వ్యవహారంపై గతంలో తహసీల్దార్, మున్సిపల్ కమిషనర్‌తో పాటు జిల్లా కలెక్టర్ ప్రజావాణిలోనూ ఫిర్యాదు చేసినట్లు వెల్లడించారు. వక్ఫ్ ఆడిట్ ఇన్‌స్పెక్టర్ సయ్యద్ సాబీర్ సైతం గతంలో మున్సిపల్ అధికారులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.

**"అక్రమ నిర్మాణాలను కూల్చేస్తాం" : మున్సిపల్ కమిషనర్ పి. గణేష్ రెడ్డి**

అనుమతులు లేకుండా నిర్మాణాలు చేపడితే కఠిన చర్యలు తీసుకుంటామని గజ్వేల్--ప్రజ్ఞాపూర్ మున్సిపల్ కమిషనర్ పి. గణేష్ రెడ్డి స్పష్టం చేశారు. వక్ఫ్ భూములను పరిరక్షించేందుకు నిబంధనల ప్రకారం చర్యలు కొనసాగుతాయని తెలిపారు.

## సి ఎం సభకు భారీగా కాంగ్రెస్ శ్రేణులు తరలి రావాలి

**డిసిసి ఉపాధ్యక్షులు ముషికం దత్తాద్రి గౌడ్**



ఎల్లారెడ్డి పేట అరుణప్రభ : రేపు సిరిసిల్లకు సి ఎం రేవంత్ రెడ్డి విచ్చేస్తున్న సందర్భంగా నిర్వహిస్తున్న భారీ బహిరంగ సభకు కాంగ్రెస్ పార్టీ శ్రేణులు భారీగా తరలి రావాలని జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షులు ముషికం దత్తాద్రి గౌడ్ కోరారు. ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి సారథ్యంలో రాష్ట్రంలో అన్ని వర్గాల ప్రజలకు లబ్ధి చేకూరే పథకాలు ప్రవేశ పెట్టబడ్డాయని తెలిపారు. ప్రజాభివృద్ధి,సంక్షేమం తో పాటు రైతులు, యువకులు, పారిశ్రామిక రంగం,మహిళలు,బి సి,ఎస్ సి,మైనార్టీ వర్గాల వారితోపాటు రాష్ట్రంలో అన్ని విధాల అభివృద్ధికి కాంగ్రెస్ పార్టీ పాటు పడుతుందని ఆయన తెలిపారు. లక్ష మంది తో నిర్వహించ తలపెట్టిన సి ఎం సభకు అధికంగా కాంగ్రెస్ పార్టీ శ్రేణులు ,ప్రజలు తరలి వచ్చి ముఖ్యమంత్రి సభను విజయ వంతం చేయాలని దత్తాద్రి గౌడ్ విజ్ఞప్తి చేశారు.




## రైతులేకుంటే మనిషి మనుగడే సాధ్యపడదు

**తుర్కయంజాల్ సహకార బ్యాంకు సర్వసభ్య సమావేశానికి హాజరైన ఎమ్మెల్యే**
**బ్యాకు పనితీరు పట్ల అభినందనలు తెలిపిన మల్ రెడ్డి**

అరుణప్రభ ప్రతినిధి ఇబ్రహీంపట్నం : రోజురోజుకు సాగు తగ్గిపోతుండటం ఆందోళనకరమని... రైతు లేకుంటే మనిషి మనుగడే ప్రశ్నార్థకమవుతుందని ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి పేర్కొన్నారు. రైతు సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం విప్లవాత్మక నిర్ణయాలు తీసుకుంటుందన్న ఆయన... ఇందులో భాగంగా తుర్కయంజాల్ సహకార బ్యాంకు చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. తుర్కయంజాల్ రైతు సేవా సహకార సంఘం 55వ సర్వసభ్య సమావేశం ఛైర్మన్ కొత్తకుర్మ సత్తయ్య అధ్యక్షతన జరగ్గా... ఎమ్మెల్యే మల్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. బ్యాంకు సాధించిన లాభాలకు సంబంధించిన గణాంకాలను ఈ సందర్భంగా పాలకవర్గం ఎమ్మెల్యేకు వివరించగా... ఆయన అభినందనలు తెలిపారు. అనంతరం, పలువురు రైతులకు వ్యవసాయ పనిముట్లను, చెక్కులను మల్‌రెడ్డి చేతుల మీదుగా అందజేయటం జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మల్‌రెడ్డి మాట్లాడుతూ..... తొలినుంచి తుర్కయంజాల్ సహకార బ్యాంకు పనితీరు అత్యుత్తమంగా ఉంటుందని గుర్తుచేశారు. బ్యాంకు సాధించిన లాభాలను ఏ రూపంలోనైనా రైతు కోసమే ఖర్చుచేయాలని ఆయన సూచించారు. పాలకవర్గం విజ్ఞప్తి మేరకు సహకార సంఘానికి భూమిలిప్పించే బాధ్యత తనదన్న ఎమ్మెల్యే.... గోడౌన్లు, కోల్డ్ స్టోరేజీలు ఏర్పాటు చేసే దిశగా చర్యలు చేపట్టాలన్నారు. అలాగే, నాణ్యమైన ఆయిల్ ఉత్పత్తి కోసం నూనెగింజల ప్రాసెసింగ్‌పై దృష్టి సారించాలని పాలకవర్గానికి ఆయన సూచనలు చేశారు. దేశంలోనే అతిపెద్ద సమీకృత మార్కెట్ కోహెడలో ఏర్పాటవుతుందన్న ఎమ్మెల్యే.... ఇది పూర్తైతే ఇక్కడి ప్రజలకు ఉపాధికి అవకాశాలు లభిస్తాయని చెప్పారు.




## బోనస్ పైన సీలింగ్ ఎత్తివేయాలి

**మజ్దూర్ యూనియన్ జోనల్ వర్కింగ్ కమిటీ సభ్యులు వరంగల్ బ్రాంచ్ సెక్రెటరీ యుగంధర్ యాదవ్**
**మజ్దూర్ యూనియన్ పిలుపుమేరకు మహబూబాబాద్‌లో రైల్వే కార్మికుల ఆందోళన**
**సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్**

అరుణప్రభ 29 సెప్టెంబర్ మహబూబాబాద్ అర్బన్ : మహబూబాబాద్ రైల్వే కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ మజ్దూర్ యూనియన్ పిలుపుమేరకు జోనల్ వర్కింగ్ కమిటీ సభ్యులు, ఎస్ సి ఆర్ ఎమ్ యు వరంగల్ బ్రాంచ్ సెక్రెటరీ కామ్రేడ్ యుగంధర్ యాదవ్ ఆధ్వర్యంలో మంగళవారం మహబూబాబాద్ పి.వే కార్యాలయం ముందు రైల్వే కార్మికులు ఆందోళన కార్యక్రమం నిర్వహించారు ఈ సందర్భంగా యుగంధర్ యాదవ్ మాట్లాడుతూ రైల్వేలో వివిధ విభాగాల్లో పనిచేస్తున్న కార్మికులు అనేక సమస్యలను ఎదుర్కొంటున్నప్పటికీ, వాటి పరిష్కారంలో అధికారుల నుంచి తగిన చర్యలు తీసుకోవడం లేదని తెలిపారు. కార్మికులపై అదనపు పనిభారం తగ్గించి, సురక్షితమైన పని వాతావరణం కల్పించాలని డిమాండ్ చేశారు. ట్రాక్ మైంటైనర్స్ గస్తీ పరిధిని 12 కిలోమీటర్లకు పరిమితం చేయాలని, కీమెన్ లకు అప్పగిస్తున్న అదనపు విధులను ఉపసంహరించాలని, ఖాళీ పోస్టులను వెంటనే భర్తీ చేయాలని, కొత్త అసెట్స్ కు అనుగుణంగా కొత్త పోస్టులను మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. అలాగే పెండింగ్‌లో ఉన్న ఓ టి ఎ , టి ఎ బకాయిలను చెల్లించాలని, లీవ్ ఎంకాష్మెంట్ , చిల్డ్రన్ ఎడ్యుకేషన్ అలవెన్సు లను వెంటనే విడుదల చేయాలని, రాత్రి గస్తీ విధులకు ఇద్దరు పెట్రోల్మెన్ లను నియమించాలని కోరారు. అర్హులైన ఉద్యోగులకు జి డి సి ఇ ఎల్ డి సి ఇ ఎ వి సి అవకాశాలు కల్పించాలని, పెండింగ్‌లో ఉన్న పరీక్షలను త్వరితగతిన నిర్వహించాలని, ఉద్యోగుల పదోన్నతుల కోసం సీబీటి పరీక్షలను క్రమం తప్పకుండా నిర్వహించాలని డిమాండ్ చేశారు. రైల్వే ఆసుపత్రుల్లో తగినంత సిబ్బందిని నియమించాలని, ట్రాక్ మైంటైనర్స్ మరియు లోకో పైలట్స్ కు యూనిఫామ్ కిట్స్ , వాటర్ బాటిల్స్ అందించాలని, పి ఎల్ బి పై ఉన్న రూపాయలు 7,000 గరిష్ఠ పరిమితిని తొలగించి వాస్తవ వేతనాల ఆధారంగా పి ఎల్ బి చెల్లించాలని కోరారు. రైల్వే కార్మికుల న్యాయమైన సమస్యలను అధికారులు తక్షణమే పరిష్కరించాలని, లేనిపక్షంలో మజ్దూర్ యూనియన్ ఆధ్వర్యంలో మరింత విస్తృతమైన పోరాట కార్యక్రమాలను నిర్వహిస్తామని యూనియన్ నాయకులు తెలిపారు ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ సెక్రెటరీ బాబురావు ఇంజినీరింగ్ కో ఆర్డినేటర్ సతీష్, యూత్ లీడర్స్ కనకయ్య, గోపీలాల్, జైల్ సింగ్, రాజు, రమేష్, సంతోష్, రాజు, నరేందర్, రవీ, వరుణ్, లత, లక్ష్మిలతో పాటు రైల్వే కార్మికులు, యూనియన్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# హైకోర్టు ఆదేశాలు బేకాతర్

## జీవో 111 అమలుపై అధికారులకు పిటిషనర్ ఫిర్యాదు

## అక్రమ నిర్మాణాల కూల్చివేతకు చర్యలు కోరిన పిటిషనర్



అరుణ ప్రభ, శంషాబాద్ జోన్,సెప్టెంబర్ 29 : న్యాయస్థానాలు హెచ్చరించిన కొందరు రియల్ ఎస్టేట్ వ్యాపారస్తుల పద్ధతులు మాత్రం మారడం లేదు.డబ్బే పరమావధిక భావిస్తూ అక్రమ నిర్మాణాలు చేపడుతూ కోట్ల రూపాయలు వెనకేసుకుంటున్నారు.అనుమతులు లేని విల్లాలు నిర్మిస్తూ అక్రమ సంపాదనే ధ్యేయంగా ప్రజలను దోచుకుంటున్నారు.వివరాల్లోకి వెళితే రంగారెడ్డి జిల్లా శంషాబాద్ గ్రామం,మండల పరిధిలోని పలు సర్వే నంబర్లలో నిర్మాణాల వ్యవహారం హైకోర్టు దృష్టికి వెళ్లింది.సర్వే నంబర్లు 48, 49, 60, 61, 63, 84, 85, 86, 87, 88, 89లో అక్రమ, అనుమతిలేని నిర్మాణాలు జరుగుతున్నాయని పేర్కొంటూ పిటిషనర్ హైకోర్టులో రిట్ పిటిషన్ దాఖలు చేశారు.భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 226 కింద పిటిషన్ దాఖలైంది. తన వినతి పత్రంపై అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని కోరారు.జీవో ఎంఎస్ నం.111ను సమర్థవంతంగా అమలు చేయాలని పిటిషన్‌లో పేర్కొన్నారు.అనుమతులకు విరుద్ధంగా ఉన్న నిర్మాణాలను పరిశీలించి అక్రమ నిర్మాణాలపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు.

### ఫిర్యాదుపై షోకాజ్ నోటీసు

పిటిషనర్ 21-07-2026న సంబంధిత అధికారులకు వినతిపత్రం ఇచ్చినట్లు కోర్టు ముందు సమర్పించిన పత్రాల్లో పేర్కొన్నారు.ఆ వినతిపత్రంపై 18-07-2026న షోకాజ్ నోటీసు జారీ చేసినట్లు మున్సిపల్ అధికారుల తరపు న్యాయవాది కోర్టుకు తెలిపారు. ప్రస్తుతం సంబంధిత అధికారి నం.4 విచారణ నిర్వహిస్తున్నారని వివరించారు.ఫిర్యాదులో పేర్కొన్న అంశాలను పరిశీలిస్తున్నట్లు కోర్టు దృష్టికి తీసుకువచ్చారు.అయితే నిర్మాణాలు కొనసాగుతున్నాయంటూ పిటిషనర్ తరపు న్యాయవాది వాదించారు.భవన నిర్మాణ అనుమతులు రద్దు చేసినప్పటికీ ప్రతివాది నం.7కు చెందిన బిల్డర్ నిర్మాణ పనులు కొనసాగిస్తున్నారని పేర్కొన్నారు.దీంతో నిర్మాణాలపై తక్షణ చర్యలు తీసుకోవాలని కోరారు.

### 46 విల్లాల వ్యవహారంపై భిన్న వాదనలు

ఈ కేసులో 46 విల్లాల నిర్మాణం ప్రధాన అంశంగా మారింది.నిర్మాణ అనుమతులు రద్దు చేసిన తరువాత కూడా నిర్మాణ కార్యకలాపాలు కొనసాగుతున్నాయని పిటిషనర్ తరపు న్యాయవాది ఆరోపించారు.అయితే ఈ ఆరోపణలను ప్రతివాది నం.7 తరపు న్యాయవాది ఖండించారు. 46 విల్లాలు ఇప్పటికే చాలా కాలం క్రితమే నిర్మించబడ్డాయని తెలిపారు. ప్రస్తుతం నిర్మాణ పనులు జరుగుతున్నాయన్న ఆరోపణ సరైనది కాదని వాదించారు.ఈ నిర్మాణాలకు సంబంధించి గతంలోనే హైకోర్టు ఉత్తర్వులు ఇచ్చిందని వివరించారు. డబ్ల్యూ.పీ. నం.1734/2022లో 07-01-2022న హైకోర్టు మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసిందని తెలిపారు.సదరు నిర్మాణాలను కూల్చివేయవద్దని ప్రతివాది నం.2ను అప్పట్లో కోర్టు ఆదేశించిందని న్యాయవాది పేర్కొన్నారు.దీంతో పాత కోర్టు ఉత్తర్వులు,ప్రస్తుత ఫిర్యాదులోని అంశాలు ఈ వ్యవహారంలో కీలకంగా మారాయి. నిర్మాణాలపై చర్యలకు పిటిషనర్ డిమాండ్‌లి..ఇదే సమయంలో పిటిషనర్ తరపు న్యాయవాది మరోసారి నిర్మాణ అనుమతుల రద్దు అంశాన్ని కోర్టు దృష్టికి తీసుకువచ్చారు.అనుమతులు రద్దయినప్పటికీ నిర్మాణాలు కొనసాగుతున్నాయని వాదించారు.అధికారులు ఫిర్యాదుపై పూర్తి స్థాయిలో చర్యలు తీసుకోవాలని కోరారు.అక్రమ నిర్మాణాలను నిలిపివేయడంతో పాటు నిబంధనలకు విరుద్ధంగా ఉన్న నిర్మాణాలపై చర్యలు తీసుకోవాలని అభ్యర్థించారు.కేసు తుది విచారణ పూర్తయ్యే వరకు తదుపరి నిర్మాణాలను నిలిపివేయాలని మధ్యంతర దరఖాస్తులో కోరారు. అధికారుల విచారణ పూర్తయిన తరువాత తదుపరి చర్యలు ఏ విధంగా ఉంటాయన్నది కీలకంగా మారింది.కోర్టు ముందుకు వచ్చిన వాదనల్లో ఒకవైపు నిర్మాణాలు కొనసాగుతున్నాయన్న ఆరోపణ,మరోవైపు నిర్మాణాలు గతంలోనే పూర్తయ్యాయన్న ప్రతివాది వాదన ఉన్నాయి.ఇక 2022లో జారీ అయిన మధ్యంతర ఉత్తర్వులు కూడా ప్రస్తుత వివాదంలో ప్రస్తావనకు వచ్చాయి.దీంతో శంషాబాద్‌లోని 46 విల్లాల వ్యవహారం మరోసారి చర్చనీయాంశంగా మారింది.

# క్రీడలతోనే ఉజ్వల భవిష్యత్తు

## ఘనంగా మహబూబాబాద్ జిల్లాస్థాయి (ఎస్ జి ఎఫ్ )పాఠశాలల క్రీడలు

## ముగింపు సమావేశములో విజేతలకు బహుమతి ప్రదానం



అరుణప్రభ 30 సెప్టెంబర్ మహబూబాబాద్ అర్బన్ : గత రెండు రోజులుగా మహబూబాద్ జిల్లా కేంద్రంలోని స్థానిక ఎన్టీఆర్ స్టేడియంలో నిర్వహిస్తున్న 70వ ఎస్ జి ఎఫ్ పాఠశాలల క్రీడల ముగింపు సమావేశానికి ముఖ్యఅతిథిగా జిల్లా ఇంచార్జ్ విద్యాశాఖ అధికారి శ్రీరాములు మరియు విశిష్ట అతిథులుగా క్రీడా పోషకులు మాజీ జడ్పిటిసి జిన్నా రెడ్డి పద్మజా వెంకటేశ్వర్లు గారు పాల్గొన్నారు మాట్లాడుతూ క్రీడలతోపాటు విద్యలో ప్రావీణ్యం ఉండాలని ఈ క్రీడల వల్ల నాయకత్వ లక్షణాలు సమయస్ఫూర్తి ఉన్నత స్థానాలకును అధిరోహించే తత్వము అలవడుతుందని ఇక్కడ సెలెక్ట్ అయినటువంటి క్రీడాకారులు రాష్ట్ర మరియు జాతీయస్థాయిలో రాణించి మహబూబాబాద్ జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు అదేవిధంగా గత రెండు రోజులుగా వ్యాయామ విద్య ఉపాధ్యాయుని ఉపాధ్యాయులు పట్టుదలతో అందరూ కలిసికట్టుగా ఏ జిల్లా స్థాయి క్రీడలను దిగ్విజయం చేశారని అభినందించారు జిన్నా రెడ్డి వెంకటేశ్వర్లు గారు మాట్లాడుతూ క్రీడాకారులు తమ భవిష్యత్తులో మంచి స్థాయిలో తమ యొక్క జీవితాలను మెరుగుపరచుకొని మీకు జీవితమిచ్చిన తల్లిదండ్రులకు కోచింగ్ ఇచ్చిన గురువులకు మంచి పేరు తీసుకురావాలని చెప్పారు జిల్లా ఎస్జీఎఫ్ ఆర్గనైజింగ్ సెక్రటరీ వాసిరెడ్డి ప్రవీణ్ రెడ్డి మాట్లాడుతూ గత రెండు రోజులుగా ఆరు జూన్ ల నుండి పాల్గొన్న అండర్ 14 ఇయర్ మరియు అండర్ 17 ఇయర్స్ బాలబాలికలకు ఈ రెండు రోజులు భోజన వసతి కల్పించి గెలుపొందినటువంటి క్రీడా జట్లు కు బహుమతులు మరియు సర్టిఫికెట్లు అందించడం జరిగిందిక్రీడలలో అదేవిధంగా ప్రతిభనే ఆధారంగా చేసుకుని క్రీడాకారులను ఉమ్మడి జిల్లాకు ఎంపిక చేయడం జరిగిందని ఇక్కడ ఎంపికైనటువంటి క్రీడాకారులు ఉమ్మడి జిల్లాలో ప్రథమ స్థానం పొందుతారని చెప్పారు ఈ ముగింపు కార్యక్రమంలో శంకర్ నాయక్ ఆ వారి శ్రీనివాస్ బానోత్ చాంప్లా నాయక్ కాశీ నా మహంకాళి వెంకటేశ్వర్లు జక్కి నాగేశ్వరరావు నాగిరెడ్డి కొమురయ్య వీరభద్రం పుష్పలీల నిర్మల రాజకుమారి తోపాటు జిల్లాలోని ఆరు జోనల్లా వ్యాయామ విద్య ఉపాధ్యాయిని ఉపాధ్యాయులు 120 మంది పాల్గొన్నారు






## గుండెను కాపాడుకుందాం ఆరోగ్యంగా జీవిద్దాం

అరుణ ప్రభ పత్రిక ప్రతినిధి సంగారెడ్డి జిల్లా : తేది 29.9.2026 మంగళవారం వరల్డ్ హార్ట్ డే సందర్భంగా బాలాజీ హాస్పిటల్స్ సంగారెడ్డి వారి ఆధ్వర్యంలో సదాశివపేట పట్టణంలో సైక్లింగ్ మరియు అవగాహన కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమాన్ని మాజీ TGIIC చైర్మన్ నిర్మల జగ్గారెడ్డి జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా బాలాజీ హాస్పిటల్స్ సంగారెడ్డి వారి ఆధ్వర్యంలో శ్రీ బసవ సేవా సదన్ లో నిర్వహించిన ఉచిత మెగా వైద్యశిబిరాన్ని జిల్లా ఎస్ పి పారితోజ్ పంకజ్ సందర్శించి బాలాజీ హాస్పిటల్స్ సేవలను అభినందించారు. ఈ కార్యక్రమంలో సదాశివపేట మున్సిపల్ చైర్మన్ శ్రీమతి మునిపల్లి అంజమ్మ సత్యనారాయణ కమిషనర్ శివాజీ వైస్ చైర్మన్ శ్రీమతి రేణుకా చిరంజీవి కౌన్సిలర్ లు, బాలాజీ హాస్పిటల్స్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ శ్రీధర్ , ఇంటర్నేషనల్ కార్డియాలజీస్ట్ డాక్టర్ మహేష్ క్లినికల్ కార్డియాలజీస్ట్ డాక్టర్ వేణుగోపాల్ డాక్టర్ అక్బర్ , డాక్టర్ సందిప్ , డాక్టర్ శ్రీమన్నారాయణ డాక్టర్ శంకర్ నారాయణ ,ఫిజిషియన్ డాక్టర్ అల్ఫియా రేచల్ బాలాజీ హాస్పిటల్స్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు

# బాధితులకు కొండంత అండగా నిలవాలి

## సఖి వన్ స్టాప్ సెంటర్‌లో డీఎల్ఎస్ఏ సెక్రటరీ స్వాతి మురారి



అరుణప్రభ 29 సెప్టెంబర్ మహబూబాబాద్ అర్బన్ : మహబూబాబాద్ జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ న్యాయమూర్తి శ్రీమతి స్వాతి మురారి స్థానిక 'సఖి' (వన్ స్టాప్) కేంద్రాన్ని మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా న్యాయమూర్తి కేంద్రంలో బాధితులకు అందుతున్న పునరావాసం, కౌన్సిలింగ్ మరియు న్యాయ సహాయం వసతులను, రిజిస్టర్లను తనిఖీ చేసి సిబ్బంది పనితీరును సఖి కేంద్రం అడ్మినిస్ట్రేటర్ శ్రావణిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం లీగల్ ఎయిడ్ కౌన్సిలర్ ఉష , మానసిక సామాజిక సలహాదారు సరస్వతి మరియు ఇతర సిబ్బందితో ఆమె ప్రత్యేకంగా సమావేశమయ్యారు. వివిధ సమస్యలతో, గృహహింసతో లేదా ఇతర ఆపదల్లో చిక్కుకుని ఆశ్రయం కోసం కేంద్రానికి వస్తున్న బాధిత మహిళలకు అందిస్తున్న కౌన్సెలింగ్ విధానంపై ఆరా తీశారు. బాధితుల కోసం ఏర్పాటు చేసిన షెల్టర్ హోమ్‌లో వసతులు, భద్రత, పరిశుభ్రత తదితర అంశాలను స్వయంగా పరిశీలించారు. అనంతరం సఖి కేంద్రం నిర్వహిస్తున్న దైనందిన నివేదికలు , కేసుల రికార్డులను ఆమె క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ సందర్భంగా న్యాయమూర్తి సిబ్బందిని ఉద్దేశించి మాట్లాడుతూ..ఆపదలో ఉన్న మహిళలు కేంద్రానికి రాగానే తక్షణమే స్పందించి, వారికి అవసరమైన వైద్య, న్యాయ, మరియు పోలీసు సాయాన్ని సత్వరమే అందించాలన్నారు. హింసకు గురైన మహిళలు తీవ్రమైన ఆందోళనలో ఉంటారు కాబట్టి, కౌన్సిలర్లు వారికి పటిష్టమైన కౌన్సెలింగ్ ఇచ్చి మానసిక స్థైర్యం కల్పించాలని సూచించారు. చట్టపరమైన హక్కులపై బాధితులకు అవగాహన కల్పించడంతో పాటు, అవసరమైన వారికి ఉచిత న్యాయ సహాయం అందేలా డీఎల్ఎస్ఏతో నిరంతరం సమన్వయం చేసుకోవాలన్నారు.సమాజంలో మహిళల రక్షణలో సఖి కేంద్రాల పాత్ర అత్యంత కీలకమన్న ఆమె.. ఇప్పటివరకు కేంద్రం సిబ్బంది బాధితులకు అందిస్తున్న సేవలను, వారి పనితీరును ఈ సందర్భంగా ప్రత్యేకంగా అభినందించారు. ప్రతి ఒక్కరూ భవిష్యత్తులోనూ ఇదే సేవా దృక్పథంతో, అంకితభావంతో విధులు నిర్వర్తించి బాధితులకు మరింత అండగా నిలవాలని ఆమె ఉద్బోధించారు. ఈ కార్యక్రమంలో సఖి కేంద్రం సిబ్బంది స్వాతి, లావణ్య, శోభ తదితరులు పాల్గొన్నారు.



## ఆంజనేయస్వామి ఆలయం వద్ద పులిహోర పంపిణి

### లక్ష్మీ శ్రీనివాస్ ( కోల్గూర్) కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో

గజ్వేల్ అరుణ ప్రభ : సిద్దిపేట జిల్లా గజ్వేల్ అంగడిపేట్ ఆంజనేయస్వామి ఆలయం వద్ద మంగళవారం మెతుకు లక్ష్మీ శ్రీనివాస్ ( కోల్గూర్) కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో పులిహోర పంపిణీ కార్యక్రమం నిర్వహించారు ఈ కార్యక్రమంలో పాల్గొన్న కొమురవెల్లి ఆలయ డైరెక్టర్ నంగునూరి సత్యనారాయణ మాట్లాడుతూ, అన్నదాన మహాదానమని ప్రతి మంగళవారం దాతల సహకారంతో పులిహోర పంపిణీ కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని సహకరిస్తున్న ప్రతి ఒక్కరికి దేవదేవతల అనుగ్రహం ఉంటుందని అన్నారు, ఆర్యవైశ్య మహాసభ సిద్దిపేట జిల్లా ఉపాధ్యక్షులు మల్యాల భద్రయ్య, గజ్వేల్ ప్రజ్ఞాపూర్ వాసవి క్లబ్ అధ్యక్షులు గంగిశెట్టి వెంకటేశం, సీనియర్ నాయకులు , అత్తెల్లి లక్ష్మయ్య, శ్రీహరి, శంకరయ్య, సిరిపురం సత్యనారాయణ, కైలాస ప్రశాంత్, ఉమేష్, ప్రసాద్, గందే సంతోష్, వెంకటేశం,రాములు ఆర్యవైశ్య నాయకులు పాల్గొన్నారు



## పోషకాహారంతోనే ఆరోగ్యకరమైన భవిష్యత్తు

### గర్భిణీలు, బాలింతలు, చిన్నారులు సమతుల్య ఆహారం తీసుకోవాలి

### పోషక మాసం సందర్భంగా అంగన్వాడి కేంద్రంలో అవగాహన

గజ్వేల్ అరుణ ప్రభ : పోషకాహారంతోనే ఆరోగ్యకరమైన జీవనానికి బాటలు వేయవచ్చని అంగన్వాడి సూపర్‌వైజర్ శ్రీలక్ష్మి అన్నారు. గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపల్ పరిధిలోని ప్రజ్ఞాపూర్ లోని మూడవ అంగన్వాడి కేంద్రంలో పోషక మాసం సందర్భంగా మహిళలు, విద్యార్థులకు పోషకాహారంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీలక్ష్మి మాట్లాడుతూ గర్భిణీలు, బాలింతలు, చిన్నారులు పోషక విలువలు కలిగిన సమతుల్య ఆహారం తీసుకోవడం ఎంతో అవసరమన్నారు. చిన్నారుల శారీరక, మానసిక ఎదుగుదలకు పోషకాహారం కీలకమని తెలిపారు. గర్భిణీలు, బాలింతలు తమ ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. రోజువారీ ఆహారంలో పప్పుధాన్యాలు, ఆకుకూరలు, కూరగాయలు, పండ్లు, పోషక విలువలు కలిగిన ఇతర ఆహార పదార్థాలను చేర్చుకోవాలని సూచించారు. పోషకాహార లోపం వల్ల కలిగే అనారోగ్య సమస్యలపై అవగాహన కలిగి ఉండాలని చెప్పారు. చిన్నారులకు సరైన సమయంలో పోషకాహారం అందించడం ద్వారా వారి ఎదుగుదలకు తోడ్పడవచ్చన్నారు. అంగన్వాడి కేంద్రాల ద్వారా ప్రభుత్వం అందిస్తున్న పోషకాహారాన్ని లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. పోషకాహారంతో పాటు పరిశుభ్రత, వ్యక్తిగత శుభ్రత, ఆరోగ్యకరమైన ఆహారపు అలవాట్లను పాటించాలని మహిళలు, విద్యార్థులకు సూచించారు. ప్రతి కుటుంబం పోషకాహార ప్రాధాన్యతను గుర్తించి ఆరోగ్యకరమైన జీవనశైలిని అలవర్చుకోవాలని శ్రీలక్ష్మి కోరారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్లు రామలక్ష్మి, రజిత, ఫర్జానా, నాగరాణి, ఆశా వర్కర్లు మహిళలు పాల్గొన్నారు.



## అశ్విని హాస్పిటల్‌లో ఘనంగా వరల్డ్ హార్ట్ డే వేడుకలు

### ::: గుండె ఆరోగ్యంపై అవగాహన అవసరం వైద్యులు.

ఎల్లారెడ్డిపేట, అరుణప్రభ : వరల్డ్ హార్ట్ డే సందర్భంగా ఎల్లారెడ్డిపేటలోని అశ్విని హాస్పిటల్‌లో సోమవారం ఘనంగా వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా అశ్విని హాస్పిటల్ వ్యవస్థాపకుడు డాక్టర్ జి. సత్యనారాయణ స్వామి, మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ అభినయ్ ఆధ్వర్యంలో వైద్యులు, వైద్య సిబ్బంది కలిసి కేక్ కట్ చేసి వరల్డ్ హార్ట్ డే వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా గుండె ఆరోగ్యంపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని, ఆరోగ్యకరమైన జీవనశైలిని అలవర్చుకోవడంతో పాటు క్రమం తప్పకుండా ఆరోగ్య పరీక్షలు చేయించుకోవడం ద్వారా గుండె సంబంధిత సమస్యలను ముందుగానే గుర్తించే అవకాశం ఉంటుందని వైద్యులు సూచించారు. కార్యక్రమంలో అశ్విని హాస్పిటల్ వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.



## కీర్తిశేషులు గోలి వెంకటేశం జ్ఞాపకార్థం అన్నదాన కార్యక్రమం

గజ్వేల్ అరుణ ప్రభ : సిద్దిపేట జిల్లా గజ్వేల్ అంగడిపేట ఆంజనేయస్వామి ఆలయం వద్ద కీర్తిశేషులు గోలి వెంకటేశం జ్ఞాపకార్థం పితృపక్షాల సందర్భాన్ని పురస్కరించుకొని, 2 వ వార్డ్ కౌన్సిలర్ గోలి మమత సంతోష్ వారి కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో, అన్న దాన కార్యక్రమం ఏర్పాటు చేశారు ఈ కార్యక్రమంలో పాల్గొన్న కొమురవెల్లి ఆలయ డైరెక్టర్ నంగునూరు సత్యనారాయణ, ఇటిక్యాల మాజీ సర్పంచ్ రావికంటి చంద్రశేఖర్, అయ్యప్ప దేవాలయం కమిటీ ప్రధాన కార్యదర్శి అయిత సత్యనారాయణ మాట్లాడుతూ, అన్నదానం మహాదానమని, పితృపక్షాల సందర్భంగా ప్రతిరోజు అంగడిపేట ఆంజనేయ స్వామి ఆలయం వద్ద అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేయడం జరుగుతుందని, అందులో భాగంగా కీర్తిశేషులు గోలి వెంకటేశం జ్ఞాపకార్థం అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేయడం జరిగిందని అన్నారు, ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం నాయకులు, గోలి మమతా సంతోష్ వారి కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు

# ఖాన్ అకాడమీ శిక్షణతో బోధనలో నూతన పద్ధతులు - విద్యార్థుల్లో అభ్యసన సామర్థ్యాల పెంపు

## ఇన్చార్జి డి ఈఓ మందుల శ్రీరాములు




అరుణప్రభ 29 సెప్టెంబర్ మహబూబాబాద్ అర్బన్ : మహబూబాబాద్, సెప్టెంబర్ 29: విద్యార్థుల్లో గణిత, విజ్ఞాన శాస్త్ర అంశాలపై ఆసక్తిని పెంపొందించడంతో పాటు, సాంకేతిక పరిజ్ఞానాన్ని బోధనలో సమర్థవంతంగా వినియోగించేందుకు ఖాన్ అకాడమీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉపాధ్యాయ శిక్షణ కార్యక్రమాన్ని ఉపాధ్యాయులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా విద్యాశాఖ అధికారి మందుల శ్రీరాములు సూచించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రస్తుత విద్యా విధానంలో ఉపాధ్యాయులు సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగిస్తూ విద్యార్థులకు సులభంగా అర్థమయ్యే రీతిలో బోధన అందించాల్సిన అవసరం ఉందన్నారు. ఖాన్ అకాడమీ అందిస్తున్న డిజిటల్ కంటెంట్, వీడియో పాఠాలు, అభ్యసన వనరులను ఉపాధ్యాయులు ముందుగా అవగాహన చేసుకుని, వాటిని తరగతి గదిలో విద్యార్థుల అవసరాలకు అనుగుణంగా వినియోగించాలని సూచించారు. శిక్షణలో నేర్చుకున్న అంశాలను కేవలం శిక్షణా కార్యక్రమానికే పరిమితం చేయకుండా, పాఠశాల స్థాయిలో అమలు చేయడం ద్వారా విద్యార్థుల అభ్యసన ఫలితాలను మెరుగుపరచాలని తెలిపారు. ప్రతి విద్యార్థి స్థాయిని గుర్తించి, అవసరమైన అదనపు అభ్యసన అవకాశాలను కల్పించడం ఉపాధ్యాయుల బాధ్యత అని పేర్కొన్నారు ఉపాధ్యాయులు నిరంతరం కొత్త బోధనా పద్ధతులను నేర్చుకుంటూ, డిజిటల్ వనరులను వినియోగిస్తూ "నాణ్యమైన బోధన -- మెరుగైన అభ్యసన ఫలితాలు" అనే లక్ష్యంతో పనిచేయాలని జిల్లా విద్యాశాఖ అధికారి పిలుపునిచ్చారు. మహబూబాబాద్ జిల్లాలో విద్యార్థుల విద్యా ప్రమాణాలను మరింత మెరుగుపరిచేందుకు ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయులు, ఎంఈఓలు మరియు సంబంధిత అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఆయన సూచించారు. ఇంకా ఈ కార్యక్రమం లో జిల్లా సైన్స్ అధికారి బి అప్పారావు, జె ఎన్ టి యు ఇంజినీరింగ్ కాలేజీ ప్రిన్సిపాల్ బలరాం నాయక్,క్వాలిటీ కోర్డినేటర్ వెంకటేశ్వర్లు, డి ఆర్ పి లు ముదిగిరి సదయ్య, ఏ. సతీష్, పురుషోత్తం గౌడ్, మహేష్ కుమార్ మరియు గణిత ఉపాధ్యాయులు పాల్గొన్నారు

# ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అనుచిత వ్యాఖ్యలు సరైనవి కాదు

## సీఎం దిష్టిబొమ్మను దహనం చేసిన బిజెపి నాయకులు



అరుణప్రభ 29 సెప్టెంబర్ మహబూబాబాద్ అర్బన్ : భారతీయ జనతా పార్టీ మానుకోట పట్టణ కమిటీ ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దిష్టిబొమ్మ దహన కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హిందూ దేవుళ్ళపై (డబ్బులు ఉన్న వారు రాముడుని పూజిస్తారు, డబ్బులు లేని వారు శివుని పూజిస్తారు అని) అనుచిత వ్యాఖ్యలను ఖండిస్తూ, స్థానిక ఎమ్మార్వో ఆఫీస్ నుండి నెహ్రూ సెంటర్ వరకు నల్ల బ్యాడ్జీలతో భారీ ఎత్తున ర్యాలీని నిర్వహించి, హిందూ దేవుళ్ళపై అనుచిత వ్యాఖ్యలు చేసిన రేవంత్ రెడ్డి వెంటనే రాజీనామా చేయాలని డిమాండ్ తో, నిరసన తెలుపుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేయడం జరిగింది.. దిష్టిబొమ్మను దహనం చేసే సమయంలో బిజెపి నాయకులకు మరియు పోలీసులకు మధ్య తోపులాట జరిగింది. ఈ తోపులాటలో కొంతమంది బిజెపి నాయకులకు స్వల్ప గాయాల అవడం జరిగింది. పోలీసు వ్యవస్థ అధికార పక్షానికి కొమ్ముకాస్తూ, బిజెపి నాయకులపై దాడి చేయడం ఎంత మాత్రం సమంజసం కాదు. ఈ కార్యక్రమంలో పట్టణ ఇన్చార్జి ఎల్దీ మల్లయ్య 26వ వార్డు కౌన్సిలర్ మాలోతు శ్రీదేవి బాలునాయక్ రాష్ట్ర కౌన్సిల్ మెంబర్ శ్యామ్ సుందర్ మైనార్టీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రేస్మ బిజెపి జిల్లా కార్యదర్శి ధార ఇందు భారతి రూరల్ మండలం అధ్యక్షులు జయేందర్ పట్టణ ప్రధాన కార్యదర్శులు రవి నాయక్ నరేష్ రూరల్ మండల ప్రధాన కార్యదర్శి హుస్సేన్ బీజేవైఎం జిల్లా అధ్యక్షులు దిడ్డి మహేష్ ఎస్టి మోర్చా జిల్లా అధ్యక్షులు సురేష్ పట్టణ ఉపాధ్యక్షులు రవి యాదవ్ మాలోతు బాలునాయక్ ప్రతాప్ రెడ్డి బొబ్బ సురేందర్ ఐదవ వార్డు సంతోష్ ఆరో వార్డు సంతోష్ సురేష్ సుజాత మహిళా మోర్చా పట్టణ అధ్యక్షురాలు మార్గం శైలజ గాడిపల్లి శ్యామ్ యాస్వంత్ జాన్సన్ అనిల్ బీజేవైఎం మాలే సాయి ఎస్టి మోర్చా కేలోతు గణేష్ తదితరులు పాల్గొన్నారు

# రోడ్డు ప్రమాదాల నివారణకు సమగ్ర చర్యలు చేపట్టాలి

## ప్రమాద రహిత జిల్లాగా

## తీర్చిదిద్దడమే లక్ష్యం : జిల్లా కలెక్టర్ స్నేహ శబరిష్



అరుణప్రభ 29 సెప్టెంబర్ మహబూబాబాద్ అర్బన్ : జిల్లాలో రోడ్డు ప్రమాదాలను అరికట్టడానికి, ప్రయాణికుల భద్రతను మెరుగుపరచడానికి సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో కఠిన చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ స్నేహ శబరిష్ ఆదేశించారు. మంగళవారం జిల్లా కలెక్టర్ స్నేహ శబరిష్ జిల్లా ఎస్పీ డాక్టర్ శబరిష్ తొ కలిసి కలెక్టరేట్ సమావేశ మందిరంలో పోలీస్, ఆర్అండ్‌బి (ఆర్ అండ్ బి ), రవాణా (ఆర్ టి ఓ ), నేషనల్ హైవేస్ (ఎన్ హెచ్ ఎ ఐ ), పంచాయతీ రాజ్, మున్సిపల్ శాఖల అధికారులతో "రోడ్డు భద్రత & ప్రమాదాల నివారణ"పై ఉన్నత స్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు ఈ సందర్భంగా కలెక్టర్ అధికారులు అందరూ బాధ్యతాయుతంగా పనిచేసి జిల్లాను రోడ్డు ప్రమాద రహితంగా తీర్చిదిద్దాలని అన్నారు. శాశ్వత నివారణ: జిల్లాలో ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్న ప్రాంతాలను (బ్లాక్ స్పాట్స్ ) తక్షణమే గుర్తించి రోడ్డు ఇంజనీరింగ్ లోపాలను సరిచేయాలి. డేంజర్ జోన్లు, మలుపుల వద్ద స్పష్టమైన హెచ్చరిక బోర్డులు, స్పీడ్ బ్రేకర్లు, రేడియంట్ స్టిక్కర్లు, కేట్ ఐస్ (క్యాట్ ఐస్ ) ఏర్పాటు చేయాలన్నారు. హెల్మెట్, సీట్ బెల్ట్ ధరించకపోవడం, అతి వేగం (ఓవర్ స్పీడింగ్ ), డ్రంక్ అండ్ డ్రైవ్‌లపై కఠిన తనిఖీలు చేపట్టాలి. మైనర్లు వాహనాలు నడిపితే తల్లిదండ్రులపై చట్టపరమైన చర్యలు తప్పవని, పరిమితికి మించి లోడ్ (ఓవర్ లోడింగ్ ) తో వెళ్లే వాహనాలపై భారీ జరిమానాలు విధించాలని అన్నారు. వర్షాల వల్ల రోడ్లపై ఏర్పడిన గోతులను తక్షణమే పూడ్చివేయాలి. రాత్రి వేళల్లో రహదారులపై తగినంత వెలుతురు ఉండేలా వీధి దీపాల నిర్వహణను మెరుగుపరచాలి. ప్రధాన రహదారుల పక్కన అక్రమంగా పార్క్ చేసే వాహనాలపై ఆర్‌టీఓ, ట్రాఫిక్ పోలీసులు కఠిన చర్యలు తీసుకోవాలని అన్నారు పాఠశాలలు, కళాశాలలు, బస్టాండ్లలో విద్యార్థులకు, ప్రజలకు రోడ్డు భద్రతా నిబంధనలపై అవగాహన సదస్సులు నిర్వహించాలి. ఆటో, క్యాబ్, లారీ డ్రైవర్లకు సురక్షిత ప్రయాణ నియమాలపై కౌన్సెలింగ్ ఇవ్వాలని, ప్రమాదం జరిగిన వెంటనే క్షతగాత్రులను ఆసుపత్రికి తరలించేలా 108 అంబులెన్స్ సేవలను అనుసంధానించాలని, రహదారులకు సమీపంలో ఉన్న ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రులను ఎల్లప్పుడూ అత్యవసర సేవల కోసం సిద్ధంగా ఉంచాలని వైద్యారోగ్య శాఖను ఆదేశించారు. ప్రతి నెలా అన్ని శాఖల అధికారులు సమావేశమై రోడ్డు భద్రత పురోగతిపై సమీక్ష జరపాలని స్పష్టం చేశారు జిల్లాలో ఎక్కువగా మరిపెడ, తొర్రూరు, గూడూర్, మండలలో ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయని, మరిపెడ జాతీయ రహదారి నెంబర్ 365, 563, పై సమస్యలు గుర్తించమని కేవలం మరిపెడ లో (13) మంది చనిపోయారని, అలాగే కాంపెల్లి, కందికొండ, ఉప్పరి గూడెం, నల్లెల, తొర్రూరు పాలకేంద్రం జంక్షన్, టౌన్, గూడూరు మండల కేంద్రం, భూపతిపేట, దామరవంచ, బొద్దుగొండ, వద్ద హై టెంక్షన్ వైర్ల, సమస్యలు, మహబూబాబాద్ టౌన్, బెతోల్, తల్లపుసపల్లి, కురవి ఏకవలవ్య స్కూల్, బయ్యారం జాతీయ రహదారి 930 పి, పై సాయిబాబా, టెంపుల్, సత్యనారాయణపురం, కొత్తపేట, గంధంపల్లి, లలో సమస్యల పరిష్కారం కోసం వెంటనే ప్రత్యేక చర్యలు తీసుకోవాలని,భవిష్యత్తులో ఇలాంటివి జరగకుండా జాగ్రత్తగా ప్రయాణం చేసే విధంగా అవగాహన కల్పించే బాధ్యత సంబంధిత అధికారులు తీసుకోవాలని కోరారు రహదారులపై సంతలు,( అంగడి) నిర్వహించకుండా చర్యలు తీసుకోవాలని, హైవే పై ప్రత్యేక వాహనాలు పెట్రోలింగ్ నిర్వహించాలని, అంబులెన్స్ లు అందుబాటులోకి ఉంచుకోవాలని సూచించారు రహదారుల వెంబడి స్థలాలను ఆక్రమించకుండా చర్యలు తీసుకోవాలని, బిల్డింగ్ పర్మిషన్లను తనిఖీ చేయాలని, అన్ని విభాగాలకు సంబంధించి రోడ్డు భద్రత అంశాలపై ఎలాంటి నిధులు అవసరమున్న వెంటనే నివేదికలు తయారుచేసి వారం రోజులుగా పంపాలని కలెక్టర్ సంబంధిత అధికారులు ఆదేశించారు రోడ్డు భద్రత తదితర అంశాలపై పిల్లలు ప్రజల్లో విస్తృత అవగాహన ప్రచారం కల్పించాలని తెలిపారు, అన్ని విభాగాల సంబంధిత అధికారులు జాయింట్ యాక్షన్ ప్లాన్ ప్రకారం నివేదికలు రెడీ చేసి తీసుకోవలసిన జాగ్రత్తలపై యాక్షన్ టేకెన్ రిపోర్టు ఇవ్వాలని, జాతీయ రహదారుల వెంబడి నిబంధనల మేరకు మద్యం దుకాణాలను అనుమతి ఇవ్వాలని అన్నారు జిల్లాలో రోడ్డు ప్రమాదాలను అరికట్టడానికి పోలీసు శాఖ తరఫున నిరంతర నిఘా మరియు కఠిన చర్యలు ఉంటాయని స్పష్టం చేశారు హెల్మెట్ లేకుండా ప్రయాణించే వారిపై, సీట్ బెల్ట్ ధరించని వారిపై, అతివేగం (ఓవర్ స్పీడింగ్ ) మరియు మద్యం తాగి వాహనాలు నడిపే (డ్రంక్ అండ్ డ్రైవ్ ) వారిపై రాజీ లేని తనిఖీలు నిర్వహిస్తామని తెలిపారు మైనర్లు వాహనాలు నడుపుతూ పట్టుబడితే వాహన యజమానులతో పాటు వారి తల్లిదండ్రులపై చట్టపరమైన కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు పరిమితికి మించి లోడ్‌తో వెళ్లే (ఓవరలోడింగ్ ) లారీలు, ట్రాక్టర్లు ప్రమాదాలకు ప్రధాన కారణమవుతున్నాయని, అలాంటి వాహనాలపై భారీ జరిమానాలు విధించాలని అధికారులను ఆదేశించారు రహదారుల పక్కన, జాతీయ రహదారులపై అక్రమంగా వాహనాలను నిలిపివేస్తే ఆర్ టి ఓ మరియు ట్రాఫిక్ పోలీసులు వెంటనే క్రేన్ల సహాయంతో తొలగించి కఠిన చర్యలు తీసుకోవాలన్నారు డ్రైవర్లను సమూహాలుగా చేసి వారి ప్రవర్తనలో మార్పు వచ్చేలా, రోడ్డు నియమాలు పాటించేలా పోలీసు స్టేషన్ల వారీగా ప్రత్యేక కౌన్సెలింగ్ కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించి తమ విలువైన ప్రాణాలను కాపాడుకోవాలని, పోలీసు శాఖకు సహకరించాలని కోరారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ రెవెన్యూ కె. అనిల్ కుమార్, ఇన్చార్జి అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు హౌసింగ్ పీడీ పురుషోత్తం, ఆర్ అండ్ బి ఈఈ రాజు, డీఎస్పీ తిరుపతి రావు, డిఆర్‌ఓ నాగలక్ష్మి,ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ నితీష్, నేషనల్ హైవే పిడి,పిఆర్, ఆర్ అండ్ బి, ఈ ఈ లు, డిస్ట్రిక్ట్ ట్రాన్స్పోర్ట్ ఆఫీసర్, డివిహెచ్‌ఓ డాక్టర్ కిరణ్ కుమార్, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ రవి రాథోడ్, ఏరియా ఆసుపత్రి సూపరింటెంట్ డాక్టర్ శ్రీనివాస్, డాక్టర్ రమేష్, ఎస్సీ ఎస్టీ, మైనార్టీ, సంక్షేమ శాఖ అధికారులు, ఆర్సిఓ లు, ఇంటర్ మీడియట్ అధికారి మదర్, ఎక్సైజ్, పోలీస్, అధికారులు, మున్సిపల్ కమిషనర్లు, డిపిఓ రేవంత్, సంబంధిత అన్ని విభాగాల అధికారులు, కలెక్టరేట్ పర్యవేక్షకులు రాజేష్, తదితరులు పాల్గొన్నారు

# పిల్లల వ్యక్తిత్వ వికాసానికి పార్కులు దోహదం

## లక్ష్మీనగర్ పార్క్ సన్నాహక సమావేశంలో వక్తలు



అత్తాపూర్, సెప్టెంబర్ 29: పిల్లల పార్కులు కేవలం వినోద కేంద్రాలే కాకుండా వారి వ్యక్తిత్వ వికాసానికి, సమగ్ర అభివృద్ధికి దోహదపడే నిర్మాణ శాలలని లక్ష్మీనగర్ పార్క్ అధ్యక్షుడు, అత్తాపూర్ యోగా కేంద్రం గురువు పి. లక్ష్మీ మహేందర్ అన్నారు. పిల్లలను ప్రకృతికి దగ్గర చేయడంతోపాటు వారిలో ఆత్మవిశ్వాసం, సృజనాత్మకత, సామాజిక స్పృహ పెంపొందించడంలో పార్కులు కీలక పాత్ర పోషిస్తాయని పేర్కొన్నారు. ప్రతి పట్టణం, గ్రామంలో సురక్షితమైన వసతులతో కూడిన బాలల పార్కులను ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందన్నారు. అత్తాపూర్‌లోని లక్ష్మీనగర్ పార్కులో జీహెచ్ఎంసీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేయనున్న బాలల ఆటస్థలానికి సంబంధించి సోమవారం పార్క్ అధ్యక్షుడు పి. లక్ష్మీ మహేందర్ అధ్యక్షతన సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన తెలంగాణ ఎకనామిక్ ఫోరం అధ్యక్షుడు, ప్రముఖ రచయిత నేదునూరి కనకయ్య మాట్లాడుతూ బాలల సర్వతోముఖాభివృద్ధిలో పార్కులు కీలక పాత్ర పోషిస్తాయని అన్నారు. ఆటలు కేవలం వినోదానికే పరిమితం కాకుండా పిల్లల్లో వ్యక్తిత్వ వికాసం, ఆత్మవిశ్వాసం, స్నేహభావం పెంపొందించేందుకు ఉపయోగపడతాయని తెలిపారు. జీహెచ్ఎంసీ ఆధ్వర్యంలో బాలల ఆట స్థలాన్ని ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. మాజీ సైనికుడు చల్ల వెంకటరెడ్డి మాట్లాడుతూ పార్కుల్లో ఆటల ద్వారా పిల్లలు ఐక్యత, ధైర్యం, సహనం, నాయకత్వ లక్షణాలను అలవర్చుకుంటారని చెప్పారు. వంతులవారీగా ఆడటం, తమ అవకాశం కోసం వేచి ఉండటం వంటి సామాజిక విలువలను సహజంగా నేర్చుకుంటారని పేర్కొన్నారు. లక్ష్మీ చంద్రారెడ్డి మాట్లాడుతూ ఇతర పిల్లలతో కలిసి ఆడుకోవడం ద్వారా చిన్నారుల్లో స్నేహసంబంధాలు పెంపొందుతాయని అన్నారు. బుచ్చయ్య మాట్లాడుతూ పార్కుల్లో ఆటలు పిల్లలకు మానసిక ఉల్లాసాన్ని అందిస్తాయని తెలిపారు. పంచాక్షరరావు మాట్లాడుతూ పచ్చని చెట్ల మధ్య స్వచ్ఛమైన గాలిలో ఆడుకోవడం వల్ల పిల్లల్లో మానసిక ప్రశాంతత, సృజనాత్మకత, ఆలోచనా శక్తి పెరుగుతాయని వివరించారు. ఎం. ప్రభాకర్ మాట్లాడుతూ ఇసుక, ఆటవస్తువులతో వివిధ ఆకృతులు రూపొందిస్తూ ఆడుకోవడం వల్ల పిల్లల్లో ఆసక్తి, సృజనాత్మకత పెరగడంతోపాటు శారీరక శ్రమ ద్వారా ఊబకాయం తగ్గుతుందని పేర్కొన్నారు. కాలనీవాసులు, తల్లిదండ్రులు జీహెచ్ఎంసీ ఏర్పాటు చేయనున్న బాలల పార్కును సద్వినియోగం చేసుకోవాలని వక్తలు పిలుపునిచ్చారు.

# నేడు బాలికల కోసం ప్రత్యేక జాబ్‌మేళా

## ఐఫోన్ తయారీ సంస్థలో 500 ఉద్యోగాల భర్తీ

## నెలకు రూ.20,733 వేతనం.. వసతి, భోజనం, రవాణా సౌకర్యాలు




మహబూబాబాద్, సెప్టెంబర్ 29: బాలికలకు ఉపాధి అవకాశాలు కల్పించే లక్ష్యంతో మహబూబాబాద్‌లోని నూకల రామచంద్రారెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాల (స్వయంప్రతిపత్తి) ఆధ్వర్యంలో బుధవారం ప్రత్యేక జాబ్‌మేళా నిర్వహించనున్నారు. సెప్టెంబర్ 30న ఉదయం 9 గంటల నుంచి కళాశాల ప్రాంగణంలో ఈ నియామక ప్రక్రియ ప్రారంభం కానుంది. హైదరాబాద్‌లోని ప్రముఖ ఐఫోన్ తయారీ సంస్థలో అసెంబ్లింగ్ ఆపరేటర్లుగా పనిచేసేందుకు 500 మంది బాలికలను ఎంపిక చేయనున్నారు. ఎంపికైన వారికి నెలకు రూ. 20,733 వేతనంతోపాటు నివాస వసతి, ఉచిత భోజనం, రవాణా సౌకర్యం, హాజరు ప్రోత్సాహకం, రాత్రి విధుల భత్యం, ఇతర చట్టబద్ధమైన ప్రయోజనాలు కల్పించనున్నారు. కొంగర కలాన్‌లోని సంస్థ ప్రాంగణంలో ఉద్యోగాలు చేయాల్సి ఉంటుంది. పదో తరగతి, ఇంటర్మీడియట్, ఏదైనా డిగ్రీ చదివిన బాలికలు ఈ జాబ్‌మేళాకు హాజరుకావచ్చు. ఉత్తీర్ణులైన వారితోపాటు పరీక్షల్లో తప్పిన అభ్యర్థులు కూడా సంస్థ నియామక నిబంధనలకు అనుగుణంగా పాల్గొనే అవకాశం ఉంది. ఆసక్తి గల అభ్యర్థులు పాస్‌పోర్టు సైజు ఫొటోలు, ఆధార్ కార్డు, పాన్ కార్డు, బ్యాంకు ఖాతా వివరాలు, విద్యార్హత ధ్రువపత్రాలను వెంట తీసుకురావాలని కళాశాల అధికారులు సూచించారు. ఎలక్ట్రానిక్స్ తయారీ రంగంలో ప్రత్యక్షంగా ఉద్యోగాలు పొందేందుకు ఈ జాబ్‌మేళా మంచి అవకాశమని కళాశాల ప్రిన్సిపాల్ నూకల రామచంద్రారెడ్డి తెలిపారు. అర్హత కలిగిన బాలికలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని పెద్ద సంఖ్యలో హాజరుకావాలని పిలుపునిచ్చారు. కళాశాల ప్లేస్‌మెంట్ సెల్, కెరీర్ గైడెన్స్ సెల్, తెలంగాణ నైపుణ్య శిక్షణ కేంద్రం సంయుక్తంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నాయి. మరిన్ని వివరాలకు ప్లేస్‌మెంట్ సెల్ సమన్వయకర్త డా. షేక్ ఖాసీం షా (83286 13258), కెరీర్ గైడెన్స్ సెల్ సమన్వయకర్త డా. బి.ఎం. వినోద్‌కుమార్ (9703332569), డా. వి. సాంబశివరావు (9440343941)లను సంప్రదించాలని ప్రిన్సిపాల్ ఒక ప్రకటనలో తెలిపారు.

## సూదనపల్లి గ్రామంలో తండ్రిని దారుణహత్య చేసిన కొడుకు





సీరోల్ / అరుణ ప్రభ : మహబూబాబాద్ జిల్లా సీరోల్ మండలంలో సూదనపల్లి చెందినటువంటి లకుమల్ల వెంకన్న తన భార్యను రోజు తాగి వచ్చి ఇబ్బందులకు గురిచేస్తుండగా అట్టి విషయాన్ని తల్లి తన కొడుకు అయినటువంటి లకుమల సునీల్ కు చెప్పగా తల్లి లేని సమయంలో కొడుకు ఇంటికి వచ్చి అమ్మను ఎందుకు ఇబ్బంది పెడుతున్నావని కర్రతో మరియు ట్యూబ్ లైట్ ఐరన్ ఫ్రేమ్ తో ఇష్టమున్నట్టు కొట్టి పారిపోగా అట్టి గాయాలకు తండ్రి మరణించినాడు,తల్లి వెంకటమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన మరిపెడ సీఐ పవన్ కుమార్ సీరోల్ ఎస్సై సంతోష్ కుమార్ దర్యాప్తు ప్రారంభించ నైనది.



## ఉగ్గంపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో రాష్ట్ర ప్రజారోగ్య వైద్య సంచాలకులు డాక్టర్ రవీంద్ర నాయక్ ఆకస్మిక తనిఖీ

అరుణప్రభ మహబూబాబాద్/ సెప్టెంబర్.29 : తెలంగాణ రాష్ట్ర ప్రజారోగ్య వైద్య సంచాలకులు డాక్టర్ రవీంద్ర నాయక్ హైదరాబాద్ గారు మహబూబాబాద్ జిల్లాలోని చిన్నగూడురు మండలం ఉగ్గంపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు ఈ సందర్భంగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలోని హాజరు పట్టిక, ల్యాబొరేటరీ సేవలు, రోగులకు అందుబాటులో ఉన్న మందుల నిల్వలు మరియు పంపిణీ వివరాలను పరిశీలించారు. అలాగే గర్భిణీ స్త్రీల నమోదు, ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రసవాల ప్రోత్సాహం, ప్రజలకు అందిస్తున్న వివిధ ఆరోగ్య సేవలపై సమీక్ష నిర్వహించారు అదేవిధంగా కేంద్ర ఆరోగ్య పథకాల అమలు, సీజనల్ వ్యాధుల నియంత్రణలో భాగంగా మలేరియా, డెంగ్యూ జ్వరాల నివారణ మరియు నియంత్రణ చర్యలపై అధికారులతో సమీక్షించారు జిల్లాలో అమలవుతున్న వివిధ ఆరోగ్య కార్యక్రమాలలో నిర్దేశించిన లక్ష్యాలను సాధిస్తూ మహబూబాబాద్ జిల్లా రాష్ట్రస్థాయిలో ముందంజలో ఉండేలా కృషి చేయాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ బి. రవి రాథోడ్ కి సూచనలు, సలహాలు అందించారు. ఈ తనిఖీ కార్యక్రమంలో ఉగ్గం పల్లి వైద్యాధికారి డాక్టర్ ప్రవీణ్,మరిపెడ వైద్యాధికారి డాక్టర్ రవి, వైద్య సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు



# ఎస్ఐఆర్ ఫేజ్-2లో బీఎల్ఓల పనితీరు పరిశీలన

## అర్హులందరికీ ఓటరు జాబితాలో చోటు కల్పించాలి: ఎర్ర వినోద్‌రెడ్డి

హైదరాబాద్: ఎస్ఐఆర్ ఫేజ్–2లో భాగంగా జీఎస్ఐ డివిజన్ పరిధిలోని 70 నుంచి 80, 113, 114, 65, 108, 106, 107 బూత్‌లను బీజేపీ జీఎస్ఐ డివిజన్ అధ్యక్షుడు ఎర్ర వినోద్‌రెడ్డి సందర్శించి, బీఎల్ఓల పనితీరును పర్యవేక్షించారు. బీఎల్ఓలకు అందిన ఎస్ఐఆర్ నోటీసులను అర్హులైన ఓటర్లకు ఇంటింటికీ వెళ్లి అందజేయాలని సూచించారు. ఓటర్లకు ప్రక్రియపై అవగాహన కల్పించి, అవసరమైన పత్రాలు సేకరించి నమోదు పూర్తయ్యేలా సహకరించాలని తెలిపారు. ఓటరు జాబితాలో తమ పేరు, వివరాలను పరిశీలించుకోవాలని ప్రజలకు సూచించారు. అర్హులైన ప్రతి ఒక్కరి పేరు జాబితాలో ఉండాలని, ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు కీలకమని ఎర్ర వినోద్‌రెడ్డి పేర్కొన్నారు. ఎస్ఐఆర్ ప్రక్రియలో బీఎల్ఓలకు ప్రజలు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీజేపీ డివిజన్ కార్యదర్శి గోపాల్ శర్మ, రంగారెడ్డి జిల్లా కౌన్సిల్ సభ్యుడు సంజీవరెడ్డి, రాజు గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

అరుణ ప్రభ
ARUNAPRABHA TELUGU DAILY
బుధవారం, సెప్టెంబరు 30, 2026

# హిందూ దేవుళ్ళపై అవమానకర వ్యాఖ్యలకు నిరసన తెలిపిన బిజెపి నాయకులు

ఎల్ బి నగర్' సెప్టెంబర్ 30(అరణ ప్రభ): హిందూ దేవతలపై తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేసినట్లు ప్రచారంలో ఉన్న వ్యాఖ్యలను నిరసిస్తూ, బైరామల్‌గూడ డివిజన్ బీజేపీ అధ్యక్షులు ఎరుకల మల్లేష్ గౌడ్ ఆధ్వర్యంలో జెడ్పీ రోడ్డు ఆర్ఎస్ఎస్ జంక్షన్ వద్ద నిరసన కార్యక్రమం నిర్వహించి, రేవంత్ రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా బీజేపీ నాయకులు మాట్లాడుతూ, శ్రీరాముడు ఉత్తర భారతదేశానికి, పరమశివుడు దక్షిణ భారతదేశానికి చెందిన దేవుళ్లు అన్నట్టుగా మాట్లాడటం హిందూ సమాజాన్ని విభజించే విధంగా ఉందని విమర్శించారు. భద్రాచలం శ్రీ సీతారామచంద్ర స్వామి ఆలయం, తిరుపతి శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయం వంటి ప్రముఖ పుణ్యక్షేత్రాలు దేశవ్యాప్తంగా హిందూ భక్తికి ప్రతీకలని పేర్కొన్నారు. అలాగే దేశంలోని వివిధ ప్రాంతాల్లో ఉన్న 12 జ్యోతిర్లింగాలు భారతదేశ ఆధ్యాత్మిక ఐక్యతకు ప్రతీకలని అన్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ "జై శ్రీరామ్"తో పాటు "హర హర మహాదేవ్" అంటూ దేశంలోని అన్ని ప్రాంతాల ఆధ్యాత్మిక సంప్రదాయాలకు గౌరవం చూపుతున్నారని నాయకులు పేర్కొన్నారు. హిందూ దేవతలు, విశ్వాసాలను కించపరిచేలా వ్యాఖ్యలు చేయడం సరికాదని, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తన వ్యాఖ్యలపై హిందూ సమాజానికి క్షమాపణ చెప్పాలని బీజేపీ నాయకులు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో డివిజన్ జనరల్ సెక్రెటరీలు అమర్‌నాథ్ రెడ్డి, గౌని వెంకటేష్ గౌడ్, ఉపాధ్యక్షులు కంది శ్రీనివాస్ రెడ్డి, రంగారెడ్డి జిల్లా ఓబీసీ ఎగ్జిక్యూటివ్ మెంబెర్ బూరం ప్రకాష్, మహేందర్ రెడ్డి, సెక్రెటరీ గోవర్ధన్ యాదవ్, యువ మోర్చా డివిజన్ అధ్యక్షుడు మల్లేష్ యాదవ్, నవనీత్, లక్ష్మీకాంత్ రెడ్డి, అనిల్ కుమార్ గౌడ్, మోహన్ రెడ్డి, పాపారెడ్డి, సాయి యాదవ్ తదితరులు పాల్గొన్నారు .



# బహదూర్‌గూడ రైతులను ఆదుకుంటాం

## భూమి కోల్పోతున్న ప్రతి రైతుకు 600 గజాల స్థలం కేటాయిస్తాం

## రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్



అరుణ ప్రభ, శంషాబాద్, సెప్టెంబర్ 29: శంషాబాద్ మండలం బహదూర్‌గూడలో భూములు కోల్పోతున్న రైతులను అన్ని విధాలా ఆదుకుంటామని రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి. ప్రకాష్ గౌడ్ తెలిపారు. భూమి కోల్పోతున్న ప్రతి రైతుకు 600 గజాల స్థలం కేటాయిస్తామని ఆయన ప్రకటించారు. సోమవారం శంషాబాద్ పట్టణంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ మాట్లాడుతూ.. శంషాబాద్ ప్రాంతంలోని భూ సమస్యలను గత ప్రభుత్వ దృష్టికి తీసుకురాలేదంటూ బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ చేసిన వ్యాఖ్యలను ఖండించారు. భూ సమస్యల పరిష్కారం కోసం 2017 నుంచి అసెంబ్లీలో పలుమార్లు ప్రస్తావించడంతో పాటు, 2020, 2022, 2023 సంవత్సరాల్లో అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్, కేటీఆర్‌తో పాటు సంబంధిత అధికారులకు వినతిపత్రాలు అందజేసినట్లు తెలిపారు. 2022 డిసెంబర్ 22న జరిగిన బహిరంగ సభలోనూ బహదూర్‌గూడ భూ సమస్యను కేసీఆర్ దృష్టికి తీసుకెళ్లాలని కోరినట్లు ప్రకాష్ గౌడ్ పేర్కొన్నారు. వాస్తవాలను తెలుసుకుని మాట్లాడాలని, ఆధారాలు లేకుండా ఆరోపణలు చేయడం సరికాదని కేటీఆర్‌ను ఉద్దేశించి అన్నారు. వైఎస్సార్ ప్రభుత్వం హయాం నుంచి నేటి వరకు భూ సమస్యల పరిష్కారం కోసం తాను పోరాడుతున్నానని ఎమ్మెల్యే తెలిపారు. బహదూర్‌గూడలో భూములు కోల్పోతున్న రైతుల ప్రయోజనాలను కాపాడేందుకు చర్యలు తీసుకుంటామని, ప్రతి బాధిత రైతుకు 600 గజాల స్థలం కేటాయించేలా కృషి చేస్తామని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో సీనియర్ నాయకులు గణేష్ గుప్తా, వెంకటేష్ గౌడ్, చంద్రారెడ్డి, మహేందర్ రెడ్డి, రాజు ముదిరాజ్, మండల పార్టీ అధ్యక్షుడు మహేందర్, సర్పంచుల సంఘం అధ్యక్షుడు కోటేష్ గౌడ్, రవి నాయక్, సత్యనారాయణ గౌడ్, ప్రభు సాగర్, ప్రభాకర్, లింగం, సిద్ధేశ్వర్, దవణాకర్ గౌడ్, బొబ్బిలి శేఖర్, గోపాల్, అశోక్, బాలు, రాజ్‌కుమార్, శ్రీకాంత్, మల్లేష్, సాయి ముదిరాజ్, ఉమా తదితరులు, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.కావాలంటే ఇదే విషయాన్ని "ఆంధ్రప్రభ" పేపర్ స్టైల్‌లో మరింత కచ్చితమైన హెడ్‌లైన్, సబ్‌హెడ్‌లతో కూడా తయారు చేయగలను.

# రిటైర్‌మెంట్ అనేది వయస్సుకు మాత్రమే... ప్రజాసేవకు కాదు

## ఉద్యోగ విరమణ అనంతరం శేష జీవితం సుఖంగా ఉండాలి

## వైద్య ఆరోగ్య సంచాలకులు డా. రవీంద్ర నాయక్



అరుణప్రభ 29 సెప్టెంబర్ మహబూబాబాద్ అర్బన్ : మహబూబాబాద్ జిల్లాలోని తొర్రూరు డివిజన్‌లో వైద్య ఆరోగ్య శాఖ డిప్యూటీ డి ఎమ్ హెచ్ ఓ గా విధులు నిర్వహించిన డా. సుదీర్ రెడ్డి పదవీ విరమణ కార్యక్రమాన్ని మానుకోట పట్టణ కేంద్రంలోని స్థానిక ఎస్వీఎం కన్వెన్షన్ హాల్లో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా తెలంగాణ వైద్య ఆరోగ్య సంచాలకులు డా. రవీంద్ర నాయక్ పాల్గొన్నారు ఈ సందర్భంగా డా. రవీంద్ర నాయక్ మాట్లాడుతూ, "రిటైర్‌మెంట్ అనేది వయస్సుకు మాత్రమే... ప్రజాసేవకు కాదు" అని అన్నారు. ప్రభుత్వ వైద్య ఆరోగ్య శాఖలో సుదీర్ఘకాలం సేవలందించిన డా. సుదీర్ రెడ్డి తన విధి నిర్వహణలో నిబద్ధత, అంకితభావం, సేవా దృక్పథంతో పనిచేశారని కొనియాడారు. ఉద్యోగ బాధ్యతల నుంచి పదవీ విరమణ పొందినప్పటికీ ప్రజల పట్ల ఉన్న సేవా భావం, మానవీయత ఎప్పటికీ కొనసాగుతాయని అన్నారు డా. సుదీర్ రెడ్డితో తనకు ఉన్న సుదీర్ఘకాల స్నేహాన్ని, ఆత్మీయ అనుబంధాన్ని డా. రవీంద్ర నాయక్ ఈ సందర్భంగా గుర్తు చేసుకున్నారు. కలిసి పనిచేసిన రోజుల్లో ఆయనతో ఉన్న అనుభవాలను ప్రస్తావిస్తూ, వృత్తిపరంగా నిబద్ధతతో పనిచేసే వ్యక్తిగా సుదీర్ రెడ్డి తనకు ఎప్పటికీ ఆత్మీయుడని పేర్కొన్నారు. పదవీ విరమణ అనంతరం ఆయన కుటుంబ సభ్యులతో ఆరోగ్యంగా, ఆనందంగా గడపాలని ఆకాంక్షించారు మహబూబాబాద్ జిల్లాలో పూర్వపు డి ఎమ్ హెచ్ ఓ గా పనిచేసి పదవీ విరమణ పొందిన డా. మురళీధర్ మాట్లాడుతూ, డా. సుదీర్ రెడ్డితో కలిసి పనిచేసిన అనుభవాలను గుర్తు చేసుకున్నారు. వైద్య ఆరోగ్య శాఖలో ఆయన అందించిన సేవలను కొనియాడుతూ, తన విధులను బాధ్యతాయుతంగా నిర్వహించారని అన్నారు. సహచర వైద్యులు, సిబ్బందితో సత్సంబంధాలు కొనసాగిస్తూ శాఖకు, ప్రజలకు సేవలందించారని పేర్కొన్నారు మహబూబాబాద్ ప్రస్తుత డి ఎమ్ హెచ్ ఓ డా. రవి రాథోడ్ మాట్లాడుతూ, డా. సుదీర్ రెడ్డి సుదీర్ఘకాలం వైద్య ఆరోగ్య శాఖలో సేవలందిస్తూ తనకు అప్పగించిన బాధ్యతలను నిబద్ధతతో నిర్వర్తించారని అన్నారు. ప్రజలకు వైద్య సేవలు అందించడంలో, శాఖాపరమైన కార్యక్రమాల అమలులో ఆయన అందించిన సహకారం అభినందనీయమని పేర్కొన్నారు. ఆయన సేవలు, అనుభవం, సహచరులతో ఉన్న అనుబంధాన్ని ఈ సందర్భంగా గుర్తు చేసుకున్నారు. పదవీ విరమణ అనంతరం ఆయన జీవితం సంతోషంగా, ఆరోగ్యంగా సాగాలని ఆకాంక్షించారు అనంతరం డా. సుదీర్ రెడ్డిని ఘనంగా సన్మానించి, శాలువాతో సత్కరించి, జ్ఞాపికను అందజేశారు. పలువురు వైద్యాధికారులు, వైద్య సిబ్బంది ఆయనతో తమకున్న అనుబంధాన్ని, ఆయన అందించిన సేవలను గుర్తు చేసుకుంటూ శుభాకాంక్షలు తెలిపారు ఈ కార్యక్రమంలో గతంలో డి ఎమ్ హెచ్ ఓ గా పనిచేసి ఉద్యోగ విరమణ పొందిన డాక్టర్ అంబరీష, ప్రోగ్రామ్ ఆఫీసర్లు డా. నాగేశ్వరరావు, డాక్టర్ ప్రమీల, డాక్టర్ శ్రవణ్, డా రాజ్ కుమార్,డా అన్వేష్,జిల్లాలో పనిచేస్తున్న పలువురు మెడికల్ ఆఫీసర్లు, వడ్డెబోయిన శ్రీనివాస్, ప్రసాద్, బొబ్బిలిశెట్టి రామకృష్ణ,రాజు, వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



## భూముల అవకతవకలపై కమిటీ సభ్యుడు సందీప్ కుమార్ ఝా సమీక్ష

ఎల్లారెడ్డిపేట అరుణప్రభ : రాజన్న సిరిసిల్ల, సెప్టెంబర్ 29: రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన ఆదేశాల మేరకు భూముల అవకతవకలపై నియమించిన కమిటీ సభ్యుడు, జనగామ జిల్లా కలెక్టర్ ఐఏఎస్ సందీప్ కుమార్ ఝా మంగళవారం రాజన్న సిరిసిల్ల జిల్లాలో సమీక్ష నిర్వహించారు. జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్‌తో పాటు జిల్లాలోని తహసీల్దార్లతో సమావేశమై భూములకు సంబంధించిన అంశాలపై సమగ్రంగా సమీక్షించారు. రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన జీవో నంబర్ 134కు అనుగుణంగా జిల్లాలో భూములకు సంబంధించిన రికార్డులు, అవకతవకలు, వివాదాస్పద అంశాలు తదితర విషయాలపై అధికారుల నుంచి వివరాలు తెలుసుకున్నారు. భూముల విషయంలో ఏవైనా అక్రమాలు, అవకతవకలు గుర్తించినట్లయితే వాటిపై నిబంధనల ప్రకారం తీసుకోవాల్సిన చర్యలపై అధికారులకు పలు సూచనలు చేశారు. భూముల వ్యవహారాల్లో పారదర్శకతకు ప్రాధాన్యం ఇవ్వాలని, ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా రికార్డులను పరిశీలించి అవసరమైన చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించినట్లు తెలిసింది. సమావేశంలో రెవెన్యూ శాఖకు చెందిన అధికారులు, తహసీల్దార్లు తదితరులు పాల్గొన్నారు.



## కన్నీళ్లలో ఉన్న కుటుంబానికి కొండంత అండగా భవన నిర్మాణ కార్మికుల సంఘం

గజ్వేల్ అరుణ ప్రభ : జగదేవపూర్, రెక్కాడితే గానీ డొక్కాడని భవన నిర్మాణ కార్మికులు మానవత్వాన్ని చాటుకున్నారు. అప్పుల బాధతో వారం రోజుల క్రితం ఆత్మహత్యకు పాల్పడిన పలుగుగడ్డ గ్రామానికి చెందిన లోకుల సాయిరాం (29) కుటుంబానికి తోటి కార్మికులు అండగా నిలిచారు. భవన నిర్మాణ కార్మికుల సంఘం అధ్యక్షుడు లింగాల కనకయ్య ఆధ్వర్యంలో మంగళవారం సంఘం సభ్యులు సాయిరాం కుటుంబాన్ని పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. అనంతరం బాధిత కుటుంబానికి రూ.20,000 నగదు ఆర్థిక సాయం అందజేసి నైతిక భరోసా కల్పించారు. ఈ సందర్భంగా సంఘం ప్రతినిధులు మాట్లాడుతూ, "కష్టం వచ్చినప్పుడు ప్రాణాలు తీసుకోవడం పరిష్కారం కాదు. తోటి కార్మికులంతా ఒకే కుటుంబంలా ఉంటాం. ఎలాంటి సమస్య వచ్చినా కలిసి ఎదుర్కొంటాం. ఎవరూ ఇలాంటి తీవ్ర నిర్ణయాలు తీసుకోవద్దు" అని అన్నారు. ప్రాణం కంటే ఏ సమస్యా పెద్దది కాదని, కష్టాల్లో ఉన్న వారికి అండగా నిలవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ నర్ర కనకయ్య, మాజీ సర్పంచ్ రాజేశ్వరి రవి, భవన నిర్మాణ కార్మికుల సంఘం నాయకులు, కార్మికులు పిట్టల ఎల్లేష్, కనకయ్య, నర్సింలు, రామచంద్రం, లక్ష్మణ్, కృష్ణ, జహంగీర్, వెంకటేష్, నరేష్, శ్రీను, స్వామి తదితరులు పాల్గొన్నారు.



## లయన్ సంజయ్ గుప్తా ఆధ్వర్యంలో అల్పాహారం పంపిణీ

## ఆర్యవైశ్యుల సేవలు అభినందనీయం: చిట్కుల శివారెడ్డి

గజ్వేల్ అరుణ ప్రభ : సిద్దిపేట జిల్లా గజ్వేల్ ఇందిరాపార్క్ చౌరస్తా వద్ద మంగళవారం లయన్స్ క్లబ్ మా రీజియన్ మాజీ చైర్మన్ సంజయ్ గుప్తా వారి కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో ఉచిత అల్పాహారం కార్యక్రమం నిర్వహించారు, ఈ కార్యక్రమంలో పాల్గొన్న కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు చిట్కుల శివారెడ్డి మాట్లాడుతూ, ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమాలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ పలువురికి ఆదర్శంగా నిలుస్తున్నారని అన్నారు, అనంతరం కొమురవెల్లి ఆలయ డైరెక్టర్ నంగునూరు సత్యనారాయణ మాట్లాడుతూ పితృపక్షాల సందర్భంగా పక్షం రోజులు దాతల సహకారంతో అల్పాహార కార్యక్రమం, అన్నదాన కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని, పితృపక్షాల రోజుల్లో దానధర్మాలు చేస్తే మోక్షం లభిస్తుందని పురాణాలు చెబుతున్నాయని అన్నారు, ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య సీనియర్ నాయకులు తోట బిక్షపతి, ఆదిమూలం నారాయణ, దూబకుంట లక్ష్మణ్, సంజయ్ గుప్తా కుటుంబ సభ్యులు, ఆర్యవైశ్య నాయకులు తదితరులు పాల్గొన్నారు.



## దళిత జర్నలిస్టుల ఫోరం రాష్ట్ర మహాసభలు విజయవంతం చేయాలి

అరుణ ప్రభ ,డిండి, సెప్టెంబర్ 29,సంగారెడ్డి జిల్లా కేంద్రంలో అక్టోబర్ 7న నిర్వహించబడే దళిత జర్నలిస్టుల ఫోరం రాష్ట్ర మహాసభలు విజయవంతం చేయాలని దేవరకొండ డివిజన్ జర్నలిస్టుల ఫోరం అధ్యక్షులు ముడి లింగమయ్య పిలుపునిచ్చారు.మంగళవారం దిండి ఎంపీడీవో వేజన్న, ఎస్సై బాలకృష్ణ చేతుల మీదుగా వాల్ పోస్టర్లు ఆవిష్కరించారు .ఈ సందర్భంగా లింగమయ్య మాట్లాడుతూ, దళిత జర్నలిస్టులకు ప్రభుత్వం నుండి రావాల్సిన న్యాయపరమైన హక్కులు, డిమాండ్ల సాధన కోసం దళిత జర్నలిస్టుల ఫోరం పనిచేస్తుందని తెలియజేశారు .ఈ కార్యక్రమంలో విశ్వంభర జర్నలిస్టు మల్లేష్, సూర్యుడు జర్నలిస్టు గుమ్మకొండ సుధాకర్, నీలగిరి జర్నలిస్టు చెన్నయ్య, నవభారత్ జర్నలిస్టు ముడి శ్రీను, మరియు ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షులు త్రినేత్రం జర్నలిస్టు జాంగిర్, ఎమ్మార్పీఎస్ మండల ఉపాధ్యక్షులు తదితరులు పాల్గొన్నారు.

## అక్రమ ఇసుక రవాణాకు యత్నం.. నలుగురిపై కేసు



ఎల్లారెడ్డిపేట అరుణప్రభ : ఎల్లారెడ్డిపేట మండలంలోని పదిరే మానేరు వాగు నుంచి ఎలాంటి అనుమతులు లేకుండా రాత్రి సమయంలో అక్రమంగా ఇసుకను తరలించేందుకు ప్రయత్నించిన నలుగురు వ్యక్తులపై పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులను గమనించిన నిందితులు అక్కడి నుంచి పరారైనట్లు ఎస్సై ఎన్. రమేష్ తెలిపారు. పోలీసుల వివరాల ప్రకారం.. పదిరే మానేరు వాగు నుంచి అక్రమంగా ఇసుకను తరలించేందుకు కొందరు వ్యక్తులు ప్రయత్నిస్తున్నారన్న సమాచారంతో పోలీసులు అక్కడికి చేరుకున్నారు. పోలీసులను చూసిన వెంటనే పదిర గ్రామానికి చెందిన సుధాకర్, తిరుపతి, రాజన్నపేటకు చెందిన నర్సింలు, బొప్పాపూర్‌కు చెందిన కుమార్ అక్కడి నుంచి పరారైనట్లు తెలిపారు. అనుమతులు లేకుండా ఇసుక తరలించేందుకు ప్రయత్నించిన ఘటనపై నలుగురిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎల్లారెడ్డిపేట ఎస్సై ఎన్. రమేష్ వెల్లడించారు. అక్రమ ఇసుక రవాణాకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని పోలీసులు హెచ్చరించారు.



# సీఎం సభకు భారీగా తరలిరావాలి

## కార్యకర్తల సన్నాహక సమావేశంలో యువ నాయకుడు గుర్రాల రాజిరెడ్డి

ఎల్లారెడ్డిపేట అరుణప్రభ: రేపు సిరిసిల్లలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పాల్గొననున్న భారీ బహిరంగ సభను విజయవంతం చేయడానికి కాంగ్రెస్ శ్రేణులు పెద్ద సంఖ్యలో తరలిరావాలని కాంగ్రెస్ యువ నాయకుడు గుర్రాల రాజిరెడ్డి పిలుపునిచ్చారు.ముఖ్యమంత్రి పర్యటన నేపథ్యంలో నిర్వహించిన కాంగ్రెస్ కార్యకర్తల సన్నాహక సమావేశంలో ఆయన కార్యకర్తలను ఉద్దేశించి మాట్లాడారు. సభను విజయవంతం చేసేందుకు ప్రతి కార్యకర్త సమన్వయంతో పనిచేయాలని, ప్రజలు, కాంగ్రెస్ శ్రేణులు అధిక సంఖ్యలో సభకు హాజరయ్యేలా కృషి చేయాలని కోరారు. సీఎం రేవంత్‌రెడ్డి సిరిసిల్ల పర్యటన సందర్భంగా నిర్వహించే భారీ బహిరంగ సభకు నియోజకవర్గంలోని కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద ఎత్తున తరలివచ్చి సభను విజయవంతం చేయాలని గుర్రాల రాజిరెడ్డి విజ్ఞప్తి చేశారు.

# నిరుపేద విద్యార్థుల బంగారు భవిష్యత్‌కు బాటలు వేస్తున్న ఇంటెలెక్ట్ డిజైన్ అరేనా

## 16 ప్రభుత్వ పాఠశాలల 155 మంది మెరిట్ విద్యార్థులకు 1.55 లక్షల రూపాయల స్కాలర్‌షిప్‌లు



సెప్టెంబర్ 29, అరుణప్రభ : ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న ప్రతిభావంతులైన విద్యార్థులను ప్రోత్సహించేందుకు ఇంటెలెక్ట్ డిజైన్ అరేనా సంస్థ తన సి ఎస్ ఆర్ కార్యక్రమంలో భాగంగా వరంగల్, హన్మకొండ, కాజీపేట్ ప్రాంతాల్లోని 16 ప్రభుత్వ పాఠశాలలకు చెందిన 9వ, 10వ తరగతి మెరిట్ విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు అందించింది. మొత్తం 155 మంది విద్యార్థులకు 1,55,000 /- రూపాయల స్కాలర్‌షిప్‌లు అందజేశారు. ఈ కార్యక్రమాన్ని నరేంద్రనగర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో, అలాగే కాజీపేట్ గర్ల్స్ హైస్కూల్‌లో నిర్వహించారు. ఇంటెలెక్ట్ డిజైన్ అరేనా సంస్థ గత 15 సంవత్సరాలుగా వరంగల్ ప్రాంతంలోని విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు అందిస్తూ విద్యాభివృద్ధికి తన వంతు సహకారం అందిస్తోంది. ఆర్థికంగా వెనుకబడి చదువులో ప్రతిభ కనబరుస్తున్న విద్యార్థులను ఉన్నత విద్య వైపు ప్రోత్సహించడం ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశం. ఈ కార్యక్రమంలో ఇంటెలెక్ట్ డిజైన్ అరేనాలో సుమారు 25 సంవత్సరాలుగా పనిచేస్తున్న సతీష్ కుమార్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. వరంగల్‌కు చెందిన సతీష్ కుమార్ చిన్ననాట దేశాయిపేట పాఠశాలలో విద్యాభ్యాసం చేశారు. తన స్వస్థల ప్రాంతంలోని విద్యార్థులకు సంస్థ ద్వారా సహాయం అందించడం పట్ల ఆయన సంతోషం వ్యక్తం చేశారు. సతీష్ కుమార్‌తో పాటు ఆయన సహోద్యోగులు సూర్య, బాలకృష్ణ విద్యార్థులతో నిర్వహించిన వర్క్‌షాప్‌లో పాల్గొని వారిని ప్రోత్సహించారు. జీవితంలో లక్ష్యాలను నిర్దేశించుకోవడం, క్రమశిక్షణతో చదువుకోవడం, పట్టుదలతో ముందుకు సాగడం, భవిష్యత్తులో ఉన్నత విజయాలు సాధించేందుకు అవసరమైన నైపుణ్యాలను పెంపొందించుకోవడం వంటి అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమం విజయవంతంగా నిర్వహించేందుకు ఎంఈఓ వెంకటేశ్వరరావు సహకారం అందించారు. పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు కార్యక్రమంలో పాల్గొన్నారు. స్కాలర్‌షిప్‌లు అందుకున్న విద్యార్థులు ఇంటెలెక్ట్ డిజైన్ అరేనా సంస్థకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. తమ చదువులో మరింత కష్టపడి ఉన్నత లక్ష్యాలను సాధిస్తామని విద్యార్థులు తెలిపారు. ప్రతిభావంతులైన విద్యార్థులకు ఆర్థిక సహాయం అందించడంతో పాటు, వారికి మార్గదర్శకత్వం మరియు ప్రేరణ అందిస్తున్న ఇంటెలెక్ట్ డిజైన్ అరేనా సి ఎస్ ఆర్ కార్యక్రమం నిరుపేద విద్యార్థుల బంగారు భవిష్యత్తు బాటలు వేస్తుంది.

# గురుకులాల్లో విద్యార్థినుల భద్రతకు భరోసా ఏదీ?

## చర్లపటేల్‌గూడ గురుకుల క్యాంపస్‌లో లైంగిక వేధింపుల ఆరోపణలపై బీఆర్ఎస్ నేతల పరిశీలన

### ఫిర్యాదులపై అధికారులు స్పందించలేదంటూ సబితా ఇంద్రారెడ్డి, మంచిరెడ్డి కిషన్‌రెడ్డి ఆగ్రహం



ఇబ్రహీంపట్నం: చర్లపటేల్‌గూడలోని బీసీ, మైనారిటీ గురుకుల క్యాంపస్‌లో విద్యార్థులు, మహిళా సిబ్బంది భద్రతకు సంబంధించిన ఫిర్యాదులు, డేటా ఎంట్రీ ఆపరేటర్‌పై వచ్చిన లైంగిక వేధింపుల ఆరోపణల నేపథ్యంలో మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి, బీఆర్ఎస్ రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు మంచిరెడ్డి కిషన్‌రెడ్డి క్యాంపస్‌ను సందర్శించారు. విద్యార్థులు, ఉపాధ్యాయులు, ప్రిన్సిపల్ శ్రీలతతో మాట్లాడి సమస్యలు, ఫిర్యాదుల వివరాలను తెలుసుకున్నారు. విద్యార్థులు, సిబ్బంది నుంచి పలుమార్లు ఫిర్యాదులు అందినా సంబంధిత అధికారులు స్పందించకపోవడం ఆందోళనకరమని వారు పేర్కొన్నారు. గురుకులాల్లో విద్యార్థులకు సురక్షిత వాతావరణం కల్పించడం ప్రభుత్వ బాధ్యత అని, బాలికల భద్రత విషయంలో నిర్లక్ష్యం తగదని స్పష్టం చేశారు. డేటా ఎంట్రీ ఆపరేటర్‌పై వచ్చిన ఆరోపణలపై నిష్పక్షపాతంగా విచారణ జరిపించి, అవి నిజమని తేలితే చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. మహిళల కోసం నిర్వహిస్తున్న క్యాంపస్‌లో పురుష సిబ్బంది నియామకం, వారి విధులు, పర్యవేక్షణకు సంబంధించిన నిబంధనలపై అధికారులు స్పష్టత ఇవ్వాలని కోరారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఈ ఘటనపై స్పందించి సమగ్ర నివేదిక తెప్పించుకోవాలని, గురుకుల విద్యాసంస్థల్లో విద్యార్థుల భద్రతకు తక్షణ చర్యలు చేపట్టాలని సబితా ఇంద్రారెడ్డి, మంచిరెడ్డి కిషన్‌రెడ్డి డిమాండ్ చేశారు.

## ముక్క మౌనిక మృతికి టిఆర్ఎస్ నాయకుల నివాళి



ఎల్లారెడ్డిపేట అరుణప్రభ: ఎల్లారెడ్డిపేట మండలం రాజన్నపేట గ్రామ మాజీ సర్పంచ్ ముక్క శంకర్ సతీమణి ముక్క మౌనిక సోమవారం రాత్రి అనారోగ్యంతో మృతి చెందారు. ఆమె మృతి పట్ల టిఆర్ఎస్ నాయకులు తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు. మంగళవారం మౌనిక నివాసానికి చేరుకున్న టీఆర్ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జి మజీద్, యువజన నియోజకవర్గ ఇన్‌చార్జి జావేద్, ఎల్లారెడ్డిపేట మండల ఇన్‌చార్జి కదిరి భాస్కర్, ముస్తాబాద్ మండల ఇన్‌చార్జి మార్వాడి దేవరాజు తదితరులు మౌనిక చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం మాజీ సర్పంచ్ ముక్క శంకర్‌తో పాటు కుటుంబ సభ్యులను పరామర్శించి, మౌనిక మృతికి సానుభూతి తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల నాయకులు అల్లే శంకర్, బొమ్మన వేణి, పరుశరాములు, బైరి రాజేష్, పొందుర్తి ఉమేష్, హరారే సిద్ధూ తదితరులు పాల్గొన్నారు.



## మీర్‌పేట్‌లో ఘోర రోడ్డు ప్రమాదం

### ట్రాక్టర్ టైర్లు ఎక్కడంతో స్కూటీపై వెళ్తున్న మహిళ మృతి

మహేశ్వరం: మీర్‌పేట్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని అల్మాస్‌గూడ--బడంగ్‌పేట్ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో నాదర్‌గుల్‌కు చెందిన ఏనుగు ప్రసన్నలక్ష్మి మృతి చెందారు. స్కూటీపై వెళ్తున్న ఆమెకు ఎదురుగా ఆటో రావడంతో ఒక్కసారిగా బ్రేక్ వేయగా అదుపుతప్పి కిందపడిపోయారు. అదే సమయంలో వెనుక నుంచి వచ్చిన ట్రాక్టర్ ఆమెపై నుంచి వెళ్లడంతో తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతి చెందినట్లు సమాచారం. ఘటనాస్థలికి చేరుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టారు.



## సిరిసిల్లకు మంత్రి శ్రీధర్ బాబు.

### సీఎం సభ ఏర్పాట్లపై ఆరా..

### జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు మంజూరు చేయాలని వినతి

ఎల్లారెడ్డి పేట అరుణప్రభ, సెప్టెంబర్ 29, ఎల్లారెడ్డిపేట అరుణప్రభ: రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బుధవారం సిరిసిల్లలో పాల్గొననున్న భారీ బహిరంగ సభ ఏర్పాట్లను పరిశీలించేందుకు రాష్ట్ర మంత్రి డి.శ్రీధర్ బాబు మంగళవారం సిరిసిల్లకు చేరుకున్నారు. ఈ సందర్భంగా సభ ఏర్పాట్లు, కాంగ్రెస్ పార్టీ శ్రేణుల సమీకరణ తదితర అంశాలపై ఆరా తీశారు. అనంతరం జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో పార్టీ శ్రేణులు, నాయకులతో మంత్రి శ్రీధర్ బాబు సమావేశమై సభ విజయవంతానికి తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు. మాజీ ఎమ్మెల్యే మృత్యుంజయం, జిల్లా కాంగ్రెస్ పార్టీ నాయకులతో ముచ్చటించిన మంత్రి.. సభకు పెద్ద ఎత్తున ప్రజలు, పార్టీ కార్యకర్తలు తరలివచ్చేలా అవసరమైన సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఎల్లారెడ్డిపేట ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు బుగ్గ కృష్ణమూర్తి, గౌరవ అధ్యక్షుడు బండారి బాల్ రెడ్డి, ఉపాధ్యక్షుడు పెంటం శ్రీనివాస్ మంత్రి డి.శ్రీధర్ బాబును మర్యాదపూర్వకంగా కలిసి జర్నలిస్టుల సమస్యలను వివరించారు. ఎల్లారెడ్డిపేట మండలంలో పనిచేస్తున్న జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు మంజూరు చేయించాలని మంత్రిని కోరుతూ వినతిపత్రం సమర్పించారు. జర్నలిస్టుల ఇళ్ల స్థలాల సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి తగిన విధంగా పరిష్కరించాలని వారు మంత్రి శ్రీధర్ బాబును కోరారు.



## 98 పాఠశాలల్లో యాజమాన్య కమిటీల ఎంపిక

### ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా సజావుగా ప్రక్రియ

ధర్మవరం, సెప్టెంబరు 29; (అరుణ ప్రభ న్యూస్) : ప్రభుత్వ ఆదేశాల మేరకు ధర్మవరం పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లోని 98 ప్రభుత్వ పాఠశాలల్లో పాఠశాల యాజమాన్య కమిటీ వేడుకలు సజావుగా నిర్వహించినట్లు మండల విద్యాశాఖ అధికారులు రాజేశ్వరి దేవి, గోపాల్ నాయక్ తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పాఠశాల యాజమాన్య కమిటీల్లో 75 శాతం మంది విద్యార్థుల తల్లిదండ్రులను, 25 శాతం మంది ఎక్స్‌అఫీషియో సభ్యులను నిబంధనల మేరకు ఎంపిక చేసినట్లు తెలిపారు. ఉపాధ్యాయులు, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు, సచివాలయ ఉద్యోగులు, పూర్వ విద్యార్థులు తదితరులు కమిటీల ఏర్పాటులో భాగస్వాములయ్యారని పేర్కొన్నారు. పాఠశాల యాజమాన్య కమిటీల ఎంపిక ప్రక్రియలో ఎక్కడా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా ఉపాధ్యాయ బృందాలు సహకరించాయని అధికారులు తెలిపారు. ప్రక్రియ విజయవంతంగా పూర్తయ్యేందుకు సహకరించిన ఉపాధ్యాయులు, సిబ్బందికి వారు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.



## చిన్నారిని ఆశీర్వదించిన దేవరకొండ మాజీ శాసనసభ్యులు రమావత్ రవీంద్ర కుమార్

అరుణ ప్రభ దేవరకొండ డివిజన్ సెప్టెంబర్ 29 : నల్గొండ జిల్లా దేవరకొండ నియోజకవర్గం లోని మాల్ పట్టణంలో జరిగిన మహీరా పుట్టినరోజు వేడుకల్లో దేవరకొండ మాజీ శాసనసభ్యులు రమావత్ రవీంద్ర కుమార్ పాల్గొని చిన్నారి మహీరాను ఆశీర్వదించారు. ఈ సందర్భంగా చిన్నారి మహీరాకు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపిన రమావత్ రవీంద్ర కుమార్, చిన్నారి ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో నిండు నూరేళ్లు జీవించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు కేతావత్ బిల్యా నాయక్,మాజీ సర్పంచ్ ఉడత అక్రమ్ యాదవ్, అరేకంటి రాములు,సుమన్ నాయక్, జైపాల్, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.



## 32వ వార్డులో ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ పర్యటన

### ::: ప్రజా సమస్యలను నేరుగా అడిగి తెలుసుకున్న ఎమ్మెల్యే

దక్షిణ నియోజకవర్గం శాసనసభ్యులు శ్రీ వంశీకృష్ణ శ్రీనివాస్ గారు ఈరోజు 32వ వార్డు పరిధిలో అధికారులతో కలిసి విస్తృతంగా పర్యటించారు. మెయిన్ రోడ్డు పూతీ వారి మాన్యం నుంచి ప్రారంభమై వార్డులో పలు ప్రాంతాల్లో పర్యటిస్తూ స్థానిక ప్రజలను నేరుగా కలుసుకుని వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా పూతీ వారి మాన్యం పరిసర ప్రాంతాల ప్రజలు తాగునీటి సరఫరా తక్కువ సమయం మాత్రమే జరుగుతోందని ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ గారి దృష్టికి తీసుకువచ్చారు. వెంటనే సంబంధిత వాటర్ సి ఈ పల్లంరాజు గారికి సమస్యను తెలియజేసి, నీటి సరఫరాలో ఇబ్బందులు పునరావృతం కాకుండా తగిన చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే సూచించారు. అలాగే వార్డులోని పలు ప్రాంతాల్లో డ్రైనేజీ కాలువలు, తాగునీటి సరఫరా, విద్యుత్ తదితర సమస్యలను స్థానిక ప్రజలతో ఎమ్మెల్యే చర్చించారు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను క్షేత్రస్థాయిలో తెలుసుకుని, సంబంధిత అధికారులతో సమన్వయం చేసుకుని పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ గారు మాట్లాడుతూ.. నియోజకవర్గంలో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా నిరంతరం కృషి చేస్తున్నామని, రానున్న రోజుల్లోనూ దక్షిణ నియోజకవర్గాన్ని మరింత అభివృద్ధి దిశగా తీసుకెళ్లేందుకు పనిచేస్తామని తెలిపారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించేందుకు కృషి చేస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక కూటమి నేతలు, సీనియర్ నాయకులు, వార్డు ప్రభుత్వ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



## 41వ వార్డులో జనసేనలో భారీ చేరికలు

### ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ సమక్షంలో యువనేత నిఖిలేష్ రాజ్ కుమార్ చేరిక

విశాఖపట్నం: అరుణ ప్రభ దక్షిణ నియోజకవర్గంలో జనసేన పార్టీకి ప్రజాదరణ పెరుగుతోందని, పార్టీ నాయకత్వంపై విశ్వాసంతో యువత, మహిళలు, ప్రజలు పెద్ద సంఖ్యలో పార్టీలో చేరుతున్నారని దక్షిణ నియోజకవర్గం ఎమ్మెల్యే, జనసేన పార్టీ విశాఖ నగర అధ్యక్షులు వంశీకృష్ణ శ్రీనివాస్ తెలిపారు. 41వ వార్డు పరిధిలో నిర్వహించిన కార్యక్రమంలో యువనేత యాండ్రపు నిఖిలేష్ రాజ్ కుమార్ ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ సమక్షంలో జనసేన పార్టీలో చేరారు. ఈ సందర్భంగా నిర్వహించిన బహిరంగ కార్యక్రమానికి పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. జనసేన నినాదాలతో కార్యక్రమ ప్రాంగణం మార్మోగింది. ఈ సందర్భంగా నిఖిలేష్ రాజ్ కుమార్ మాట్లాడుతూ.. దక్షిణ నియోజకవర్గంలో ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలు, ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి చేస్తున్న కృషి తనను ఆకట్టుకున్నాయని తెలిపారు. రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, జనసేన పార్టీ అధినేత పవన్ కళ్యాణ్ నాయకత్వం, ఆశయాల పట్ల ఆకర్షితుడై జనసేనలో చేరినట్లు చెప్పారు.



## డివైడర్‌ను ఢీకొన్న ప్రైవేట్ పాఠశాల బస్సు

### ఇద్దరు విద్యార్థులు, ఉపాధ్యాయురాలు, డ్రైవర్‌కు స్వల్ప గాయాలు

మహేశ్వరం: మీర్‌పేట్ పోలీస్‌స్టేషన్ పరిధిలో సోమవారం సాయంత్రం ప్రైవేట్ పాఠశాల బస్సు అదుపుతప్పి డివైడర్, విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టింది. ఈ ఘటనలో ఇద్దరు విద్యార్థులు, ఓ ఉపాధ్యాయురాలు, డ్రైవర్‌కు స్వల్ప గాయాలయ్యాయి. పల్లవి మోడల్ స్కూల్‌కు చెందిన బస్సు (టీజీ 10 జీ 1079) సోమవారం సాయంత్రం విద్యార్థులను ఇళ్ల వద్ద దించేందుకు బయలుదేరింది. అల్మాస్‌గూడలో 15 మంది విద్యార్థులను దించిన అనంతరం జిల్లెలగూడ వైపు వెళ్తుండగా డ్రైవర్‌కు రక్తపోటు తగ్గి స్పృహ కోల్పోయినట్లు సమాచారం. దీంతో బస్సు అదుపుతప్పి లలితానగర్ చౌరస్తా వద్ద డివైడర్‌ను, విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టింది. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని విచారణ చేపట్టారు.

# ముఖ్యమంత్రి సభకు సర్వం సిద్ధం

## రాష్ట్రం చూపు సిరిసిల్ల వైపు
## అసలు రేపు సిరిసిల్లలో ఏం జరగబోతుంది..?
## పోలీసు వలయంలో సిరిసిల్ల.. జిల్లాలో ఉత్కంఠ

ఎల్లారెడ్డిపేట అరుణప్రభ : రాజన్న సిరిసిల్ల జిల్లాలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పర్యటనకు సర్వం సిద్ధమైంది. ముఖ్యమంత్రి బుధవారం సిరిసిల్లలో పర్యటించనున్న నేపథ్యంలో జిల్లా యంత్రాంగం అధికారిక కార్యక్రమాల ఏర్పాట్లను పూర్తి చేసింది. ముఖ్యమంత్రి పర్యటన నేపథ్యంలో సిరిసిల్ల పట్టణం, పరిసర ప్రాంతాల్లో పోలీసులు భారీ భద్రతా ఏర్పాట్లు చేపట్టారు. ముఖ్యమంత్రి పర్యటనకు సంబంధించి సభా ప్రాంగణం, రాకపోకల మార్గాలు, పార్కింగ్ ప్రాంతాలు, వేదిక పరిసరాలను అధికారులు ఇప్పటికే పరిశీలించారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా పోలీసులు విస్తృత బందోబస్తు ఏర్పాటు చేశారు. విధుల్లో పాల్గొనే పోలీసు అధికారులు, సిబ్బందికి ఉన్నతాధికారులు ఇప్పటికే దిశానిర్దేశం చేశారు.

### సీఎం పర్యటనపై జిల్లాలో ఆసక్తి

ముఖ్యమంత్రి సిరిసిల్ల పర్యటన నేపథ్యంలో జిల్లాలో రాజకీయ, ప్రజా వర్గాల్లో ఆసక్తి నెలకొంది. ముఖ్యమంత్రి సభలో ఏ అంశాలను ప్రస్తావిస్తారు? జిల్లాకు సంబంధించి ఎలాంటి ప్రకటనలు చేస్తారు? అభివృద్ధి పనులకు సంబంధించి ఏమైనా కొత్త హామీలు లేదా నిర్ణయాలు వెలువడతాయా? అన్న అంశాలపై ప్రజల్లో చర్చ సాగుతోంది. సిరిసిల్ల నియోజకవర్గ అభివృద్ధి, పెండింగ్ పనులు, వివిధ ప్రజా సమస్యలు, ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలపై సీఎం దృష్టి సారించే అవకాశం ఉందన్న చర్చ జరుగుతోంది. అయితే సభలో ముఖ్యమంత్రి చేయబోయే ప్రకటనలపై అధికారికంగా వివరాలు వెలువడాల్సి ఉంది.



### పోలీసు వలయంలో సిరిసిల్ల

సీఎం పర్యటనను దృష్టిలో ఉంచుకుని సిరిసిల్లలో భారీ పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. ప్రధాన కూడళ్లు, సభా ప్రాంగణం, ముఖ్యమైన రహదారులు, పార్కింగ్ ప్రాంతాల్లో పోలీసులను మోహరించారు. ట్రాఫిక్ నియంత్రణకు ప్రత్యేక చర్యలు చేపట్టారు. భద్రతా విధుల్లో ఉన్న సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని ఉన్నతాధికారులు సూచించారు. ముఖ్యమంత్రి పర్యటన నేపథ్యంలో సిరిసిల్ల వైపు రాష్ట్రవ్యాప్తంగా అందరి దృష్టి మళ్లింది. రేపటి సభలో సీఎం ప్రసంగం, ఆయన చేసే ప్రకటనలపై సర్వత్రా ఉత్కంఠ నెలకొంది. దీంతో 'రేపు సిరిసిల్లలో ఏం జరగబోతోంది?' అన్న ఆసక్తి జిల్లా ప్రజల్లో నెలకొంది.



## సీఎం జిల్లా పర్యటనకు పటిష్ట భద్రతా ఏర్పాట్లు
### క్షేత్రస్థాయిలో భద్రతా ఏర్పాట్లను పరిశీలించిన పోలీస్ ఉన్నతాధికారులు

ఎల్లారెడ్డి పేట అరుణప్రభ సెప్టెంబర్ 29: రాష్ట్ర ముఖ్యమంత్రి జిల్లా పర్యటన నేపథ్యంలో పోలీస్ ఉన్నతాధికారులు మంగళవారం పటిష్ట భద్రతా ఏర్పాట్లను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. మల్టీ జోన్-I ఐజీపీ చంద్రశేఖర్ రెడ్డి, ఐపీఎస్., వీ.బీ. కమలాసన్ రెడ్డి, ఐపీఎస్ (రిటైర్డ్) ఓఎస్డీ, ఐఎస్‌డబ్ల్యూ డైరెక్టర్, టీజీఐసీసీసీ, సీఎం భద్రత విభాగం ఎస్పీ చక్రవర్తి, జిల్లా ఎస్పీ మహేష్ బి. గితే, కామారెడ్డి ఎస్పీ రాజేష్ చంద్రలు కలిసి సీఎం పర్యటనకు సంబంధించిన భద్రతా ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా హెలిప్యాడ్ నుంచి సీఎం సభా ప్రాంగణం వరకు ముఖ్యమంత్రి ప్రయాణించే మార్గంలో భద్రతా రిహార్సల్స్ నిర్వహించారు. రూట్ క్లియరెన్స్, ట్రాఫిక్ నియంత్రణ, ముఖ్యమంత్రి కాన్వాయ్ రాకపోకలు, బారికేడ్ల ఏర్పాటు తదితర అంశాలను అధికారులు క్షుణ్ణంగా పరిశీలించారు. సీఎం పర్యటన సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా ముందస్తు జాగ్రత్తలతో పటిష్టమైన భద్రతా చర్యలు చేపట్టాలని పోలీస్ అధికారులకు ఉన్నతాధికారులు సూచించారు. విధుల్లో ఉన్న ప్రతి అధికారి, సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని, తమకు కేటాయించిన బాధ్యతలను సమన్వయంతో నిర్వహించాలని ఆదేశించారు.



## బాలికల పాఠశాలలో కొత్త టాయిలెట్లు
### స్పీడ్ బ్రేకర్ల ఏర్పాటుకు చర్యలు.. మంత్రి ఆదేశాలతో పనులు

ధర్మవరం, సెప్టెంబరు 29; (అరుణ ప్రభ న్యూస్) : ధర్మవరం ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో విద్యార్థినులు ఎదుర్కొంటున్న టాయిలెట్ల సమస్య పరిష్కారానికి చర్యలు చేపట్టారు. ఈ నెల 25న విద్యార్థినులు సమస్యలను మంత్రి సత్యకుమార్ యాదవ్ దృష్టికి తీసుకెళ్లగా ఆయన స్పందించి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని సూచించారు. మంత్రి ఆదేశాల మేరకు నియోజకవర్గ ఇంచార్జి హరీష్ బాబు పాఠశాలను సందర్శించి ప్రిన్సిపాల్ సుమనతో కలిసి టాయిలెట్లను పరిశీలించారు. కొత్త టాయిలెట్ల నిర్మాణానికి అంచనాలు సిద్ధం చేయాలని కాంట్రాక్టర్‌కు సూచించారు. విద్యార్థినుల భద్రత కోసం పాఠశాల ఎదుట రెండు స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయాలని మున్సిపల్ అధికారులకు సూచించారు. సమస్యల పరిష్కారానికి చర్యలు చేపట్టడంపై విద్యార్థినులు, ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేశారు.



## మోడల్ హైస్కూల్‌లో మూడు చెట్ల నరికివేత
### అటవీశాఖ రూ.9 వేల జరిమానా

ధర్మవరం, సెప్టెంబరు 29; (అరుణ ప్రభ న్యూస్) : ధర్మవరం పట్టణంలోని మోడల్ హైస్కూల్ అండ్ ఇంటర్ కళాశాల ఆవరణలో మూడు చెట్లను నరికివేయడంతో అటవీశాఖ అధికారులు రూ.9 వేల జరిమానా విధించారు. సమాచారం అందుకున్న ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ అక్కులప్ప సంఘటనా స్థలాన్ని పరిశీలించి, అనుమతి లేకుండా చెట్లను నరికివేయడం నిబంధనలకు విరుద్ధమని తెలిపారు. ఈ విషయంపై ప్రిన్సిపాల్ పద్మశ్రీ మాట్లాడుతూ ఇటీవల చెట్టు కొమ్మ నుంచి పాము తరగతి గదిలోకి రావడంతో విద్యార్థులు భయాందోళనకు గురయ్యారని తెలిపారు. నరికిన చెట్ల స్థానంలో అశోక చెట్లను నాటి ఆ ప్రాంతాన్ని గార్డెన్‌గా అభివృద్ధి చేస్తామని హామీ ఇచ్చినట్లు అటవీశాఖ అధికారి తెలిపారు.



## ఘనంగా కలశపూజ, మండల పూజ

ధర్మవరం, సెప్టెంబరు 29; (అరుణ ప్రభ న్యూస్) : పట్టణంలోని ఎల్‌సీకే పురంలో ఉన్న శ్రీ ధన్వంతరి వైద్య నారాయణ స్వామి ఆలయంలో కలశపూజ, మండల పూజా కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. విగ్రహ ప్రతిష్ఠ అనంతరం 41 రోజుల పూజా కార్యక్రమాల్లో భాగంగా మండల పూజ నిర్వహించినట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. అర్చకులు ప్రత్యేక పూజలు, హోమాలు నిర్వహించారు. స్వామివారిని పట్టువస్త్రాలు, వివిధ రకాల పూలతో అలంకరించారు. బెంగళూరు, చెన్నై, సూరత్ తదితర ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



## కలెక్టర్ శ్యామ్ ప్రసాద్‌తో పరిటాల శ్రీరామ్ భేటీ

ధర్మవరం, సెప్టెంబరు 29; (అరుణ ప్రభ న్యూస్) : శ్రీ సత్యసాయి జిల్లా కలెక్టర్ శ్యామ్ ప్రసాద్‌ను ధర్మవరం నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జ్ పరిటాల శ్రీరామ్ మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. జిల్లా కలెక్టర్ కార్యాలయంలో జరిగిన ఈ భేటీలో జిల్లాలోని పరిస్థితులు, ప్రజలకు సంబంధించిన సమస్యలు, పరిపాలనా అంశాలపై చర్చించినట్లు తెలిపారు. ప్రజలకు అందుతున్న ప్రభుత్వ సేవలు, ప్రజా సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేయాల్సిన అంశాలపై కూడా చర్చించినట్లు శ్రీరామ్ తెలిపారు. భేటీ వివరాలను ఆయన సామాజిక మాధ్యమం ద్వారా వెల్లడించారు.

## మద్యం దుకాణాల లైసెన్సులపై సమావేశం
### ఆరు దుకాణాలకు దరఖాస్తుల ఆహ్వానం

ధర్మవరం, సెప్టెంబరు 29; (అరుణ ప్రభ న్యూస్) : ధర్మవరం ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో రెన్యువల్ కాని ఆరు మద్యం దుకాణాలకు దరఖాస్తుల స్వీకరణపై లైసెన్సుదారులతో సమావేశం నిర్వహించినట్లు ఎక్సైజ్ సీఐ చంద్రమణి తెలిపారు. ధర్మవరం మున్సిపాలిటీ, ధర్మవరం రూరల్, బత్తలపల్లి, తాడిమర్రి, ముదిగుబ్బ మండలాల్లోని ఆరు దుకాణాలకు అక్టోబరు 1 అర్ధరాత్రి వరకు దరఖాస్తులు స్వీకరిస్తామని తెలిపారు. ఆసక్తి ఉన్నవారు ఎక్సైజ్ స్టేషన్‌లో నేరుగా లేదా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. అక్టోబరు 5న జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో లక్కీడ్రా నిర్వహిస్తామని తెలిపారు.





## రైతు సేవా కేంద్రంలో ఉద్యాన రైతులకు అవగాహన
### గ్లోబల్ హార్టికల్చర్ హబ్‌పై క్లస్టర్ స్థాయి వర్క్‌షాప్

ధర్మవరం, సెప్టెంబరు 29; (అరుణ ప్రభ న్యూస్) : గొట్లూరు రైతు సేవా కేంద్రంలో క్లస్టర్ స్థాయి వర్క్‌షాప్ నిర్వహించినట్లు వ్యవసాయ సహాయ సంచాలకుడు లక్ష్మానాయక్ తెలిపారు. అక్టోబరు 2న మదనపల్లిలో గ్లోబల్ హార్టికల్చర్ హబ్ ప్రారంభం నేపథ్యంలో రైతులకు అవగాహన కల్పించారు. హబ్ ద్వారా నాణ్యమైన మొక్కలు, ఆధునిక ప్యాకేజింగ్, శీతల గిడ్డంగులు, ఆహార శుద్ధి కేంద్రాలు, అంతర్జాతీయ మార్కెటింగ్, విలువ ఆధారిత పరిశ్రమలు, ఆధునిక వ్యవసాయ సాంకేతికత అందుబాటులోకి వచ్చే అవకాశం ఉందని తెలిపారు. ఫామ్ పాండ్, వీడ్ మ్యాట్స్‌పై అందించే రాయితీలు, వాటి వినియోగంపై రైతులకు వివరించారు. కార్యక్రమంలో ఉద్యాన అధికారి శ్రీనివాసులు, మండల వ్యవసాయ అధికారి ముస్తఫా, ఉద్యాన సహాయకురాలు ఆశాజ్యోతి, గొట్లూరు ఉద్యాన రైతులు పాల్గొన్నారు.



## మీటర్ రీడర్లకు వేతనాలు చెల్లించాలి
### అక్టోబర్ 1 నుంచి నిరసన: సీపీఐ నేత ముసుగు మధు

ధర్మవరం, సెప్టెంబరు 29; (అరుణ ప్రభ న్యూస్) : విద్యుత్ మీటర్ రీడర్లకు పెండింగ్‌లో ఉన్న వేతనాలను వెంటనే చెల్లించాలని సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి ముసుగు మధు డిమాండ్ చేశారు. 15--20 ఏళ్లుగా విద్యుత్ సంస్థలో విధులు నిర్వహిస్తున్న మీటర్ రీడర్లకు రెండు నెలలుగా వేతనాలు అందలేదని తెలిపారు. మీటర్ రీడర్లు మాట్లాడుతూ ఒప్పందం ప్రకారం చెల్లించాల్సిన మొత్తానికంటే తక్కువగా చెల్లిస్తున్నారని, వేతనాలు అడిగితే విధుల నుంచి తొలగిస్తామని కాంట్రాక్టర్లు బెదిరిస్తున్నారని ఆరోపించారు. ఈపీఎఫ్ బకాయిలపైనా సమస్యలు ఉన్నాయని తెలిపారు. పెండింగ్ వేతనాలను సెప్టెంబరు 30లోగా చెల్లించకపోతే అక్టోబరు 1 నుంచి ఎస్సీ కార్యాలయం ఎదుట నిరసన చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో సీపీఐ పట్టణ కార్యదర్శి పూలశెట్టి రవి, ఏఐటీయూసీ నాయకులు ఎర్రంశెట్టి రమణ తదితరులు పాల్గొన్నారు.



## జనసేనలో 200 కుటుంబాల చేరిక

ధర్మవరం, సెప్టెంబరు 29; (అరుణ ప్రభ న్యూస్) : జనసేన పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిలకం మధుసూదన్‌రెడ్డి సమక్షంలో ధర్మవరం పట్టణానికి చెందిన సుమారు 200 కుటుంబాలు జనసేనలో చేరాయి. ఆటో యూనియన్ నాయకులు మధు (మాధవయ్య), గంగరాజువలి ఆధ్వర్యంలో ఈ చేరికలు జరిగినట్లు తెలిపారు. ఈ సందర్భంగా చిలకం మధుసూదన్‌రెడ్డి మాట్లాడుతూ పవన్‌కల్యాణ్ ఆశయాలు, పార్టీ సిద్ధాంతాల పట్ల ఆకర్షితులై పెద్ద సంఖ్యలో కుటుంబాలు పార్టీలో చేరడం సంతోషకరమన్నారు. ప్రజా సమస్యల పరిష్కారం, అభివృద్ధి, సంక్షేమమే లక్ష్యంగా పార్టీ పనిచేస్తోందని తెలిపారు. పార్టీలో చేరిన వారికి తగిన గౌరవం, బాధ్యతలు కల్పిస్తామని చెప్పారు.

CORPORATE OFFICE: SNEHALA MEDIA PUBLICATIONS LLP, PLOT NO. 267, HUDA SAI NAGAR COLONY, BESIDE COMMUNITY HALL, VANASTHALIPURAM, RR DIST, HYDERABAD 500070. TG. CELL. 9348313999/8885727777.

EDITED, PRINTED, PUBLISHED & OWNED BY GURRAM PAPI REDDY, # H.NO.4-57, THORRUR VILLAGE, ABDULLAPURMET MANDAL, TURKAYAMAL MUNICIPALITY, RANGA REDDY DISTRICT.501511. TELANGANA. PRINTED AT: GARUDA PRINT-ERS, # H.NO.2-86/1, PLOT NO.23-SP, SYNO.417, SAGAR HIGHWAY, RANGANNAGUDA VILLAGE, ABDULLAPURMET MANDAL, TURKAYAMJAL MUNICIPALITY, RANGA REDDY DISTRICT.501510. TELANGANA. PUBLISHED AT: # H.NO.4-57, THORRUR VILLAGE, ABDULLAPURMET MANDAL, TURKAYAMJAL MUNICIPALITY, RANGA REDDY DISTRICT. 501511. TELANGANA....WWW.ARUNAPRABHA.COM.EMAIL.ARUNAPRABHADAILY@GMAIL.COM, RNI NO. TELTEL/2023/89778, CELL NO. 9700127889.